హాయిగా గత వారంరోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 61 పేజీలు: 12 వెల: 6.50



టీ ఆకులు కోస్తూ.. రాగాలు తీస్తూ.. 2లో



# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఓకే

రెండుగంటల చర్చ తరువాత ఏకగ్రీవంగా ఆమోదం

## రాష్ట్ర రాజధాని నవశకంలోకి..

## చర్చలో పాల్గొన్న టిడిపి, బిజెపి, జనసేన, కాంగ్రెస్, సమాజ్‌వాది సహా పలు పార్టీల ఎంపీలు

## వైఎస్సార్సీ ఎంపీల వాకౌట్, నేడు రాజ్యసభకు బిల్లు

**విజయవాడ,ఏప్రిల్1, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈబిల్లు బుధవారం లోక్ సభముందుకు వచ్చింది. 2024జూన్ 2నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టం 2014లోని సెక్షన్ 5(2)కి సవరణ చేస్తూ కేంద్ర హోంశాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సుమారు 2 గంటలపాటు చర్చ తర్వాత అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

**అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలి:** ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమానానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని బిల్లుపై చర్చలో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ఐక్యతకు కంకణబద్ధుడైన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని కొనియాడారు. జగన్ అణచివేత వల్లే అమరావతి ఒక ఉద్యమంగా మారి దేశాన్ని ఆకర్షించిందని పెమ్మసాని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషి స్తున్నాయన్నారు. అమరావతి ఏపీ ఆర్థిక అభివృద్ధిలో >>2

# అంగుళమైనా ఇక కదల్చలేరు

### రాష్ట్రానికి శాశ్వత రాజధాని అమరావతే..

### సుపరిపాలనా యజ్ఞాన్ని అడ్డుకొంటే సహించం: సిఎం

**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అమరావతే ఏకైక రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ఎవరూ అంగుళంకూడా రాజధానిని కదల్చలేరని ఆయన అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రజా వేదిక సభలో ప్రసంగించారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, లోక్‌సభలో చట్టబద్ధత బిల్లుకు ఆమోదం పొందటం ఆంధ్రులకు దక్కిన గౌరవమని సీఎం అన్నారు. బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి.. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆపార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

**సంక్షేమానికి పెద్దపీట:** ప్రతి నెల మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్దఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం >>2



## అమరావతి ఇక అజరామరం

### లోక్‌సభ ఆమోదంపై సిఎం చంద్రబాబు హర్షం

**విజయవాడ,ఏప్రిల్ 1,ప్రభాతవార్తప్రతినిధి:** లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక నిలుస్తోందన్నారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని అన్నారు. రైతుల త్యాగం, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో అమరావతి చట్టబద్ధత కీలక మైలురాయిగా నిలుస్తోందని సీఎం అన్నారు. అమరావతి ఇక అజేయం, అజరామరం. అమరావతిని విశ్వనగరం >>2



## రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం

### డి.సిఎం పవన్

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** లోక్‌సభలో ప్రవేశపెట్టిన అమరావతి రాజధాని బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తంచేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదుకోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. 'తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000ఎకరాలకు పైగా భూములను రాజధానికోసం త్యాగం >>2



## 5కోట్ల ప్రజల ఆకాంక్ష ఇది

### రాష్ట్ర ఐటి మంత్రి లోకేష్

**సచివాలయం,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మా రాజధాని అమరావతి అని భవిష్యత్తులో గర్వంగా చెప్పుకునేందుకు అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించిందని రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తంచేశారు. 5కోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే చారిత్రాత్మకమైన రోజుకు దేశ పార్లమెంట్ వేదిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఒకే రాష్ట్రం – ఒకే రాజధాని నినాదంతో అభివృదిధ వికేంద్రీకరణ విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతిబిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ సందర్భం. కేంద్ర ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన పార్టీలకు కృతజ్ఞతలు, ఇది 5కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతి విజయం, ఆంధ్రప్రదేశ్ >>2

## 482 మంది వైద్యులకు నియామక ఉత్తర్వులు

### మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, ఏప్రిల్1 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజారోగ్య శాఖ ద్వారా శాశ్వత ప్రాతిపదికన 482 మంది వైద్యులకు బుధవారం నియామక ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఉత్తర్వులు పొందిన వారు 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు, బోధనా సుపత్రుల్లో ట్యూటర్ల కేటగిరిలో కలిపి 636 పోస్టుల భర్తీకి కిందటేడాది నోటిఫికేషన్ జారీచేయగా సుమారు 5వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఎంబీబీఎస్ అర్హతతో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రిజర్వేషన్, ఇతర నియమ నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన జాబితాను మార్చి 11న నియామక బోర్డు ప్రకటించింది. దీనికి అనుగుణంగా స్పోర్ట్స్ కేటగిరి మినహాయించి 611పోస్టుల భర్తీ చర్యల్లో భాగంగా ఎంపికైన వారి నుంచి సోమవారం ఉదయం 11 నుంచి మంగళవారం రాత్రి 9 గంటల వరకు ఆప్షన్లు స్వీకరించారు. తొలుత ప్రకటించిన సమయం కంటే అభ్యర్థుల విజ్ఞప్తిమేరకు అప్షన్ల నమోదు సమయాన్ని అదనంగా పెంచారు. నియామక కౌన్సిలింగ్ ప్రక్రియ, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ పూర్తిగా పారదర్శకంగా ఆన్లైన్‌లో జరిగింది. ఆప్షన్లకు అనుగుణంగా 611 పోస్టులకుగాను 482మంది అభ్యర్థులు స్పందించారు.



ఒంటిమిట్టలో బుధవారం సీతారాముల కల్యాణం దృశ్యం



పట్టువస్త్రాలు తీసుకు వెళుతున్న సిఎం చంద్రబాబు దంపతులు

# కల్యాణం..కమనీయం

### ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం

### అయోధ్యను తలపించిన కల్యాణ వేదిక

### పట్టు వస్త్రాలు సమర్పించిన సిఎం చంద్రబాబు

### పవిత్రమైన రోజున 'అమరావతి'కి చట్ట భద్రత

**రాజంపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్టలో పౌర్ణమి రాత్రి కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం సీతారాముల కళ్యాణం ఆకాశమంత పందిరిలో, అయోధ్యను తలపించిన కళ్యాణ వేదికపై ఒంటిమిట్ట కోదండ రాముడు సీతమ్మను మురిపించారు. ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతాయుగంనాటి అయోధ్యను గుర్తుకు తెచ్చేలా కల్యాణవేదికను అందంగా తీర్చిదిద్దారు. వేదిక రంగురంగుల పుష్పాలతో చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఇందుకోసం 5టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. సాయంత్రం 5.10కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీతారాముల కళ్యాణం కోసం విచ్చేసారు. రాష్ట్ర ముఖ్య >>2

# 'మావిగన్' రాజధాని!

### జగన్ 'ప్లాన్-బి' ప్రతిపాదన

### మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాన్ని రాజధాని చేయాలంటున్న మాజీ సిఎం



**విజయవాడ, ఏప్రిల్1, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతికి బదులుగా జగన్ కొత్త రాజధాని ప్రతిపాదన చేశారు. రాజధానికి ప్లాన్ బీ పేరిట జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడ, మచి లీపట్నం, గుంటూరు ప్రాంతాన్ని రాజధాని చేయండని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ద్వారా తెలియజేశారు. మచిలీపట్నం నుంచి విజయవాడకు 70 కి.మీ, విజయవాడ గుంటూరుకు 40కి.మీ ఈ ప్రాంతంలో మొత్తం 110 కి.మీ నేషనల్ హైవే ఉందని ఆయన అన్నార. మావిగన పేరుతో రాజధాని ప్రాంతాన్ని ప్రకటించండని, మావిగన్ అంటే జగన్ గుర్తొ స్తాడనుకుంటే వేరే పేరు పెట్టండని జగన్ సూ చించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఆంధ్రప్రదేశ్ ప్రజల దురదృష్టకరని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. రాజ్యాంగంలో ఎక్కడా రాజధాని అనే పదమే లేదని అమరావతిపై ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నారు. అమరావతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి విషయంలో తమ ప్లాన్ ఫలించలేదని ప్లాన్ బీ అంటూ కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు వైఎస్ జగన్. మచిలీపట్నం నుంచి గుంటూరు వరకు కేపిటల్ ఏరియా కింద డిక్లేర్ చేయాలని, ఆ కేపిటల్ ఏరియాకు మావిగన్ పేరు పెట్టాలని సూచించారు. మచిలీపట్నం నుంచి గుంటూరు వరకు 110 కిలోమీటర్లను 'కేపిటల్ ఏరియా కింద కారిడార్'గా డిక్లేర్ చేయాలన్నారు. దానికి మావిగన్ (మావిగన్ మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు) అని పేరు పెడితే ఈ ప్రాంతం భవిష్యత్తులో గ్రోత్ ఇంజిన్ అవుతుందన్నారు. ఈ మూడు ప్రాంతాల్లో 40 లక్షల జనాభా ఉన్నారని కాస్త ఖర్చు పెడితే బాగా అభివృద్ధి జరుగుతుంది అన్నారు. వైఎస్సార్‌సీపీ అమరావతి ప్రాంతానికే కాదు ఏ ప్రాంతానికీ ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు జగన్. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాజధానులను కేంద్రం నిర్ణయించలేదని ఆయా రాష్ట్రాలే రాజధానులను నిర్ణయించుకున్నాయని పేర్కొన్నారు. 2014- 2019 మధ్య ఐదేళ్లు, 2024 నుంచి 2026 వరకు రెండేళ్లు కలిపి మొత్తం ఏడేళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతికి ఏంచేశారు, భూ ములిచ్చిన రైతులహామీలు నెరవేర్చా >>2

# హర్మూజ్ తెరిస్తేనే 'శాంతి'

### ఇరాన్‌కు ట్రంప్ తాజా షరతు

### భవిష్యత్తులో దాడులుండవన్న హామీ ఇవ్వాలని ఇరాన్ డిమాండ్

### బహ్రెయిన్ అమెజాన్ డేటా సెంటర్‌పై క్షిపణి దాడి

**టెహ్రాన్,టెల్ అవీవ్,వాషింగ్టన్, ఏప్రిల్ 1:** హర్మూజ్ జలసంధినుంచి యధావిదిగా నౌకల రవాణా ప్రారంభించేంతవరకూ మా సైనిక చర్య ఆగదని ట్రంప్ స్పష్టంచేయడంతో మరోసారి ఇరాన్‌పై యుద్ధవాతావరణం పెరిగినట్లయింది. ఇప్పటికే కొత్త నాయకత్వం కాల్పులు విరమణ కోరుతూ తమను సంప్రదించిందని, అయితే హర్మూజ్ జలసంధి ప్రపంచ నౌకా రవాణాకు తెరిచేవరకూ కాల్పుల విరమణను పరిగణనలోనికి తీసుకోబోమని స్పష్టంచేసినట్లుట్రంప్ బుధవారం ట్రూత్‌లో స్పష్టంచేసారు. మరోపక్క మీడియాతో మాట్లాడుతూ అతి స్వల్ప వ్యవధిలోనే ఇరాన్‌పై సైనిక చర్యను ముగించాలనుకుంటున్నామని, అవసరమైతే మళ్లీయుద్ధానికైనా వెనుకాడబోమని



చెపుతుండటం చూస్తుంటే ట్రంప్ మాటలకు చేతలకు పొంతనలేదనిపిస్తోంది. ఇదిలా ఉంటే బుధవారం ఉదయం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై వైమానిక దాడి జరిగింది. అక్కడ ఉన్న పాత అమెరికా రాయబార కార్యాలయంపైనే జరిగిందని అంచనా. దాడిజరిగిన తర్వాత ఆప్రాంగణం చుట్టు పక్కల భవనాల కిటికీలు ధ్వంసం అయ్యాయి. ప్రాంగణం వెలుపల క్షిపణి దాడిజరిగిన ఆనవాళ్లులేవని బాంబుదాడి ప్రాంగణం లోపల జరిగిందని సాక్షులు చెపుతున్నారు. బుధవారం కూడా ఇజ్రాయెల్ అమెరికా యుద్ధవిమానాలు విరుచుకుపడ్డాయి. రాజకీయ నేతల నివాసాలు, సైనిక స్థావరాలు, క్షిపణి గగనతల రక్షణ వ్యవస్థలు, ఐఆర్‌జిసి కమాండ్ సెంటర్లు వంటి వాటిపైనే ముఖ్యంగా ఇజ్రాయెల్ బాంబులు కురిపిస్తోంది. టెహ్రాన్‌లో తోఫిక్‌దారు అనే ఔషద కంపెనీపైనా ఐడిఎఫ్ దాడిచేసింది. ఔషధాల కేంద్రాలపై దాడియుద్ధనేరాలకిందకు వస్తుందని ఇరాన్ హెచ్చరించింది. అలాగే జంజన్‌నగరంలో ఉన్న ప్రసిద్ధ షియా మసీదుపై ఇజ్రాయెల్ అమెరికా సైనికదాడులు జరిగాయి. దాడుల్లో మసీదు ధ్వంసం అయింది. ఇజ్రాయెల్ దాడులకుధీటుగా ఇరాన్‌కూడా అరబ్బు దేశాల్లోని అమెరిక ఆస్థావరాలు, యూనివర్సిటీలు, టెక్‌కంపెనీలపై క్షిపణులు, డ్రోన్లుప్రయోగించింది. ఇరాన్‌క్షిపణులు రాకతో టెల్ అవీవ్‌నగరం మొత్తంసైరన్‌లు మోగాయి. ఇరాక్‌లోని బాగ్దాద్ అమెరికా విక్టోరియా ఎయిర్‌బేస్‌పై దాడిజరిగింది. ఎర్బిల్‌లోని అమెరికా ఆస్తులపై ఇరాన్‌డ్రోన్లు విరుచుకుపడ్డాయి. బహ్రెయిన్‌లోని అమెజాన్‌డేటా సంస్థపైనా ఇరాన్ క్షిపణి దాడిచేసింది. డేటా సెంటర్ మెయిన్‌టార్గెట్ కాక పోయినా సమీపంలో జరిగిన దాడితో డేటా సెంటర్‌కార్యకలాపాలకు అంత రాయం కలిగింది. వర్క్‌లోడ్‌ను ఇతరప్రాంతాలకు బదిలీచేసుకోవాలని అమెజాన్‌క్లౌడ్ కస్టమర్లను అలర్ట్ చేసింది.

# ఐఐటి, నీట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



### ఇంటర్, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ,ఏప్రిల్ 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఐఐటి, నీట్ ర్యాంకులే లక్ష్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ శాఖల అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రతి రీజియన్ పరిధిలో 4 ఏపీ రెసిడెన్షియల్, 4 కెజిబివిల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి, ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ దాదాపు 70శాతానికిపైగా పూర్తయింది అని, ఈరోజు నుంచి ఇంటర్మీడియట్ అకడమిక్ క్యాలెండరు ప్రారంభమైందని, 6వతేదీ నుంచి ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎట్టి పరిస్థితుల్లో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచిత టెక్స్ట్ బుక్స్ పంపిణీ 19నాటికి పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

**అన్నిపాఠశాలలను త్రీస్టార్ కు చేర్చండి:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కనీస మౌలిక సదుపాయాలు కల్పించి త్రీస్టార్ రేటింగ్ కు చేర్చాలని మంత్రి ఆదేశించారు. అన్ని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మనబడి - మన భవిష్యత్తు కింద రూ.2,034 కోట్లు సమీకరించాలని సూచించారు. ఇప్పటికే రూ.770కోట్లతో వివిధ పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులంతా లెర్నింగ్ అవుట్ కమ్స్, విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి సారించాలని, విద్యాప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా మంత్రి పేర్కొన్నారు. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది వయోజన విద్యలో గణనీయమైన >>2

2-4pg2exHMNWJQE 2_2-4pg2exHMNWJQE.qxd 02/Apr/26 12:15 AM Page 1





బుధవారం అసోం టీతోటల్లో కార్మికులతోపాటు ఆకులు కోస్తున్న ప్రధాని మోడీ

# టీ ఆకులు కోస్తూ.. రాగాలు తీస్తూ..

## దిబ్రూగఢ్ టీ తోటల్లో ప్రధాని మోడీ మహిళా కార్మికులతో ప్రధాని ముచ్చట్లు

**దిబ్రూగఢ్, ఏప్రిల్ 1:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం అసోంలోని దిబ్రూగఢ్ జిల్లాలో ఒక టీ తోటను సందర్శించారు. అక్కడ ఆయన మహిళా కార్మికులతో ముచ్చటించి, అసోం టీకి ఉన్న ప్రపంచ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో తన అనుభవాన్ని పంచుకుంటూ, ప్రధానమంత్రి టీని "అసోం ఆత్మ"గా అభివర్ణించారు. అసోం టీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. ఈ పర్యటనను "మరపురాని అనుభవం"గా పేర్కొన్నారు. "ప్రతి ఒక్క టీ తోట కుటుంబం కృషికి తాము చాలా గర్వపడుతున్నాము. వారి కఠోర శ్రమ, పట్టుదల అసోం గౌరవాన్ని పెంచాయి" అని ఆయన మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. పర్యటనకు సంబంధించిన ఫొటోలను పంచుకుంటూ, ప్రధాని మోడీ ఇలా రాసుకొచ్చారు, "తేయాకు కోయడం అనంతరం మహిళలు తమ సంస్కృతి గురించి మాట్లాడారు, ఆ తర్వాత ఒక సెల్ఫీ కూడా తీసుకున్నారు" అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద తేయాకు ఉత్పత్తి ప్రాంతాలలో ఒకటైన అసోం, భారతదేశ తేయాకు ఎగుమతులలో కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ పరిశ్రమ లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. దిబ్రూగఢ్, టిన్సుకియా, జోర్హాట్‌తో సహా పలు జిల్లాల్లోని తేయాకు తోటలలో పనిచేసే వారిలో మహిళల వాటా గణనీయంగా ఉంది. ప్రధాని మోడీ పర్యటనను ప్రతీకాత్మకంగానూ, వ్యూహాత్మకంగానూ పరిగణిస్తున్నారు. ఇది అసోం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగంలో తేయాకు పరిశ్రమ ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. తేయాకు తోటల కార్మికులను ఉద్దేశించి ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఈ పరిశ్రమతో అనుబంధం కలిగిన భారీ సంఖ్యలోని ఓటర్లను విశేషంగా ఆకట్టుకునే అవకాశం ఉంది.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అలాగే తేయాకు ఉత్పత్తితో సహా అసోంలోని కీలక రంగాలకు కేంద్రం అందిస్తున్న మద్దతుపై ప్రధానంగా దృష్టి సారిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా తన ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ప్రధానమంత్రి కొనసాగించే అవకాశం ఉంది.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఓకే

>>కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పిందని పెమ్మసాని చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు.

**అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు:** అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంటులో చర్చ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అమరావతి చట్టబద్ధతకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. అమరావతికి తగినన్ని నిధులు అందించి ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేలా కేంద్రం సహకరించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని మాణికం ఠాగూర్ అన్నారు. మిగిలిన హామీలన్నీ అమలు చేసి విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాలని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో రాజధాని ఏర్పడింది: రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో ప్రకటించారు. రాజధాని విషయంలో గత ప్రభుత్వం చాలా ఇబ్బందులు తెచ్చిందని గుర్తుచేసిన బాలశౌరి ప్రజల పూర్తి మద్దతున్న అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలని కోరారు. దేశం మొత్తం రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపితే వైఎస్సార్సీపీ మాత్రం వ్యతిరేకించడం దురదృష్టకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు సందర్భంగా లోక్‌సభలో కలిశెట్టి మాట్లాడారు. వైఎస్సార్సీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేసి రైతుల త్యాగాలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంబద్ధంగా జరిగిన విభజన వల్ల నవ్యాంధ్రప్రదేశ్‌కు తప్పనిసరి పరిస్థితుల్లో అమరావతి రాజధానిగా ఏర్పడిందని బీజేపీ ఎంపీ పురందేశ్వరి అన్నారు. అలాంటి రాజధానిని వైఎస్సార్సీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు అనిశ్చితిలోకి నెట్టేశాయని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు-2014 పార్లమెంటు ఆమోదం పొందిందని పురందేశ్వరి గుర్తేచేశారు. కాబట్టి రాజధాని మార్పు విషయం కూడా పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాజధాని విషయంలో మరో రాష్ట్రానికి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు అమరావతికి చట్టబద్ధత బిల్లు చట్టరూపం దాల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ఇక మూడు ముక్కలాటలు సాగబోవు - బిజెపి ఎంపీ సీఎం రమేష్:** అమరావతి చట్టబద్ధత చట్టంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇక మూడు ముక్కలాటలు సాగబోవని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉద్ఘాటించారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టాక చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాజధాని అనేది కొన్ని నిర్మాణాల సముదాయమో, ఒక నగరమో కాదని సీఎం రమేష్ అన్నారు. అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అమరావతిని నాశనం చేయడానికే పూనుకుని అదే పనిగా దుశ్చర్యలకు పాల్పడిందని ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 30 ఏళ్లూ ఎన్డీఏ కూటమి పాలనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఎవరూ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదల్చలేరని కుండబద్ధలు కొట్టారు.

**అమరావతి బిల్లుకు వైఎస్సార్సీపీ వ్యతిరేకం:** అమరావతికి వ్యతిరేకం కాదంటూనే చట్టబద్ధత బిల్లును వైఎస్సార్సీపీ వ్యతిరేకించింది. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి పేరుతో హడావుడిగా బిల్లు తెచ్చేస్తే సరిపోదని రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

# 'మావిగన్' రాజధాని!

>> రా అంటూ జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు 2014 నుంచి 2026 వరకు ఈ 12 ఏళ్లలో అమరావతిలో మనస్ఫూర్తిగా లేరన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కుటుంబాలు హైదరాబాద్‌లో ఉంటున్నాయని.. వీరు హైదరాబాద్‌కు షటిల్ సర్వీసు చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అమరావతిలో నాలుగురోజులు కూడా ఉండటంలేదన్నారు. అమరావతిలో 10వేల ఎకరాల్లో బెస్ట్ కేపిటల్ అని చెప్పారని.. ఇప్పుడు మున్సిపాల్టీగానే మిగిలి పోతుందని ఎందుకు అంటున్నారంటూ ప్రశ్నించారు. అమరావతిపై తీర్మానం పేరుతో చంద్రబాబు అసెంబ్లీలో కొత్త డ్రామా ఆడారన్న జగన్.. అసెంబ్లీని జగన్‌ను, వైఎస్సార్‌సీపీ దుమ్మెత్తి పోయడానికి వాడుకున్నారన్నారు. అమరావతి విషయంలో చంద్రబాబు అవినీతి బయటపెడతారనే శాసనమండలి సమావేశం నిర్వహించలేదన్నారు ఏ చట్టాన్నైనా చట్టసభలు తయారు చేయగలవు.. ఆ చట్టాలను చట్టసభలు సవరించగలవు. కానీ ప్రజలను మభ్యపెట్టేలా చంద్రబాబు మాట్లాడుతూ బిల్డప్ ఇస్తున్నారు.. అవినీతి నుంచి డైవర్ట్ చేయడానికే ఈ డ్రామాలు. అమరావతి పేరుతో ముందు 50వేలకుపైగా ఎకరాలు తీసుకుని ఏం చేశారు.. ఇప్పుడు మళ్లీ మరో 50వేల ఎకరాలని ఎందుకు అంటున్నారు. ఉన్నట్టుండి మాస్టర్ ప్లాన్‌ను ఎందుకు మారుస్తున్నారు?. రాజధాని పేరిట చేస్తున్న దోపిడీ నుంచి పక్కదోవ పట్టించడానికే అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించారు. రాజధాని పేరిట పట్టపగలు దోపిడీ చేస్తున్నారు.. లక్ష ఎకరాల అమరావతిలో ఇంతవరకూ కట్టింది ఎం? నిజంగా అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అయ్యిందా?.. రూ.2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వస్తాయి?ఖీ అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు వైఎస్ జగన్.

# కల్యాణం..కమనీయం

>> మంత్రికి ఒంటిమిట్ట హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది.రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి,జెఈఓ శరత్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు,ముఖ్యమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.టిటిడి అతిథి గృహమునకు చేరుకున్న ముఖ్యమంత్రికి టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, టిటిడి బోర్డు సభ్యులు స్వాగతం పలికారు.అనంతరం 6.20కిసీఎం సీతారాముల దర్శనం కోసం ఆలయానికి చేరుకొన్నారు.వేదపండితులు సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరికి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు.ఆలయ రంగ మండపంలో ఆలయ అర్చక స్వాములు వేద ఆశీర్వచనం,ప్రసాదం,శ్రీరామ చిత్ర పటం అందజేశారు.శోభా యాత్ర రామనామ స్మరణతో ఆద్యంతం భక్తి పారవశ్యంతో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ వేదికపై రాత్రి 6.30 గంటలకు కళ్యాణ క్రతువుకు టిటిడి వేదపండితులు రాజేష్ బట్టర్ శ్రీకారం చుట్టారు.గణపతి పూజతో ప్రారంభమై,విశ్వక్షేణ పూజ నిర్వహించారు పుణ్యాహవచనంతో వేదికను శుద్ధి చేసేందుకు పూజ నిర్వహించారు.7.08నిమిషాలకు సీఎం దంపతులుస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.స్వామికి యజ్ఞోపవీతం వేద మంత్రాలతో సమర్పించారు.టిటిడి శ్రీరామచంద్ర ప్రభుకు స్వర్ణ కంకణాన్నిఅలంకరించారు. అనంతరం వేదపండితులు మహా సంకల్పంను కల్యాణానికి వచ్చిన లక్షలాది భక్తులతో చేయించారు.అనంతరం సావధాన ..శుభముహూర్తే శుభలగ్నే సావధాన..లక్ష్మీ నారాయణ. సావధాన అంటూ వేద పండితులు రాత్రి 8.10కు సీతమ్మ మెడలో శ్రీరామచంద్ర ప్రభు మాంగల్య ధారణ చేశారు. కళ్యాణోత్సవం సీఎం తో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రిమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పలువురు శాసన సభ్యులు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీశైలం డ్యామ్ ను సందర్శించిన సేఫ్టీ అథారిటీ బృందం

**శ్రీశైలం ప్రాజెక్టు ఏప్రిల్ 1ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయాన్ని బుధవారం నాడు కేంద్ర డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరి పరిశీలన రెండు రోజులపాటు కొనసాగనున్నది. వీరికి జలాశయం సి. ఈ. కబీర్ భాష సాదర స్వాగతం పలికారు.జలాశయం వ్యు పాయింట్ వద్ద ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డ్యాం స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృందం కు అధికారులు వివరించారు. పరిశీలనలో చైర్ పర్సన్ డ్యామ్ ఎక్స్పర్ట్ డీ.కే. శర్మ ఆధ్వర్యంలో కుల్భాన్ రాజ్ ఆగ్రో మెకానికల్ ఎక్స్పర్ట్ ,పీ.కే.శివరాజన్ డ్యామ్ ఎక్స్పర్ట్ మెంబర్, జే.ఎం.గౌతం జియాలజీ ఎక్స్పర్ట్ సభ్యులు ఉన్నారు. తదుపరి జలాశయం వద్దకు చేరుకొని గ్యాలరీ, క్రస్ట్ గేట్లు, అప్రోచ్ రోడ్,సిలిండర్లు, తదితర వాటి గురించి అధికారులు పూర్తిగా వివరించారు. ఈ బృందం పరిశీలన నేడు కూడా జరగనున్నది.పరిశీలన నివేదిక బృందం ప్రభుత్వంకు నివేదిక అందజేయనున్నారు.

# అమరావతి ఇక అజరామరం

>> గా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుకు సహకరించిన కేంద్రం, ప్రధాని, అమిత్‌షాకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు. బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఏపీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు ఈరోజు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం ఒక చరిత్ర అని సీఎం చంద్రబాబు అన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిని ఎవరూ టచ్ చేయలేరంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# కార్పొరేషన్లలో డివిజన్ల సంఖ్య పెంపు

## అనంతపురంలో 50 నుంచి 62కు పెరుగుదల

**అనంతపురం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో డివిజన్ల సంఖ్యను పెంచుతూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనరేట్ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే శాసనసభ, లోక్ సభ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునఃవిభజన జరపాలని, ఆ మేరకు అసెంబ్లీ సీట్లు, లోక్ సభ సీట్లను 50 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల మార్పులు, చేర్పులపై చర్చ బలంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్లలో కూడా డివిజన్ల సంఖ్యను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రాజకీయ వర్గాల్లో ఏఏ డివిజన్ ఎంత వరకు వస్తుందో అన్నది, ఎవరు పోటీ చేస్తారన్నది ప్రజల్లో చర్చ సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన ప్రకారం రాష్ట్రంలోని ఆయా కార్పొరేషన్లలో ఇప్పుడున్న డివిజన్లు, పెంచిన డివిజన్ల సంఖ్య వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు 50 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 62కు పెంచారు. కర్నూలు కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు 52 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 68కి చేశారు. తిరుపతి కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు 50 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 66కు పెంచారు. కడప కార్పొరేషన్‌లో ఇప్పుడు 50 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 66కు పెంచారు. చిత్తూరు కార్పొరేషన్‌లో ఇప్పుడు 50 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 60కు పెంచారు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఇప్పుడు 54 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 72కు పెంచారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసి) ఇప్పుడు 98 డివిజన్‌లు ఉంటే ఆ సంఖ్యను 120కి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విజయవాడ కార్పొరేషన్‌లో ఇప్పుడు 64 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 86కుపెంచారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పుడు 57 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 76కు పెంచారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పుడు 50 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 62కు పెంచారు.

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు 50 డివిజన్లు ఉంటే ప్రస్తుతం 62కు పెంచారు. విజయనగరంమున్సిపల కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు 50 డివిజన్లు ఉంటే 62కు పెంచారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు 50 డివిజన్లు ఉంటే ఆ సంఖ్యను 60కి పెంచారు. ఈ విధంగా మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల సంఖ్యను పెంచడంతో ఏ డివిజన్ ఎంత వరకు వస్తుంది, ఏ డివిజన్‌లో ఎన్నిఓట్లు ఉంటాయి, ఆయా కొత్త డివిజన్లకు సరిహద్దులు ఏంటి, ఆ కొత్త డివిజన్‌లో ఏఏ కాలనీలు వస్తాయి అన్నది ఎటు చూసినా చర్చ జరుగుతోంది.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మద్దతు

**విజయవాడ ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీతత్వంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ విభజన జరిగి పదేళ్లవుతున్నా ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకపోవడం దురదృష్టకరమన్నారు. అమరావతి రాజధానిగా ఎంతో అభివృద్ధి చెందాలని కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. కాంగ్రెస్ ఆర్ఆర్ ట్యాక్స్‌తో తెలంగాణను దోచుకుంటోందని ఆరోపించారు. ఏపీలో 8విమానాశ్రయాలు ఉంటే తెలంగాణలో ఒకటే ఉందన్నారు. ఎయిర్‌పోర్టుల విషయంలో ప్రభుత్వాలు తెలంగాణను నిర్లక్ష్యం చేశాయన్నారు.

## పంచాయతీరాజ్ శాఖకు అవార్డులపై సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, ఏప్రిల్1 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ స్థాయి అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధి అని బలంగా విశ్వసించే ప్రభుత్వంగా పల్లెల్లో వెలుగులు నింపుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. సుపరిపాలన, పేదరిక నిర్మూలన జీవనోపాధి, మౌలిక సదుపాయాలు ఉత్తమ మండలం, మహిళాస్నేహపూర్వక పంచాయతీ వంటి ఐదు అంశాల్లో వచ్చిన అవార్డులు 21 నెలల సుపరిపాలనకు అద్దం పడుతున్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అత్యుత్తమ విధానాలు, సంస్కరణలతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖను ముందుకు నడిపిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆ శాఖ అధికారులకు ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలిపారు. గ్రామస్వరాజ్య స్థాపనలో మరెన్నో విజయాలు అందుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం

>> చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొందని పవన్ విమర్శించారు. రైతుల పోరాటాలు, మహిళల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలు అసాధారణమైన ధైర్యాన్ని, స్పష్టతను ప్రదర్శించారని కొనియాడారు. స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజలు అభివృద్ధికి, సుస్థిరతకు పట్టం కట్టారని అన్నారు. పార్లమెంటు ఆమోదంతో రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారు ల్లోనూ బలమైన, పునరుత్తేజంతో కూడిన విశ్వాసం ఏర్పడిందని పవన్ అభిప్రాయపడ్డారు. అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్, ప్రధాని మోదీ ఆవిష్కరించిన వికసిత భారత్ లక్ష్యాల సాధనలో అమరావతి కీలకపాత్ర పోషిస్తుందని ఆయన దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

# 5కోట్ల ప్రజల ఆకాంక్ష ఇది

>> ప్రజల విజయం. ఇది రైతులు త్యాగాలకు దక్కిన దైవాశీస్సులు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం. కోట్లాది ప్రజలు కోరికను గౌరవించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా చరిత్ర-సంస్కృతికి అలవాలమైన అమరావతిని నిలిపింది. అమరావతి చట్టబద్ధత బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చ మొత్తం టీవీలో చూశాను.ఉత్కంఠ రేపింది.అమరావతి చరిత్ర-సంస్కృతి,ఆవశ్యకత సభ్యులు వివరిస్తుంటే ఒక ఆంధ్రుడిగా రోమాలు నిక్కబొడుచుకున్నాయి.కేంద్రప్రభుత్వం,దేశంలోని వివిధ పార్టీలు నిలవడం 5కోట్ల ఆంధ్ర ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టింది.లోక్ సభ వేదికగా అమరావతి గొప్పతనం దేశమంతటికి మరోసారి పరిచయమైంది.

దేశ రాజధాని ఢిల్లీలో ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంట్‌లో చరిత్ర సృష్టించిన అమరావతి చట్టబద్ధత బిల్లు చర్చలో పాల్గొనకుండా వైసీపీ సభ్యులు వాకౌట్ చేయడం వారి ద్రోహబుద్ధికి నిదర్శనం,జగన్ ఎన్ని జన్మలెత్తినా అమరావతిలో ఒక్క ఇటుకను తాకలేడు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధినీ ఆపలేడు.నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ శాశ్వతం,నా రాజధాని అమరావతి అజరామరం.

# అంగుళమైనా ఇక కదల్చలేరు

>> లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతి నెల రూ.2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానంతోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు. గత ఏడాది జూన్‌లో తల్లికి వందనం కింద ఆర్థిక సహకారం అందించామని, ఈ ఏడాది జూన్‌లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. దీపం 2.0 కింద ఏడాదికి3 ఉచిత సిలిండర్లను ఇస్తున్నామని, త్వరలోనే ప్రతి ఇంటికి పైపు ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివ రించారు. దీని కోసం ఏడాదికి రూ.2400 సబ్సిడీని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్స్‌గా రూ.1300 కోట్లును ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ 4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.



బుధవారం ఒంటిమిట్టలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

# రాష్ట్రంలో రామరాజ్యం స్థాపన: సిఎం చంద్రబాబు

## జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన కళ్యాణ వేదిక
## శ్రీరాముడు, శ్రీవారి అనుగ్రహంతో ప్రజా రాజధానిగా అమరావతి

**కడప ,ఏప్రిల్ 1 , ప్రభాతవార్త :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి సన్నిధిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన శ్రీ సీతారాముల దివ్య కళ్యాణోత్సవం అనంతరం కళ్యాణ వేదిక వద్ద భక్తులను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ. శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.జై శ్రీరామ్ నినాదాలతో ముఖ్యమంత్రి వేదికపై తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఒంటిమిట్ట శ్రీరాముడు మరియు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో ఆంధ్రప్రదేశ్‌లో రామరాజ్యం స్థాపన జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్టలోని ప్రాచీన శ్రీ కోదండరామాలయాన్ని టీటీడీ ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.ఇటీవల పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసే బిల్లుకు ఆమోదం లభించినట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి, దేవేంద్రుడు పాలించిన దేవతల రాజధాని అమరావతి స్ఫూర్తితో ప్రజల రాజధానిని అభివృద్ధి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం శ్రీరాముడు, శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు.కళ్యాణ వేదిక వద్ద భారీగా తరలివచ్చిన భక్తజన సమూహం మధ్య జై శ్రీరామ్ నినాదాలు మార్మోగగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఐఐటి, నీట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

>> పురోగతి సాధించడం, అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేయడంపై మంత్రి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విద్యా సంవత్సరంలో 24,74,638మంది వయోజన విద్యాశాఖ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. దీంతో గతఏడాది 73శాతంగా ఉన్న అక్షరాస్యత శాతం 83శాతానికి పెరిగినట్లు చెప్పారు. వచ్చేఏడాది నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు.స్కిల్ డెవలప్ మెంట్ శాఖ ద్వారా ఇప్పటివరకు 1,95,078మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆ శాఖ డైరక్టర్ గణేష్ కుమార్ మంత్రి లోకేష్ కు తెలిపారు. ఇప్పటివరకు తమ శాఖ ద్వారా 6.87లక్షలమందికి నైపుణ్య శిక్షణ అందించామని, ప్రస్తుతం 71,193మంది శిక్షణలో ఉన్నట్లు చెప్పారు. 26రంగాల పూర్తిస్థాయి సమాచారంతో నైపుణ్యం పోర్టల్ సిద్ధమైనట్లు చెప్పారు. నిర్మాణరంగంలో జాబ్స్ కు సంబంధించి ఈనెల 3వవారంలో 50 జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో అమరావతిలో వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సిద్ధంగా ఉన్న 87వేలమంది నిర్మాణ కార్మికులకు జాయింట్ సర్టిఫికేషన్, ప్లేస్ మెంట్ పై వర్క్ షాపులో ఎంఓయులు కుదుర్చుంటామని చెప్పారు.

## వారం - వర్జ్యం

02-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, రేవతి కార్తె
○పౌర్ణమి ఉ.7.42
హస్త సా.5.41
వర్జ్యం : రా.2.16-తె.4.00
1)ఉ.10.07-ఉ.10.56, 2)మ.3.03-మ.3.52
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం – మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సువర్ణాభరణముల భద్రత విషయంలో జాగ్రత్తలు అవసరం. బంధువుల కలయికతో ఆనందం కల్గుతుంది.

**వృషభం:** విదేశీయాన ప్రయత్నాలకు సాంకేతిక పరమైన చిక్కులు సంభవించవచ్చును. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** మీరు ఓర్పుగా కష్టించి తగిన ఫలితాలు పొందుతారు. సంఘంలో పెద్ద మనుషులతో పరిచయాలు కలుగుతాయి.

**కర్కాటకం:** మిత్రవర్గం వారికి కొన్ని కష్టాలు కలిగినప్పుడు మీరు ఆదుకోగలుగుతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**సింహం:** దీర్ఘకాలిక పొదుపు పెట్టుబడులు కార్యక్రమాలు ప్రారంభిస్తారు. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**కన్య :** పిల్లల చదువు మీద శ్రద్ధ చూపించి తగిన ఫలితాలు పొందుతారు. క్రీడల యందు ఆసక్తి కలిగిఉంటారు.

**తుల :** ఎంతో సాధించాలన్న మీ తపన పూర్తి స్థాయిలో కాకపోయినా కొంతమేరకు సఫలీకృతమవుతుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:** మానసికోల్లాసం కలిగిఉంటారు. గడియారంతో సమానంగా పరుగు పెడతారు. కాలానికి ప్రాముఖ్యత నిస్తారు.

**ధనుస్సు:** పెండింగ్ పనులు పూర్తి చేయడానికి నూతన ప్రణాళికలను అమలు పరుస్తారు. అందువల్ల లాభపడగలుగుతారు.

**మకరం:** అవుతాయో! కావో! అని అనుమానంతో మొదలుపెట్టిన పనులే ఈరోజు విజయవంతంగా పూర్తవుతాయి.

**కుంభం:** నంష్టలో మీరు ఆశించిన మార్పులను సాధించగలుగుతారు. జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడతాయి.

**మీనం :** రూఢీగా అవుతాయనుకున్న పనులు సాంకేతిక కారణాలవలన వాయిదా పడతాయి. మీ శ్రమ మాత్రమే కనబడుతుంది.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

02-04Pg3exHMNWJQEKL 3_02-04Pg3exHMNWJQEKL.qxd 01/Apr/26 11:50 PM Page 1





# భవిష్యత్‌పై నమ్మకం పెంచిన అమరావతి బిల్లు

## - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభ బిల్లుకు ఆమోదం తెలపడం ఆనందంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ అవమానాలకు ముగింపు పలుకుతూ బలమైన భవిష్యత్‌కు అవకాశం ఇచ్చేలా తాజా బిల్లు లబ్ది చేకూర్చుతుందని అన్నారు. చరిత్రలో నిలచిపోయే బిల్లు లోక్ సభలో ఆమోదం పొందడంలో రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతీ ఒక్కరి శ్రమకు ఫలితం లభిచినట్లు అయిందని వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపేలా పూర్తి తోడ్పాటు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకు, హోంమంత్రి అమిత్ షాకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంకోవైపు చరిత్రలో నిలచే బిల్లుకు పూర్తి స్థాయి మద్దతు ఇవ్వకుండా వైసిపి పార్లమెంట్ సభ్యులు వాకౌట్ చెయ్యడం వారి విధ్వంస వైఖరిని మరోసారి స్పష్టం చేసిందని ఎద్దేవా చేశారు. ప్రపంచ స్థాయి నగరాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్మిస్తుంటే అమరావతిని ఓ స్కాంగా జగన్మోహన్‌రెడ్డి అభివర్ణించడం అయన అజ్ఞానాన్ని, రైతులపై ఉన్న అసూయను స్పష్టం చేస్తోందని స్పష్టం చేశారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా నిజాలు తెలిసిన ప్రజలు కూటమితో కలిసి అభివృద్ధి వైపు నడవడానికే మొగ్గు చూపుతున్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు. లోక్ సభ మద్దతుతో మరింత వేగంగా ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి త్వరలోనే రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు.



## పదోన్నతి పొందిన పోలీస్ అధికారులు నిజాయతీ, కర్తవ్య నిబద్ధతతో సేవలు అందించాలి: డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగంలో పదోన్నతి పొందిన పోలీసు అధికారులు నిజాయతీ, కర్తవ్య నిబద్ధతతో సేవలు అందించాలని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. ఉద్యోగోన్నతి.. వీరి కృషికి గుర్తింపుగా మాత్రమే కాకుండా, మరింత బాధ్యతాయుతంగా పనిచేసే అవకాశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖలో పదోన్నతిని పొందిన ఎపిఎస్‌పి సిబ్బందిని మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో డిజిపి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బెటాలియన్ ఐజి బి రాజకుమారి నేతృత్వంలో సుమారు 300 మంది ఎఆర్ ఎస్‌ఐలు వీరిలో ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం హెడ్ కానిస్టేబుళ్లగా ఉన్న 300 మంది సిబ్బందికి ఎఆర్ ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2014619 కాలంలో ప్రారంభమైన ఉద్యోగోన్నతుల ప్రక్రియ సాంకేతిక కారణాలు, ఎన్నికల నియమావళి కారణంగా నిలిచిపోయినప్పటికీ, ఇప్పుడు వాటిని పూర్తి చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగోన్నతులు రావడం అరుదైన విషయమని డిజిపి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో గార్డుల కోసం నూతనంగా నిర్మించిన సెరిమోనియల్ గార్డ్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు.

# తిరుమల సమాచారం

## తుంబురు తీర్థ ముక్కోటిలో 12, 235 మంది భక్తుల స్నానాలు

**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచల అడవుల్లోని తుంబురు తీర్థ ముక్కోటిలో పౌర్ణమివేళ 12 వేల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలాచరించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు అధికారులు తుంబురు తీర్థానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మార్చి 31 ఉదయం 6 గంటల నుండి నిరంతరాయంగా అన్న ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు భక్తులకు శ్రీవారి సేవకులు పంపిణీ చేశారు. ఇంజినీంగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులు భోజనం చేసేందుకు వీలుగా అవసరమైన షెడ్లు, మార్గమధ్యంలో నిచ్చెనలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఆస్తమా, స్థూల కాయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారిని, 12 ఏళ్ల లోపు పిల్లలను తీర్థానికి అనుమతించలేదు. పాప వినాశనం వద్ద పార్కింగ్ సమస్య కారణంగా భక్తులను ఆర్టీసీ బస్సులలో మాత్రమే అనుమతించారు. టిటిడి భద్రతా విభాగం, పోలీసులు, అటవీశాఖ సిబ్బంది కలసి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



# ఎపికి ప్రత్యేక హోదాపై మాట్లాడని తెలుగు ఎంపిలు :

## రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంటులో ఏపీకి ప్రత్యేక హోదాపై ఒక్క తెలుగు ఎంపీ మాట్లాడక పోవడం దౌర్భాగ్యమని ఆంధ్రప్రదేశ్ ఎంపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి జీవన్మరణ సమస్య అయిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని, వారు ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా, బీజేపీకి బానిసలుగా మారారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి, స్వలాభం కోసం పనిచేస్తున్న ఎంపీలంతా తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇవాళ లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లును కేంద్రం ప్రవేశపెట్టారు.దీనిపై జరిగిన చర్చలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణికం ఠాగూర్ ప్రసంగించారు. ఈ నేపథ్యంలోనే, తెలుగు ఎంపీలపై షర్మిల విరుచుకుపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. పార్లమెంట్ వేదికగా ఏపీ విభజన హామీల గురించి గళం విప్పిన మాణికం ఠాగూర్‌కు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొ న్నారు. అయితే, ఆయన మాట్లాడుతున్నప్పుడు రాష్ట్రం నుంచి గెలిచిన ఒక్క ఎంపీ కూడా మద్దతుగా నిలబడకపోవడం తెలుగుగడ్డ చేసు కున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. "మన ఎంపీలకు స్వలాభం మిన్న, రాష్ట్ర ప్రయోజనాలు సున్నా. పేరుకు మాత్రమే వేర్వేరు పార్టీల ఎంపీ లు, కానీ అందరూ మోదీకి భజనపరులే. బీజేపీ బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప, 11 ఏళ్లు గడుస్తున్నా హోదా ఏమైందని అడిగే దమ్ము ఒక్కరికీ లేదు" అని షర్మిల ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తామని లిఖితపూర్వకంగా చెబుతున్నా, రాజధాని అమరావతి నిర్మాణానికి సాయం చేయలేమని స్పష్టం చేస్తున్నా ఎంపీలు నోరు మెదపడం లేదని ఆమె విమర్శించారు. ఇప్పటివరకు విభజన హామీలలో 5 శాతం కూడా అమలు కాలేదని, అయినా మన ఎంపీలు మౌనం వహిస్తూ ఖిగుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నార నిఖి ఘాటుగా వ్యాఖ్యానించారు. "2014లోనే విభజన హామీల విలువ 5 లక్షల కోట్లు. అది మన చేతిలో ఉన్న చెక్కు లాంటిది. కానీ మన ఎంపీల అసమర్థత వల్లే దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోలేకపోతున్నాం. తెలుగువారి ఆత్మగౌరవాన్ని, పౌరుషాన్ని ప్రధాని మోదీ కాళ్ల దగ్గర తాకట్టుపెట్టారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించే ధైర్యం లేదు.



## చల్లపల్లి ఘటనలో గాయపడిన పోలీసు సిబ్బందితో ఫోన్లో మాట్లాడిన మంత్రి అనిత

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** చల్లపల్లి పోలీసుస్టేషన్‌లో జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన పోలీసు సిబ్బందితో మంత్రి అనిత ఫోన్ లో మాట్లాడారు. ప్రస్తుతం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మంత్రి ఈరోజు ఫోన్ ద్వారా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనకాపల్లి జిల్లా పర్యటనలో ఉన్న నేపథ్యంలో, మంత్రి ఆదేశాల మేరకు వీఓడీ అనిల్ పులిపాటి ఆసుపత్రికి వెళ్లి బాధితులను ప్రత్యక్షంగా పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను మంత్రి ఆదేశించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించి, అవసరమైన సహాయం అందించడానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## ముగిసిన శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని వసంతోత్సవ మండపంలో మూడు రోజులు జరిగిన సాలకట్ల వసంతోత్సవాలు బుధవారం ముగిశాయి. తొలిరోజు, రెండవ రోజు శ్రీ మలయప్పస్వామివారు తన ఉభయ దేవేరులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొనగా చివరిరోజున శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పతో బాటుగా సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు వసంతోత్సవ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడుసేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా టిటిడి రద్దు చేసింది.

కార్య క్రమం లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం దంపతులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ శుక్లా

**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్ల బుధవారం ఉదయం దర్శించుకున్నారు. తెలంగాణ గవర్నర్ హోదాలో తొలిసారిగా తిరుమలకు వచ్చిన ఆయనకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. దర్శనానంతరం టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు.



# అమరావతికి చట్టబద్ధత ఒక మైలురాయి!

- కూటమికి వేసిన ఒక్క ఓటుతో రాష్ట్రానికి వందల లాభాలు - రాజధానితో మూడు ముక్కలాట ఆడిన జగన్
- వైసిపి నెవర్ అగైన్ అనేది అందరూ గుర్తుంచుకోవాలి - ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండ మండలం లత్తవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి పయ్యావుల

**ఉరవకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తుండటం అనేది ఒక మైలురాయి అని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం లత్తవరం గ్రామంలో బుధవారం మంత్రి లబ్దిదారుల ఇంటివద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ కూటమికి వేసిన ఒక్క ఓటువల్ల రాష్ట్రానికి వందల లాభాలు చేకూరాయని ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తోందని అనడానికి అమరావతి రాజధాని మరో మైలురాయిగా నిలుస్తోందన్నారు. వేసిన ఒక్క ఓటు అమరావతికి వేల కోట్ల సహాయాన్ని కేంద్రం అందించిందని, ఒక్క ఓటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిందని, ఒక్క ఓటు విశాఖ ఉక్కు కాపాడిందని, ఒక్క ఓటు రైల్వే లైన్లకు 70వేల కోట్ల పెట్టుబడి ఇచ్చిందని, 70వేల కోట్లతో మరో జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించిందని, గూగుల్ ప్రాజెక్టులు రావడానికి, ప్రజలు వేసిన ఒక్క ఓటుకి కూటమి ప్రభుత్వం న్యాయం చేసే దిశగా ముందుకు సాగుతోందన్నారు. మరో మైలురాయి అమరావతిని చట్టబద్ధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా కేంద్రంలో, పార్లమెంటులో చట్టం రూపంలో తీసుకువస్తుండటం అనేది ప్రజలు వేసిన ఓటుకి మరో ముందడుగు, మరొక నమ్మకాన్ని కలిగించే దిశగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంగా అందరూ గుర్తించాలని కోరారు. మూడు రాజధానుల పేరుతో ప్రజల జీవితాలతో మూడు ముక్కలాడిన జగన్మోహన్‌రెడ్డి ఒకవైపు అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే అభివృద్ధి మీద దృష్టి పెట్టి శాశ్వతంగా ఉండేలా అమరావతి అంటే అది ఒక రాజధాని కాదని, రాష్ట్రంలో చదువుకొంటున్న ప్రతి యువకుడికి ఒక ఉద్యోగ, ఉపాధి కల్పించే అవకాశం అని, ప్రతి ఒక్కరికి ఆదాయాన్ని ఉత్పత్తి చేసేటువంటి స్థానం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షిస్తున్నారన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు పార్లమెంటులో అమరావతి రాజధాని అని చట్టం జరగబోతున్నందుకు ప్రతి ఆంధ్రుడు గర్వపడాలన్నారు. దానికి కృషి చేసినటువంటి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను ప్రతి ఆంధ్రుడు రుణపడి ఉండాలన్నారు. మరొకసారి మోసపోకుండా ఉండేందుకు చట్టం రూపంలో తీసుకురావడం జరుగుతోందని తెలిపారు. 9 సార్లు మాట మార్చినటువంటి ఆనాటి ముఖ్యమ ంత్రి జగన్మోహన్‌రెడ్డి 30వేల ఎకరాలుండాలని, రాష్ట్రానికి నడిబొడ్డులో ఉండాలని, ఇది గ్రోత్ ఇంజన్ ఇన్‌కమ్ జనరేట్ చేసే స్థాయి ఉండాలన్నారని అయితే రాజధాని అమరావతికి నడిబొడ్డులో పెడితే మాత్ర ం కుదరదు 3 రాజధానులు పెట్టండంటారని నాలుక మడతేయడం ఆయనకు వచ్చినట్లుగా బహుష ఎదరికీ రావని మనసులో విషయం పెట్టుకొని బయటకు మాత్రం మేము కాదని చెబితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. పార్లమెంటులో చట్టబద్ధతపై జరిగిన చర్చలో వైసీపీ వాకౌట్ చేయడంబట్టి చూస్తే జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రాజధానిని కోరుకొంటున్నాడా లేక రాజధాని లేకుండా ప్రజలను నవ్వులపాలు చేయాలని కోరుకొంటున్నాడా అన్నది ప్రజలు గమనించాలన్నారు. వైసీపీ ఈ సమాజానికి హానికరమని వైసీపీ నెవర్ అగేన్ అనేది ప్రతి ఆంధ్రుడు గుర్తుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.


## రూ.125కోట్లు దాటిన మార్చినెల హుండీ ఆదాయం

**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వేసవిసెలవులకు ముందే దేశవిదేశాల నుండి భారీగా భక్తులు తరలివచ్చారు.గడచిన మార్చినెలకు సంబంధించి 31రోజులకుగాను 24,47,958మంది భక్తులు దేవదేవుని దర్శనం చేసుకున్నారు. కానుకల రూపంలో హుండీకి 125.76కోట్లు రూపాయలు ఆదాయం లభించింది.గత ఏడాదిలోనూ, ఈ ఏడాది నూతన సంవత్సరంలోనూ ప్రతినెలా 110కోట్లు రూపాయల నుండి 120కోట్లు రూపాయల మధ్య ఉండే ఆదాయం మార్చినెలలో 125కోట్ల రూపాయలకు పరిమితమైంది. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకొన్న తరువాత కానుకల రూపంలో హుండీకి నగదు,నగలు సమర్పించుకోవడం పరిపాటి. ఇందుకు నిదర్శనంగా మార్చి నెలలో హుండీ ఆదాయం గమనిస్తే 23వతేదీ 5.12కోట్లురూపాయలు, 30న 5.08కోట్లు, 24న 4.46కోట్లు, మార్చి 9న 4.41కోట్లు, 10న 4.38కోట్లు,మార్చి 1న 4.49కోట్లు, 11న 4.78కోట్లు ఇలా వరుసగా ఆదాయం లభించింది. ఇక ఆ నెలలో వరుసగా సరాసరి 3.50కోట్ల రూపాయల పైగానే రోజువారీగాఆదాయం చేకూరడంతో 31రోజులకు సంబంధించి 125.76కోట్ల రూపాయలు మార్కును అధిగమించింది. రానున్న రెండునెలలు కూడా వేసవిసెలవులతో రద్దీ విపరీతంగా ఉంటుంది. భారీగా భక్తులు తిరుమలకు చేరుకునే అవకాశం ఉంది. స్వామివారి హుండీ ఆదాయం మరింత రెట్టింపయ్యే సూచనలు ఉంటుందనేది టిటిడి వర్గాల అభిప్రాయం. కాగా మార్చినెలలో తిరుమలకు చేరుకుని ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య 24.47లక్షల మంది వరకు చేరింది. మార్చి నెల 14న అనూహ్యంగా 85,132మంది భక్తులకు రికార్డుస్థాయిలో వెంకన్న దర్శనం చేయించారు. మార్చి 15న 82,057మందికి, 28న 82,040మందికి, 22న 86,3091మంది, 29వతేదీ 80,744మంది,మార్చి 7న 82,838మంది, 24న 79వేలమంది భక్తులకు ఇలా సరాసరి రోజువారీగా 75వేలమంది వరకు భక్తులు మహాలఘులో ఇష్టదైవమ్ ఏడుకొండలస్వామి దర్శనం చేసుకునేలా టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు.

## గాజువాకలో ఎల్ఐసి ఏజెంట్‌పై యాసిడ్ దాడి సిసిటివిలో రికార్డు

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త) విశాఖపట్నం** నగరంలోని గాజువాక పరిధి అక్కిరెడ్డిపాలెం మల్లమ్మగుడి సమీపంలో ఎల్ఐసీ ఏజెంట్‌పై జరిగిన యాసిడ్ దాడి కలకలం రేపింది. రాత్రి సమయంలో ఇంటి బయట కూర్చున్న వెంకట అప్పారావు అనే ఎల్ఐసీ ఏజెంట్‌పై మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా వచ్చి యాసిడ్ చల్లి పరారైన ఘటన చోటుచేసుకుంది. దాడి వల్ల ముఖం, మెడ భాగాల్లో గాయాల పాలైన వెంకట అప్పారావును కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆర్‌కే ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాల్లో నిందితుడు నేరుగా బాధితుడి వద్దకు చేరుకుని చేతిలో తెచ్చుకున్న ద్రవాన్ని ముఖంపై చల్లి పరుగెత్తుకుంటూ వెళ్లిన దృశ్యాలు స్పష్టంగా నమోదయ్యాయి. దాడి జరిగే ముందు కొద్దిసేపు పరిసరాలను గమనించినట్లు కూడా వీడియోలో కనిపించినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వ్యక్తిగత విభేదాల కోణంలోనూ, పూర్వ పరిచయాల ఆధారంగానూ విచారణ కొనసాగిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి గుర్తింపుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.

## శ్రీవారి ఆశీస్సులతో మంచి జరగాలని ప్రార్థించాం : తిరుమలలో ప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగురాష్ట్రాల ప్రజలకు మంచి జరగాలని, ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించినట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం వేంకటేశ్వరస్వామివారిని విఐపి బ్రేక్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణ, తెలంగాణ నేత గంగుల కమలాకర్, సినీ నటుడు కుటుంబం అల్లు స్నేహారెడ్డి పిల్లలతో, కన్నడ కథానాయకురాలు తార, సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మన్యం యువకుడి సత్తా.. కోటి ప్యాకేజీతో గూగుల్ కొలువు

**పాలకొండ, (పార్వతీపురం మన్యం జిల్లా), ఏప్రిల్ 1 ప్రభాతవార్త** మండలానికి చెందిన సాధారణ కుటుంబంలో పుట్టి తెలుగు మీడియంలో చదివిన ఓ యువకుడు తన ప్రతిభతో అద్భుతాన్ని సృష్టించాడు. టెక్నాలజీలో వస్తున్న సరికొత్త మార్పులను అందిపుచ్చుకొని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ ఏఐలో నైపుణ్యం సాధించి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గూగుల్‌లో రూ.కోటి వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం సంపాదించాడు. వివరాల్లోకెళ్తే పార్వతీపురం మన్యం జిల్లాకు పాలకొండ పడమట గ్రామానికి చెందిన బొద్దాన సంతోష్ సాధించిన ఈ ఘనత మన్యం జిల్లా పూర్తి దాయకముగా నిలుస్తుందండములో సంకోచం లేదు. ఇంతవరకు పాలకొండ నుంచి కోటి రూపాయలు కొలువు సాధించిన ఘనత సంతోషికే దక్కుతుందని గ్రామస్తులు అభినందిస్తున్నారు. కళ్యాణ్ ప్రసాద్ పార్వతీ దంపతుల కుమారుడు సంతోష్ తండ్రి స్థానికంగా ఓ చిన్న చిరు దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సంతోష్ పదవ తరగతి ఇంటర్మీడియట్ వరకు తెలుగు మీడియం లోనే విద్యను అభ్యసించారు. ఇంజనీరింగ్ విద్య 2015లో రాజాం జిఎంఆర్ లో బీటెక్ పూర్తి చేశారు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా తొలి ఉద్యోగం సాధించారు. అంతరం ఎస్బిఐలో డేటా సైంటిస్ట్ విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పని చేశారు. ఉన్నత శిఖరాలను చేరాలన్న తపనతో చేస్తున్న ఉద్యోగాలను విడిచిపెట్టి రీసెర్చ్ రంగం వైపు అడుగు ముందుకు వేశారు.



ప్రముఖ బోసచ్ కంపెనీ రీసెర్చ్ విభాగంలో చేరి జర్మనీ స్విట్జర్లాండ్ వంటి దేశాలలో పలు ప్రాజెక్టులపై ప్రజెంట్ స్టేషన్లో ఇచ్చి ది బెస్ట్ అవార్డును కూడా గెలుచుకున్నారు. ఈ గ్యాప్ లో ఎంటెక్ డేటా సైంటిస్ట్ పూర్తి చేసి ఏ ఐ కు సంబంధించిన పలు సర్టిఫికేషన్ కోర్సులు కూడా పూర్తి చేశారు. ప్రగతిని చూసిన మైక్రోసాఫ్ట్ ఏఐటీయూ నుంచి బెస్ట్ ఆఫర్ సంతోష్ కు వచ్చింది కానీ దాని కాదనుకొని గూగుల్ వైఫ్ దృష్టి సారించారు. గూగుల్ నిర్వహించిన పది రౌండ్ల కఠినమైన ఇంటర్వ్యూ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి రూ. కోటి వార్షిక ప్యాకేజీతో సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజనీరుగా గూగుల్ ఏఐ ఎంఎల్ విభాగము లో ఎంపికయ్యారు. అన్నమయ్య జిల్లాకు చెందిన అదునుకోట యశ్వంత్ కూడా కాలిఫోర్నియాకు చెందిన కంపెనీలో రూ 2.5 కోట్ల వార్షిక ప్యాకెట్ తో ఉద్యోగం సంపాదించిన విషయం తెలిసిందే.

## డిప్లొమా ఇన్ యోగా కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు

**తిరుపతి,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని వ్యాయమ విభాగంలో 2026-27 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ యోగా,పి. జి డిప్లొమా ఇన్ యోగ ఎడ్యుకేషన్ కోర్స్ ల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 28 వతేదీ నుండి దరఖాస్తు ఫారాలు పొందవచ్చని పిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్యురాలు ఆచార్య జి. సారా సరోజినీ తెలిపారు. మరిన్నివివరాలకోసం యూనివర్సిటీ వెబ్ సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌పిఎంవివి.ఎసి.ఇన్"లో పొందగలరని తెలిపారు.

# కష్టాల్లో ఉన్న తల్లికి కొండంత అండ

## - బాలరాజు వైద్యానికి ముఖ్యమంత్రి హామీ

**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** కష్టాల్లో ఉన్నాం బాబూ.. కొడుకు ఆరోగ్యం విషమంగా ఉంది. భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది అంటూ కన్నీళ్లు పెట్టుకున్న ఒక పేద తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొండంత భరోసా నిచ్చారు. మానవత్వమే పరామావధిగా సాగుతున్న పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బుధవారం వింజమూరు పంచాయతీ జై భీమ్ నగర్‌లో ఒక భావోద్వేగ సన్నివేశం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన యరగొర్ల బాలమ్మకు వితంతు పింఛన్ అందించేందుకు ముఖ్యమంత్రి స్వయంగా ఆమె ఇంటికి వెళ్లారు. పింఛన్ అందుకున్న ఆనందంలోనే తన గుండెల్లో ఉన్న భారమంతా ముఖ్యమంత్రి ముందు ఉంచింది బాలమ్మ. తన చిన్న కుమారుడు బాలరాజు గత కొంత కాలంగా తీవ్రమైన కాలేయ(లివర్) వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉఆన్నడని, పెళ్లై మూడేళ్లు కాకముందే అనారోగ్యం పాలయ్యాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పసి గుడ్డుతో ఉన్న ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని వివరించింది. ఒక ముఖ్యమంత్రిగా కాకుండా, ఇంటి పెద్దగా బాలమ్మ మాటలను సావధానంగా విన్న చంద్రబాబునాయుడు తక్షణమే స్పందించారు. ధైర్యంగా ఉండు బాలమ్మ, నీ కొడుకును ప్రభుత్వం కాపాడుకుంటుంది అని భరోసా ఇచ్చారు. బాలరాజుకు అవసరమైన చికిత్సను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారిక పర్యటనలో భాగంగా వెళ్లినప్పటికి, ఒక సామాన్య కుటుంబం పడుతున్న వేదనను చూసి చలించిన ముఖ్యమంత్రి మానవత్వమే గొప్పదని చాటిచెప్పారు. బాలమ్మ కుటుంబం ఊపిరి పీల్చుకుంది.



## మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### - మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.మొక్కజొన్న రైతుల సమస్యను సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారని,కేంద్రానికి లేఖ రాసి పరిస్థితిని వివరించారని,ౖతులకు భారం కాకుండా ఉండేలా కేంద్రం నుండి అదనపు సహా యం, నిధులు తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. అధిక వ్యయాలు, అంతర్జాతీయ పరిస్థితులు, గల్ఫ్ యుద్ధకారణాలతో మార్కెట్‌లో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. పంటలరైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు మార్క్‌ఫెడ్ కొనుగోళు చేపట్టి రైతులకు భరోసా కల్పించిందన్నారు.


వార్త

మాటకు మాట ప్రతీకారం కాదు
మౌనమే దానికి సమాధానం.
- ప్లినీ

# చల్లారని మంటలు

పశ్చిమాసియా యుద్ధమేఘాలు ఆకాశాన్నంటుతున్నాయి. యుద్ధంలో ప్రధానపక్షాలు, వాటి మిత్ర దేశాలు సైతం మంటల్లో మాడి మసైపోతున్నాయి. యుద్ధం గగనతలం నుంచి భూతలం మీదకు చేరుకోగానే గల్ఫ్ దేశాల్లో భయాందోళనలు వెల్లువెత్తాయి. ఉభయ పక్షాలు ఎవరికి వారే వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని భీష్మించుకు కూర్చున్నాయి. యుద్ధపక్షాలు ఒకరి ఆర్థిక మూలాలపై మరొకరు దెబ్బకొట్టే వ్యూహాల్లోనే ఉన్నారు. యుద్ధ సన్నాహాల్లో అనిశ్చితి అంటూ ఏమీలేదు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూనే ఉన్నారు. శ్వేత సౌధాధినేత ట్రంప్ వాగాడంబరం బాగా ఎక్కువైంది. ఆయన ఎన్ని వ్యాఖ్యానాలు చేసినా ఎవరూ నమ్మలేని పరిస్థితి. ఒకానొక సమయంలో ట్రంప్ వెనుకడుగు వేసినా అసలు సిసలు ఈ యుద్ధానికి ప్రోది చేసినా ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు మాత్రం ససేమిరా అన్నారు. మళ్లీ ట్రంప్ రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇరాన్‌లోని చమురు నిల్వలకు, ఆ దేశ వాణిజ్యానికి గుండెకాయవంటి 'ఖర్గ్' ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకోగలిగింది. ముందుగా యుద్ధానికి తాత్కాలిక విరమణ అనగానే ట్రంప్ మాటలను ఎవరూ పట్టించుకోలేదు. ప్రత్యర్థి పక్షాలను శాంతింప చేసినట్లు చెబుతూనే ఒక్కసారిగా దాడిచేయటం యుద్ధ ప్రక్రియలో ఒక భాగమే. అమెరికా ఆయుధ సంపత్తి, ఇజ్రాయెల్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన అధునాతన ఆయుధాలతో పోల్చిచూస్తే ఇరాన్ ఆయుధ సంపత్తి, సైనిక దళాలు, డ్రోన్‌లు వంటి ఎన్ని ఆయుధాలున్నా తక్కువే. అయినా ఇరాన్ తుదకంటూ పోరాడాలన్న లక్ష్యం పెట్టుకోవడం విశేషం. నెలరోజులు దాటిన ఈ యుద్ధంలో ఇరాన్‌కు అపార ప్రాణనష్టం, ఆర్థిక నష్టం చేకూరింది. అయినా ఎక్కడా వెనుకడుగు వేయలేదు. అమెరికా, సైనిక, వైమానిక స్థావరాల లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తూ అమెరికా అవాక్స్ విమానాన్ని ధ్వంసం చేయగలగడం ఎవరూ ఊహించని పరిణామం. దాంతో అమెరికా పాలకుల్లో కాస్తంత ఉలికిపాటుకు గురయ్యారు. ఈ ఒక్క విమానం ధ్వంసం కావడం వల్ల అమెరికాకు 6వేల కోట్ల నష్టం వాటిల్లింది. యుద్ధ పర్యవసానంగా ఇరాన్ సైన్యం 2వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రోజురోజుకీ యుద్ధ పరిణామాలు మారిపోతున్నాయి. వివిధ గల్ఫ్‌దేశాలు ఇరాన్ దెబ్బకు బెంబేలెత్తిపోయాయి. అమెరికాతో ఉన్నందుకు పునరాలోచనలో పడ్డాయి. అమెరికా దుందుడుకు చర్యలను ఆదేశ వాసులే వ్యతిరేకిస్తున్నారు. ఎనలిస్టులు సైతం ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా కూడా పెద్ద మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోందని విశ్లేషిస్తున్నారు. ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకోవడానికి జరిగిన ప్రయత్న సమయంలోనే ఇరాన్‌కు మద్దతుగా యెమెన్‌లోని హౌతీలు యుద్ధ రంగంలోకి ప్రవేశించారు. దక్షిణ ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణితో దాడిచేశారు. ఇజ్రాయెల్‌లోని సున్నితసైనిక స్థావరాలే లక్ష్యంగా హౌతీదాడులు పెరిగిపోతున్నాయి. హౌతీల ప్రవేశం నిర్ణయాత్మక మలుపుగానే యుద్ధ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ ఇజ్రాయెల్‌ల మధ్య ఉద్రిక్తతలు ఆపడానికి తెరవెనుక కొన్ని దేశాలు మధ్యేమార్గంగా కొన్ని చర్యలు చేపట్టారు. నోటికొచ్చినట్లు యుద్ధ అంశాల్నిప్రస్తావిస్తూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు యుద్ధ వాతావరణంపై ఉపశమనం కలిగించేటట్లు కాక ఉద్రిక్తతలు పెంచే స్థాయిలో ఉన్నాయి. అలా అని ట్రంప్ వాక్ స్వాతంత్ర్యంపై ఎవరూ వ్యాఖ్యానించేందుకు సిద్ధంగా లేరు. నాటో, యూరోపియన్ దేశాలు సైతం ట్రంప్‌నిర్ణయాలకు బాసటగా నిలిచే స్థాయిలో యోచించట్లేదు. తన ఆధీనంలో ఉన్న హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్త చమురు రవాణాకు పెద్ద ఆటంకమేర్పడ్తోంది. చమురు సంక్షోభం ఏర్పడి ఇబ్బంది పడ్తున్న అన్ని దేశాలు అమెరికా నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నాయి. అయినా పెద్దగా మాట్లాడలేకపోతున్నాయి. ఇరాన్ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడమే అమెరికా లక్ష్యం. ఏప్రిల్ 6వ తేదీలోగా తమ షరతులకు అంగీకరించకుంటే ఇరాన్ చమురు మౌలిక వనరులపై దాడులు తప్పవని అమెరికా హెచ్చరిస్తోంది. ఉభయపక్షాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణను ఇరాన్ కోరినందు వల్లనే తాము దయతో అంగీకరించామన్న ధోరణిలో ట్రంప్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలన్నీ ప్రపంచవ్యాప్త జనాన్ని గందరగోళ పరచడానికే. ఇటీవలనే గల్ఫ్ దేశాలు తమ ఇంధన వనరులపై ఇరాన్ దాడులను వ్యతిరేకిస్తూ అమెరికా పంచన చేరాయి. అంతే గల్ఫ్‌దేశాలు తమ భద్రతకు అమెరికా బాసటగా ఉంటాయన్న నమ్మకంతో ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ తొలుత ప్రకటించినట్లు వారిఅన్వేషణ, యుద్ధ ప్రేరేపణలకు కారణం ఇరాన్‌లోని అణుకేంద్రాల నుంచి సుమారు 450 కిలోల శుద్ధి చేసిన యురేనియంను స్వాధీన చేసుకోవడం కోసమే. వాటి స్వాధీనం కోసం అమెరికా సైనిక చర్యకు దిగుతుందని భావిస్తున్నారు. ఈ చర్య యుద్ధ జ్వాలలు మరింత ఎగిసిపడే స్థాయికి చేరుకోవచ్చు. ఇరాన్ తాము అణ్వాయుధాలు తయారీకి ప్రయత్నించటం లేదని, అలాంటి కార్యక్రమమేదీ తమ వద్దలేదని స్పష్టం చేసినప్పటికీ అమెరికా, ఇజ్రాయెల్‌లు నమ్మడంలేదు. ఏదో అనుమానం ఆవహించి ఇరాన్‌పై చర్యలు వేగవంతం చేయాలని ప్రయత్నిస్తోంది. యుఎస్, ఇజ్రాయెల్ తెరవెనుక వ్యూహాల్లో ఇరాన్ నుంచి యురేనియం స్వాధీన మొక్కటేచర్చల్లో ఉందనిపిస్తోంది. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధించాలన్న ఏకైక లక్ష్యమే ఈ యుద్ధానికి నేపథ్యమని తెలిసిందే. దీనిపై అమెరికా మరింత తీవ్ర నిర్ణయం తీసుకుంటే యుద్ధం మరో కోణంలోకి మారిపోయే అవకాశముంది.

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.



ఆస్కార్ వైల్డ్

ప్రస్తుతమున్న అవకాశాన్ని వాడుకోలేని వారు ఎన్ని అవకాశాలిచ్చినా ఏమీ చేయలేరు.



జార్జి ఇలియట్

## ప్రజావాక్కు



### కుల,మతరహిత సమాజం కావాలి

ఏప్రిల్ ఒకటినుండి దేశవ్యాప్తంగా సెన్సస్2027 ప్రారంభం అవుతుందని కేంద్రం ప్రకటించింది. అందులో 33 ప్రశ్నావళి తో ఇంటింటికి వెళ్ళి సమాచారం సేకరిస్తారు అనికూడా ప్రకటించింది. సహజీవనం చేసేవారికి హోదా కల్పిస్తామని కూడాప్రకటించింది. సహజీవనమంటే యేమిటో చెప్పాలి. ఈసేకరణ కుల,మత సంఘాలను పెంచే విధంగా ఉండరాదు. మనది సెక్యులర్ దేశం. అందుకు అనుగుణగా పరిపాలన ఉండాలి. కులసంఘాలను, మత సంఘాలను పెంచేవిధంగా ఈసెన్సెస్ ఉండరాదు. ఈ రోజుప్రపంచవ్యాప్తంగా పదిదేశాలలో కులమతరహితులుగా 70శాతం ఉన్నారు. చైనా, జపాన్, నార్వే, బ్రిటన్, ఆస్ట్రేలియా లాంటిదేశాలలో ఎక్కువగా ఉన్నారు. కుల మత రహిత సమాజం చాలా ఉన్నత విలువలు కలిగిన సమాజంగా గుర్తింపుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఎవరి జీవితం వారి చేతుల్లోనే..

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల భారిన పడుతున్నారు. పాతకాలం రోజులేబాగుండే అని. తాతముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీమారిన జీవనశైలిని మార్చుకొనేందుకుఇష్టపడట్లేదు. మనం తినేఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమతగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిరుప్రాయంలోనే ప్రాణాంతకమైన జబ్బులతో అకాల మరణం పాలు చేస్తున్నాయి. మనం చేస్తున్న తప్పులను ఎవరైనా సరిదిద్దుకొమ్మని చెప్పినా వినే స్థితిలో లేము.

- డా.తండు మురళీ మోహన్, హైద్రాబాద్

### ఓటర్ రైట్స్ యాక్ట్ తీసుకురావాలి

వినియోగదారుల హక్కులు వాలేనే 100 రూపాయలు చెల్లిస్తే డబ్బుకు రసీదు ఇవ్వాలి. నాణ్యత లేకుంటే వారంటీ కింద రిపేర్, గ్యారెంటీ కింద రీప్లేస్మెంట్ ఇవ్వాల్సి ఉంది కానీ ఇప్పుడు మేమడుగుతున్నది ఓటర్ హక్కుల గురించి ఓటుకు రసీదు కావాలి. హామీల అమలుకు గ్యారెంటీ కావాలి. గెలిచిన అభ్యర్థి ప్రజలకు సేవ చెయ్యనిచో వారిని రీప్లేస్మెంట్ వారంటీ ఇవ్వాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేయాలి లేనిచో రికల్ చెయ్యాలి.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### జూదగాళ్లుగా మారుతున్న యువత

భారతదేశ ఆర్థిక ముఖచిత్రం గతకొన్ని ఏళ్ళలో గణనీయమైన మార్పులకు లోనైంది. గతంలో వాటా మార్కెట్ పరిమిత వర్గాలకే సాధ్యమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల స్మార్ట్‌ఫోన్ ఉన్నప్రతిఒక్కరూ పెట్టుబడిదారులుగా మారుతున్నారు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం సానుకూల అంశమే అయినప్పటికీ, వాటా వ్యాపారం గంభీరమైన పెట్టుబడి ప్రక్రియ నుండి ఒక సరదా ఆటలా రూపాంతరం చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ధోరణి వల్ల యువతలో విశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణ లాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది. ఆధునిక డిజిటల్ వేదికలుపెట్టుబడి ప్రక్రియను ఒక వీడియో క్రీడ ఆడినంత సులభంగా మార్చేశాయి. రంగు రంగుల రేఖాచిత్రాలు, ఆకర్షణీయమైన రూపకల్పనలు వినియోగదారుని నిర్ణయాత్మక శక్తిని ప్రభావితం చేస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సోలార్ విద్యుత్‌పై దృష్టి

భారతదేశం ఇంటర్నేషనల్ సోలార్ అలియాన్స్‌ను ప్రతిపాదించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో విద్యుత్ అందించడం అది కుడాతిరిగి రూపొందించగలిగే లేదాతిరిగి పొందగలిగే రూపంలోనిది కావడం. ఫాసిల్ ఫ్యూయల్ కాకుండా తిరిగి పొందగలిగే వనరుల నుండి విద్యుత్ తయారు చేయదంముఖ్యం. అంత మాత్రమేకాదు భూమిమీద వేడి పెరగడం కాలుష్య కాసారాలుగా నగరాలు మారడం గమనించవచ్చు. దానికి ఢిల్లీ ఒక ప్రత్యక్షఉదాహరణ. ఇలా మారడానికి కారణం ఏమిటి అని ఆలోచించకుండా ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు ఉదాహరణకు అమెరికా వంటి దేశాలు బాధ్యతరాహితంగా మారడం గమనించవచ్చు. ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు బాధ్యతగా ఆలోచించాలి.

- భారత అవినాష్ ,జనగామ

### గ్రామసభలు నిర్వహించాలి

తొంభైతొమ్మిది రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 12.769 గ్రామాలలో వికలాంగుల గ్రామసభలు నిర్వహించాలి. ఈ సభలో 2016 వికలాంగుల చట్టం గురించి వికలాంగులకు అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. వికలాంగుల భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, వారిపై దాడులు, దౌర్జన్యాలు, వివక్షత చూపిన వారిపై వికలాంగుల చట్టం ప్రకారం శిక్షి ంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అమెరికాపై సన్నగిల్లుతున్న అరబ్ ఆశలు

**ఇరాన్ అత్యున్నత నాయకుడితోపాటు ముఖ్యమైన సైనిక, ఇతర నేతలు మృతిచెందినప్పటికీ అక్కడ అంతర్యుద్ధం రాలేదు, ప్రభుత్వం పడిపోలేదు. తక్కువ సమయంలోనే లొంగదీసుకోవచ్చు అనుకున్న అమెరికా ఇజ్రాయిల్ ఆలోచనలను తుత్తునియాలు చేస్తూ ఇక్కడ ఇరాన్ దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధపడ్డది అంటేయుద్ధాన్ని మొదలు పెట్టడం అమెరికా వంతైతే దాన్ని ముగించడం ఇరాన్ చేతుల్లోకి వెళ్లిపోయిందన్నమాట. జలసంధిపై ఇరాన్‌కు పట్టుండడంవలన చమురునౌకల రాకపోకలపై నియంత్రణలు విధించి ప్రపంచ చమురు అవసరాలకు అంతరాయం కలిగిస్తున్నది. ఫలితంగా చమురుధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సరైన చమురు అందుబాటులో లేక రోజురోజుకు రవాణా కష్టతరమైపోతున్నది. యుద్ధం ఎన్నటికీ పరిష్కారం కాదు. చర్చలేపరిష్కారం కాబట్టి యుద్ధంలో ఉన్నదేశాలు సంయమనం పాటించి చర్చించుకొని పరిష్కరించుకుంటే మేలు.**

డా.కావలి చెన్నయ్య

పశ్చిమాసియా లేదా మధ్య ప్రాచ్యంలో మారణ హోమం మొదలై సుమారు నెల కావొస్తుంది అంతం మెప్పుడనేది అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న! అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ, ఇజ్రాయిల్ ఆపరేషన్ రోరింగ్ లయన్ పేర్లతో ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ సంయుక్తంగా దాడి చేసి ఇరాన్ అత్యున్నత నేతఆయతుల్లా అలీ ఖోమైని, ఇతర ముఖ్యమైన నాయకులు, సైనికాధికారులను దారుణంగా హతమార్చింది. ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం విస్తృత ప్రాంతీయ సంఘర్షణగా మారి ఎంతో మంది ప్రాణాలను, ఆస్తులను హరించి వేస్తున్నది. గల్ఫ్ దేశాలు(పర్షియన్ పరివాహక ప్రాంతంలో ఉన్న దేశాలు గల్ఫ్ దేశాలు సౌదీ అరేబియా, ఖతర్, బహ్రెన్, ఒమన్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లు)అమెరికాకు సహాయం అందిస్తున్నాయని ఇరాన్ క్షిపణులను గల్ఫ్ పైకి ప్రయోగిస్తుంది అక్కడున్న అమెరికా సైనిక స్థావరాలే కాక పౌర ప్రాంతాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, చమురు కేంద్రాలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, నీటి శుద్ధి కేంద్రాలు, పరిపాలన కార్యాలయాలు, సామాన్య ప్రజలు కూడా సమిధలవుతున్నారు. గల్ఫ్ దేశాలకు, వాటికి దగ్గరగా ఉండే ఇరాన్, ఇరాక్, సిరియా, లిబియా లాంటి ముస్లిం దేశాలకు జీవనాడి చమురు, సహజవాయువులు. ఇరాన్ దాడులను అరబ్, పశ్చిమ దేశాలు తీవ్రంగా ఖండిస్తూ తీవ్రమవుతున్న సంక్షోభాన్ని అరికట్టే మార్గాల అన్వేషణ చేస్తూనే గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్(జిసిసి)కి చెందిన మంత్రులు ఒక అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం జరుగుతున్న దాడుల వలన తాము సామూహిక ఆత్మ రక్షణ చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున స్థాయిని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు గల్ఫ్ దేశాలు ఇరాన్పై ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోనప్పటికీ ఈ దాడులవల్ల ఆ ప్రాంతాలలో పౌరులకు, కీలకమైన మౌలిక సదుపాయాలకు జరుగుతున్న నష్టాలు కారణంగా ఆ దేశాలు సైతం ఈ ఘర్షణలో ఇరుకపోవాల్సి వస్తుందని బహరేన్‌కు చెందిన దేరాసప్ సెంటర్ విశ్లేషించింది. గల్ఫ్‌లో జరుగుతున్న పరిణామాల పరిశీలన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 51 క్రింద కఠినమైన అంతర్జాతీయ జవాబుదారీతనం ఉండితీరాలని డిమాండ్ తెరపైకి వస్తుంది. రోజురోజుకు యుద్ధం ముదిరి ఇరాన్ చేస్తున్న ఎడతెరిపిలేని దాడుల వల్ల గల్ఫ్ ప్రాంత దేశాలు అమెరికాతో ఉన్న తమ భద్రత సంబంధాలను పున పరిశీలించుకునేలా ఆలోచిస్తున్నాయి. ఈ పరిణామాలు భవిష్యత్తులో వారి వ్యూహాత్మక భాగస్వామ్య స్వరూపాన్ని, వారి రక్షణ వ్యూహాలను పరిరక్షించుకోవడానికి పూనుకునే అవకాశాలు ఉన్నాయి. 1930–40ల మధ్య అమెరికా గల్ఫ్ దేశాల మధ్య రక్షణపరమైన వ్యూహాత్మక, దౌత్య సంబంధాలు చమురు అన్వేషణకోసం మొదలై 1945లో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి రుజ్‌వెల్ట్ సౌదీ అరేబియా రాజు అబ్దుల్ అజీజ్‌ల భేటీ, చమురు భద్రతా ఒప్పందాలతో బాగా బలపడ్డాయి. 1990–91 నాటి గల్ఫ్ యుద్ధం/ కువైట్‌పై ఇరాక్ దురాక్రమణ (ఆపరేషన్ డెసర్ట్ స్టార్మ్) పర్యవసరంగా సైనిక పరంగా మరింత దగ్గర కావడం చేత గల్ఫ్‌దేశాల భద్రతకు అమెరికా పెద్దపీటవేసి అక్కడ 8 శాశ్వత సైనిక స్థావరాలతో పాటు, 11 కీలకమైన ఇతర సైనిక మండలాలను అంటే మొత్తంగా 19పైగా సైనిక సంబంధిత స్థావరాలు సౌదీ అరేబియా, ఖతర్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ల ప్రాంతీయ రక్షణ, తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం నెలకొల్పింది. కానీ ప్రస్తుతం గల్ఫ్‌లో



ఇరాన్ దాడి చేస్తుండడం వల్ల అమెరికాపై గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ వైఖరిలో భిన్నమైన మార్పులు వస్తున్నాయి. ఇరాన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి హార్మూజ్ జలసంధి సంక్షోభం తలెత్తకుండా చూడాలని గల్ఫ్ దేశాలు అమెరికాపై ఒత్తిడి తెచ్చాయి. మరో విశ్లేషణ ప్రకారం ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడిచేయడం వలన ఇరాన్ గల్ఫ్‌పై దాడులు మొదలు పెట్టిందనే విషయాన్ని అమెరికా విస్మరిస్తుందని ఆరోపణలు వస్తున్నాయి. ఇన్నాళ్లు గల్ఫ్‌దేశాలు అమెరికా కల్పించే భద్రతను నమ్ముకొని ఉన్నాయి అని ప్రస్తుత యుద్ధం ఆ దృక్పథాన్ని మార్చి వేసిందని చెప్పవచ్చు. గల్ఫ్‌దేశాల వ్యూహాత్మక ఆలోచనలో మార్పు వచ్చి గల్ఫ్ రక్షణ కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేయవచ్చు. ఫలితంగా అమెరికా గల్ఫ్ సంబంధాలు దెబ్బతిని అమెరికా ప్రయోజనాలకు గండిపడవచ్చు. ప్రస్తుత సంక్షోభం నుంచి నేర్చుకోవలసిన అంశాల గురించి చర్చకోసం మార్చి 16వ తేదీన అరబిక్ పాడ్కాస్ట్ 'ఏహతా'లో చర్చించారు. ఇరాన్, గల్ఫ్‌లోని అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకోవడం వలన గల్ఫ్ దేశాల భద్రత బలహీన పడిందని, ఇక్కడ తమకు ఖర్చుతో కూడుకున్న అమెరికా సైనిక స్థావరాలు ఉన్నప్పటికీ రక్షణ కరువైందని, అమెరికా దుందుడుకు వైఖరి వల్ల తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందని, అమెరికా ఉద్రిక్తతలను మరింతగా పెంచుతున్నదని, ఇరాన్ తమపై నిరంతరాయంగా దాడులు చేస్తూనే ఉన్నదని, అమెరికా పట్టించుకోవడంలేదని, ఇది గల్ఫ్‌లోని ప్రజలకు అమెరికా నమ్మక ద్రోహం/ మోసం చేస్తుందనే భావనను రేకెత్తిస్తున్నది. అమెరికా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇరాన్‌దాడుల వల్ల గల్ఫ్ దేశాలను ప్రమాదంలోకి నెట్టివేస్తుందని భావిస్తున్నప్పటికీ ఇప్పటికిప్పుడు అమెరికాతో భద్రతా భాగస్వామ్యాన్ని వదులుకోలేవు. మరో పక్క అమెరికావల్ల నిరాశ చెంది చైనా, రష్యా వైపు కొత్త భాగస్వామ్యం కోసం ఆలోచిస్తున్నప్పటికీ అది ఆచరణ సాధ్యం కాకపోవచ్చని ఏహతాలో జరిగిన పాడ్కాస్ట్ సమావేశంలో చర్చించిన నిపుణులు చెప్పారు. అయినప్పటికీ గల్ఫ్ దేశాలకు అమెరికాతో ఉన్న భద్రత భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూనే ప్రాంతీయ రక్షణ, దౌత్య స్వయం ప్రతిపత్తిని అభివృద్ధి చేయాలని గల్ఫ్ దేశాలు ఆలోచిస్తున్నాయి. ఒకవేళ ఈ యుద్ధం ముగిసిన తర్వాత కూడా గల్ఫ్‌దేశాలు అమెరికాతో ఉన్నరక్షణాత్మక, దౌత్యపరమైన సంబంధాలను వదులుకోవడానికి సిద్ధంగా లేవని ఈ మధ్యనే ఖతార్ అల్ జజీరా టీవీలో ఒక చర్చ జరిగింది. కానీ ఈ పరిణామాలన్నీ గల్ఫ్ దేశాలను ఏదో ఒక ముందుఅడుగు వేయడానికి పురిగొల్పుతాయని అనడంలో సందేహంలేదు. మరోపక్క అమెరికా అందించే రక్షణతో పాటు యూరోప్లో బలమైన దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలతో గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ కు ఉన్న విస్తృతమైన సంబంధాలు పునసమీక్షించుకునేందుకు దారితీస్తుంది. ఎందుకంటే ఈ యుద్ధసమయంలో తమ పై దాడి జరుగుతుంటే ఏఒప్పందం పనికిరాకుండా పోయిందనే భావన. గల్ఫ్‌దేశాలే ఇరాన్‌పై దాడిచేయాలని ప్రేరేపించాయని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సౌదీ అరేబియా విషయంలో ఇది నిజమని చాలామంది అభిప్రాయపడుతున్నారు. నిజానికి ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దాడుల వల్ల ఖోమేని నిరంకుశ ప్రభుత్వం పోయి తమకు అనుకూలమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడుతుందని ఇటు గల్ఫ్‌దేశాలు, అమెరికా, ఇజ్రాయిల్‌లుభావించాయి. కానీ ఈ యుద్ధం ఇరాన్ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందని చెప్పవచ్చు. ఇరాన్ అత్యున్నత నాయకుడితోపాటుముఖ్యమైన సైనిక, ఇతర నేతలు మృతిచెందినప్పటికీ అక్కడ అంతర్యుద్ధం రాలేదు, ప్రభుత్వం పడిపోలేదు. తక్కువ సమయంలోనే లొంగదీసుకోవచ్చు అనుకున్న అమెరికా ఇజ్రాయిల్ ఆలోచనలను తుత్తునియాలు చేస్తూ ఇక్కడ ఇరాన్ దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధపడ్డది అంటేయుద్ధాన్ని మొదలు పెట్టడం అమెరికా వంతైతే దాన్నిముగించడం ఇరాన్ చేతుల్లోకి వెళ్లిపోయిందన్నమాట. జలసంధిపై ఇరాన్‌కుపట్టుండ డంవలన చమురునౌకల రాకపోకలపై నియంత్రణలువిధించి ప్రపంచ చమురు అవసరాలకు అంతరాయం కలిగిస్తున్నది. ఫలితంగా చమురుధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సరైన చమురు అందుబాటులో లేక రోజురోజుకురవాణా కష్టతరమైపోతున్నది. యుద్ధం ఎన్నటికీ పరిష్కారం కాదు. చర్చలేపరిష్కారం కాబట్టి యుద్ధంలో ఉన్నదేశాలు సంయమనం పాటించి చర్చించుకొని పరిష్కరించుకుంటే మేలు. ●

# యుద్ధ సెగలతో కములుతున్న సాగు

ఇ. శ్రీనివాస్ రావు

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ సెగలు.. వేల మైళ్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్షిపణుల మోతలు ఇరాన్, ఇజ్రాయెల్ సరిహద్దుల్లో వినిపిస్తున్నా వాటి వల్ల పెరిగే ఎరువులు, ఇంధన ధరల మోత మాత్రం మన రైతుల జేబుల్లో మోగుతోంది. ఇది కేవలం భౌగోళిక లేదా రాజకీయ సంక్షోభం మాత్రమే కాదు, మన దేశ వ్యవసాయ రంగాన్ని, ఆహార భద్రతను కుదిపేసే పరిణామం. వ్యవసాయం అత్యంత సున్నితమైన రంగం. ప్రపంచవ్యాప్తంగా యూరియా, ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల తయారీకి అవసరమైన సహజ వాయువు సరఫరాలో పశ్చిమాసియా దేశాలదే కీలకపాత్ర. యుద్ధ ఉద్రిక్తతల వల్ల సరఫరా చైన్ దెబ్బతిని, ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. దీనికి తోడు వ్యవసాయం పూర్తిగా డీజిల్‌పైనే (ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా) ఆధారపడి ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే, ఆభారం నేరుగా డీజిల్ రూపంలో సాగు ఖర్చును అమాంతం పెంచుతుంది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగు చేసే రైతులకు పెట్టుబడి వ్యయం తడిసి మోపెడవుతున్నా.. దానికి తగ్గ గిట్టుబాటు ధర దక్కకపోవడం వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతుంది. పశ్చిమాసియా యుద్ధంతో వాణిజ్య రవాణాకు కీలకమైన ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి మార్గాల్లో కల్లోలం నెలకొంది. దీనివల్ల నౌకా రవాణా, బీమా ఖర్చులు భారీగా పెరిగాయి. దీని



ప్రత్యక్ష ప్రభావం తెలుగు రాష్ట్రాల ఎగుమతులపై పడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి ఇరాన్, తదితర గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే బియ్యం, మిర్చి, రొయ్యల (ఆక్వా) రవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎగుమతులు మందగిస్తే వేలాది మంది రైతులు, మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతుంది. అయితే, ప్రతి సంక్షోభం ఒక అవకాశాన్ని కూడా మోసుకొస్తుంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్న నేపథ్యంలో, ఇతర దేశాలు తమ అవసరాల కోసం ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపు చూస్తాయి. మన బియ్యం, పప్పుధాన్యాలు, మసాలా దినుసులకు గ్లోబల్ మార్కెట్లో కొత్త డిమాండ్ సృష్టించుకోవడానికి ఇదొక అవకాశం. సరైన వ్యూహంతో అడుగులు వేస్తే భారతీయ రైతులకు ఇది వరంగా మారే అవకాశం లేకపోలేదు. సాగు ఖర్చు పెరిగి రైతులు ఎరువుల వాడకం తగ్గిస్తే అది నేరుగా దిగుబడుల పతనానికి, తద్వారా దేశీయంగా ఆహార సంక్షోభానికి దారితీస్తుంది. ఈ ముప్పును ప్రభుత్వాలు ముందుగానే పసిగట్టాలి. ప్రత్యామ్నాయదేశాల నుంచి ఎరువుల దిగుమతికి మార్గాలు అన్వేషించడం, రైతులకు డీజిల్, ఎరువులపై సబ్సిడీల భారాన్ని ప్రభుత్వమే భరించడం తక్షణ కర్తవ్యం. అలాగే ఎగుమతిదారులకు అండగా నిలిచి, నూతన మార్కెట్లను అభివృద్ధి చేయాలి. పశ్చిమాసియా సంక్షోభాన్ని కేవలం విదేశీ వ్యవహారాల కోణం లోనే కాకుండా, దేశీయ వ్యవసాయ, ఆర్థిక కోణంలో విశ్లేషించుకోవాలి. ఈ సంక్షోభాన్ని దీర్ఘకాలిక వ్యూహాలతో ఎదుర్కొవాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ●

# నియోజకవర్గాల పెంపు అవసరమా?

డాక్టర్ టి. సేవకుమార్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో లోక్ సభ స్థానాలను, రాష్ట్రాల శాసనసభలలో అసెంబ్లీ స్థానాలను, ప్రస్తుతం ఉన్న స్థానాలకు 50శాతం పెంచాలని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ప్రతిపక్షాలు నియోజక వర్గాల పెంపుకు అంత తొందర ఎందుకని ప్రశ్నిస్తున్న కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇంకా స్పీడ్‌పెంచుతోంది. తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక పునర్విభజన చట్టాలున్నా, 2001లో రాజ్యాంగ సవరణద్వారా వాయిదా వేసిన ఈప్రక్రియ, ఈసంవత్సరం అంటే 2026లో జరగాల్సి ఉంది. కోవిడ్ కారణంగా 2021లో జనాభా లెక్కలు జరగకపోవటం, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదిక చూస్తే పెరగకపోగా, కొన్ని నియోజక వర్గాలు తగ్గిపోవటం తదితర కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. దక్షిణాది రాష్ట్రాల ఉనికి పార్లమెంట్‌లో తగ్గిపోతుందని ఆయా దక్షిణాది రాష్ట్రాలు బలంగా నిరసన వ్యక్తంచేయడంతో ఆ సమస్యను ఎలా సరిచేయాలనే విషయంలో చర్చలు కూడా జరుగుతున్నాయి. భిన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం హఠాత్తుగా నియోజవర్గ పునర్విభజన ప్రక్రియను తెరపైకి తెచ్చింది. పార్లమెంటులో లోక్‌సభ స్థానాలు, ఏప రాష్ట్రాలలో ఎన్ని అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి? మహిళల కోట, ఎస్సీ, ఎస్టీ కోటాలలో ఏమాత్రం పెరుగుతాయి? పెంపుదలకు రాజ్యాంగబద్ధ సవరణలు తదితర విషయాలను పక్కన పెడితే ప్రస్తుత దేశ, రాష్ట్రాలలో నెలకొని ఉన్న ఆర్థిక, సామాజిక, సాంఘిక పరిస్థితులలో అసలు ఈ నియోజకవర్గాల పెంపు అవసరమా?అన్న అంశాన్ని ఇక్కడ చర్చిద్దాం. మన రాజ్యాంగం, చట్టసభలకు ఎన్నుకోబడిన లోక్‌సభ సభ్యులు గాని, శాసనసభల సభ్యులుగాని ప్రజాహిత చట్టాలు చేయడమే వారి ప్రధాన విధిగా పేర్కొంది. ఆ చట్టాలను అమలు చేయడం బ్యూరోక్రాట్లు, అధికారులు పని. కానీ మనదేశంలో, రాష్ట్రాలలో జరుగుతున్నది ఏమిటి? ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన, చర్చించాల్సిన ప్రధాన విషయం ఇది. ఎన్నికల బూత్ స్థాయి నుండి రాష్ట్ర, కేంద్ర స్థాయివరకు ప్రతి చిన్న విషయంతో కలిపి అన్ని విషయాలలో ఎమ్మెల్యేల, ఎంపీల అనైతిక ప్రాబల్యం ఏ మేరకు పెరిగిపోయిందో అందరం చూస్తూనే ఉన్నాం. ఎమ్మెల్యే అన్న, ఎంపీ అన్న ఆ నియోజకవర్గంలో తామే సర్వం అనే భ్రమలను ప్రజలకు కల్పించారు. అంతేకాక అధికార పార్టీల అనుచరగణం కర్ర పెత్తనం అంతా ఇంతా కాదు. దీనివల్ల అధికార, ప్రతిపక్షాల మధ్య, ప్రజల మధ్య తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సమాజం, ప్రజలు పార్టీల పరంగా విడిపోక తప్పని పరిస్థితులు దాపురించాయి. దేశంలోని చాలా గ్రామాలలో కక్షలు, కార్పణ్యాలు పెరిగిపోతున్నాయి. ఏదో ఒకపార్టీ సపోర్ట్ లేకపోతే కొన్ని గ్రామాలలో నివసించలేని పరిస్థితులు వచ్చాయంటే ప్రజాస్వామ్యం దేశంలో ఏస్థాయికి దిగజారిందో అర్థమవుతుంది. ఇదో అంశం అయితే, మరో అంశం చట్టసభలలో ప్రవేశించే వారి రాజకీయ, పాలన అనుభవం, రాజ్యాంగం, చట్టసభలు, చట్టాలు, సమాజ పరిస్థితులు తదితర విషయాలలో కనీస పరిజ్ఞానం ఏమిటో ఆలోచించాల్సిన అవసరం ఉంది. పార్టీలను, కులాలను, మతాలను చూసి డబ్బు, మద్యం ఇచ్చి మభ్యపెట్టే అభ్యర్థులను గెలిపిస్తున్నారు తప్ప వారిలో చట్టసభలో ఒక అంశంపై మాట్లాడే, చర్చించే శక్తి సామర్థ్యాలు చూసి గెలిపించడం లేదు. వ్యక్తిని చూసి ఓట్లు వేసే పరిస్థితి ఏనాడో పోయింది. నియోజక వర్గాలు పెరిగితే సభ్యుల సంఖ్య పెరగడం తప్ప, రాజ్యాంగం కల్పించిన లక్ష్యాలు ఏమాత్రం నెరవేరవు. అందులో ఎట్టిసందేహమూ అవసరం లేదు. ఇప్పుడు చట్టసభలలో ఏమి జరుగుతుందో అందరికీ తెలుసు. అధికార, ప్రతిపక్ష పార్టీలు వాగ్వివాదానికి దిగటం, ప్రతిపక్షం వాకౌట్ చేయడం, మూజువాణి ఓటుతో బిల్లులు ఆమోదించి, చట్టాలు చేయడం సర్వసాధారణమైపోతుంది. ఆ చట్టాలు కూడా చాలా సందర్భాలలో ప్రజాహితం కన్నా కూడా ఆయా పార్టీలకు అనుగుణంగా చేసుకోవడం జరుగుతుంది. దీనివల్ల ప్రజాస్వామ్య హననం జరుగుతుందితప్ప, రాజ్యాంగ బద్ధ, చట్ట పరిపాలన జరగటం లేదు. మరోవైపు అసలే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశంపై రాష్ట్రాలపై ఆర్థిక భారం బాగా పెరిగిపోతుంది. వారికి ఇచ్చే గౌరవ వేతనాలు, నివాస వసతి, అలవెన్స్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతర మంది మార్బలం, తర్వాత జీవితకాలం ఇచ్చే పింఛన్లు వెరసి ప్రజాధనం ఎంతో వెచ్చిచ్చాల్సి ఉంటుంది. ఇక ఎన్నికల సమయంలో నియోజవర్గ స్థాయిలో ఓటర్ విలువ పెరిగిపోతుంది. గతంలో ఎంత డబ్బుఖర్చు పెట్టారో ఇప్పుడు గెలుపు కోసం ఓటర్లను తన వైపు తిప్పుకోవడం కోసం, ప్రసన్నం చేసుకోవడం కోసం మరింత ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఓటరులో స్వార్థపూరిత సొంత డిమాండ్లు పెరిగిపోతాయి. విద్వేషాలు మితిమీరుతాయి. గెలిచినవారు చట్టసభల్లో మాట్లాడటం మర్చిపోయి, ఆ బాధ్యతను గాలికి వదిలేసి ఖర్చుపెట్టిన దాన్నిసంపాదించుకోవడమే లక్ష్యంగా ఉంటుంది. ఇప్పుడు కూడా అదేజరుగుతోంది. మున్ముందు ఇది ఇంకా బాగా పెరిగిపోతుంది. మనుషుల మధ్య ఆర్థిక, స్వార్థపూరిత లావాదేవీలే తప్ప మానవత్వం కనిపించదు. ఇప్పటికే కనిపించడం లేదుకూడా. ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులు చట్టసభలలో గైర్ హాజరయ్యే వారు ఎక్కువగానే ఉంటున్నారు. అసలు హాజరైనచర్చల్లో పాల్గొన్నవారు తక్కువగానే ఉంటున్నారు. చట్టసభలు జరిగేటప్పుడుమాట్లాడదాం అనుకున్నా అందరికీ మాట్లాడే అవకాశాలు వస్తాయని చెప్పలేం. ఎమ్మెల్యేలు, ఎంపీలు సీట్లు పెరగడంవల్ల యువతకు, మహిళలకు చట్టసభల్లో ప్రవేశించే అవకాశాలుపెరుగుతాయి. చట్టసభల్లో ప్రవేశించాలి అనుకునే ఆశయంగలవారికి ఆనందం కలిగించవచ్చు. దేశానికి రాష్ట్రానికి ప్రయోజనం మాత్రం ఏమాత్రం ఉంటుందో ఆలోచించాల్సిన విషయం. చట్టసభలలో ఇప్పుడు ఏమి జరుగుతుందో అప్పుడు కూడా అదే జరుగుతుందని కచ్చితంగా చెప్పవచ్చు. కాబట్టి ప్రస్తుత దేశస్థాయిలో రాష్ట్రాలలో ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా నియోజక వర్గాల పెంపు కొత్తవారికి అవకాశాలుకల్పించవచ్చు గాని ప్రజాహితం మాత్రంకాదు. రాజకీయ పార్టీలకులబ్ధి చేకూర్చవచ్చు గాని ప్రజలకు మాత్రంకాదు. నియోజకవర్గ పరిధిలో మార్పులు తప్పనిసరిగాని సంఖ్యపెంపు అవసరంలేదు. రాజకీయ పార్టీలలో అవకాశంరాని కొంతమంది ప్రధానకార్యకర్తలకు అవకాశం కల్పించడానికి ఉపయోగపడతాయి. ప్రస్తుతం దేశంలో జాతీయపార్టీలలోనైనా, రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల్లోనైనా గెలిచిన అభ్యర్థులు స్వేచ్ఛగా తన అభిప్రాయాలను చట్టసభల్లో వ్యక్తపరిచే పరిస్థితులు లేవు. ప్రతిపక్షానికి అవకాశాలురావు. వచ్చినా సరైన సమయం ఇవ్వరు. ఇచ్చిన అధికారపార్టీ సభ్యులు మాట్లాడనివ్వరు. ఇక అధికార పార్టీల వారు చాలావరకు పార్టీ విధానాలు కట్టుబడి మాట్లాడాలే తప్ప తన సొంత అభిప్రాయాలను సూచనలను స్వయంగా మాట్లాడే అవకాశం లేదు. ఒకవేళ ఎవరైనా తెగించి మాట్లాడితేపై నేతల నుండి కౌన్సిలింగ్ తప్పదు. అందుకే చాలా మంది నోరు మెదపడానికే భయపడుతున్నారు. ●

ong-5_ong-5.qxd 4/2/2026 12:20 AM Page 1



## రెవెన్యూ క్లినిక్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి : జేసి



**కొత్తపట్నం ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో సమస్యలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరం నిర్ణీత సమయంలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కొత్తపట్నం తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమై పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పురోగతి, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, 22ఏ కేసులు, జీరో ఖాతాలు, రీ సర్వే, డిజిటలైజేషన్ ఆఫ్ రెవెన్యూ రికార్డ్స్ తదితర అంశాలపై అంశాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరం నిర్ణీత సమయంలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, డిజిటలైజేషన్ ఆఫ్ రెవెన్యూ రికార్డ్స్ ను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కొత్తపట్నం తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది, వి ఆర్ ఓ.లు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల కోసం బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి



**కొత్తపట్నం ఏప్రిల్ 1. ప్రభాతవార్త**

బాలల కోసం బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. బాలల రక్షణ సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లె పాలెం గ్రామంలో ప్రేమానంద బాలుర హోమ్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. బాలురందరితో మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. హోమ్ లో ఉన్న అవకాశాలను పరిశీలించి తగిన సూచనలు జారీ చేశారు. హోమ్ లో ఉన్న బాల బాలికలకు తప్పనిసరిగా బాలల సంక్షేమ కమిటీ ద్వారా ఆర్డర్స్ ఉండాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా స్వేచ్ఛగా విద్యను అభ్యసించే అవకాశాన్ని కలిగి ఉండాలని తెలియచేశారు. హోమ్ డైరెక్టర్ ఫాదర్ మణి, ఫాదర్ విన్సెంట్ వారు అందించే సేవలను వివరించారు. బాలల కోసం మరిన్ని సహాయక కార్యక్రమాలు చేయాలని తెలియజేస్తూ, వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కే. ఎం.రాజా, పిడిసి, బాలల సంరక్షణ విభాగం జిల్లా న్యాయ పరివీక్షణ అధికారి రత్న ప్రసాద్, పి. సిద్ధిక్, డిపిఏ పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



**ఉలవపాడు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

తాళం వేసిన ఇంట్లో దొంగల పడి ఎనిమిది సవర్ల బంగారం దోచుకున్న సంఘటన ఉలవపాడు లోని రిజర్వు కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ షాహిద్ అను వ్యక్తి సుమారు నెలరోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహ హైదరాబాదు వెళ్లారు. అదే ఇంట్లో క్రింది పోర్షన్ అద్దెకు ఉంటున్న సభ్యులు మంగళవారం మిద్దె పైకి వెళ్ళగా పై పోర్షన్ లోని ఇంటి తాళం తీసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని హైదరాబాదులో ఉన్న షాహిద్ కు ఫోన్ ద్వారా తెలియజేశారు. షాహిద్ బుధవారం ఉదయం వచ్చి చూడగా బీరువా పగలగొట్టి అందులోని ఎనిమిది సవర్ల బంగారం చోరీకి గురైనట్లు తెలుసుకొని ఉలవపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన జరిగిన ఇంటిని క్లూస్ టీంతో పాటు డీఎస్పీ బాల సుబ్రమణ్యం, సిఐ అన్వర్ భాష పరిశీలించారు.

## నిరుపేదలకు అండగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్: కుక్కపల్లి ఏడుకొండలు



**జె.పంగులూరు, ప్రభాతవార్త**

నిరుపేదలకు ప్రజలను ఆదుకోవడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా అనేక మంది నిరుపేదలకు ఊతమిచ్చేలా దోహదపడుతుందని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి కుక్కపల్లి ఏడుకొండలు అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో కుక్కపల్లి ఏడుకొండలు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పలువురు లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థికంగా అనేక ఇబ్బందుల్లో ఉన్న సంక్షేమం అభివృద్ధిలో రెండు రెండు కళ్ళగా పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సంక్షేమ పింఛన్లతో సామాన్యులకు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ జానీ బేగం, అద్దంకిని నియోజకవర్గ సెల్ అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు, మండల సెల్ అధ్యక్షులు అద్దిపల్లి యోహాను, గ్రామ పార్టీ అధ్యక్షులు వేల్పుల మరియదాసు, బూత్ కన్వీనర్ గరిమిడి రాఘవ, తల్లపనేని రాజేష్, తిరుమల శెట్టి వీరాంజనేయులు, వేల్పుల యోహాను గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతినెలా ఒకటో తారీకు నిరుపేదలకు పండుగ

**- మండల అభివృద్ధి అధికారిని కె. స్వరూపారాణి**



**జె. పంగులూరు ఏప్రిల్ 1 ప్రభాతవార్త**

ప్రతినెలా ఒకటో తారీకు నిరుపేదలకు పండుగ చేసుకొనెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పండగ లాగా మ నముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు అందజేశారని మండల అభివృద్ధి అధికారిని కె.స్వరూపారని అన్నారు. పంగులూరు1 మరియు పంగులూరు2 స్వర్ణ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.స్వరూపరాణి బుధవారం పలువురు లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేసి ఉన్నారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో ఎన్టీఆర్ భరోసా ఫంక్షన్ అర్హులైన ప్రతి నిరుపేదకు అందజేస్తున్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఆనందంతో అందుకున్నారన్నారు.

## కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం సంతోషకం: ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు, ప్రభాతవార్త**

బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఇండో అమెరికన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ మరియు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సర్వజన సేవా సమితి సహకారంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి ఆహారపు అలవాట్లు మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు క్యాన్సర్ బారిన పడటానికి కారణం అవుతున్నాయని అయితే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వలన ఈ ప్రాణాంతకమైన వ్యాధి నుండి బయటపడవచ్చు అని తెలిపారు. ప్రకాశం జిల్లా నుండి చాలామంది క్యాన్సర్ పేషెంట్లు ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్ లోని బసవతారకం హాస్పిటల్‌కి వెళ్తున్నారని. కార్పొరేట్ స్థాయి క్యాన్సర్ వైద్యాన్ని ఒంగోలు నియోజకవర్గ ప్రజల కోసం ఈరోజు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ మరియు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజ్మెంట్, వైద్య సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి చౌదరి మాట్లాడుతూ" ప్రివెన్షన్ ఇస్ బెటర్ దెన్ క్యూర్"అనే నినాదంతో ముందస్తుగానే క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలుచేయించుకోవడం వలన క్యాన్సర్ బారి నుండి బయటపడవచ్చు అని తెలియజేశారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణార్థం క్యాన్సర్ బాధితులకు, నిర్ధారణ చేయించుకోవాలి అను కున్న వారికి వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియజేశారు. ఈ వైద్య శిబిరం నందు ఉచితంగా మామోగ్రఫీ, ఎక్సరె, పాప్ స్మియర్ వంటి పరీక్షలు ఉచితంగా చేసి అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల సమక్షంలో వైద్య సలహాలు అందజేస్తున్నారని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ కాప అనిల్ కుమార్, డాక్టర్ పోకూరి శ్రీనివాస్, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డాక్టర్ ఎన్ పవన్ కుమార్, డాక్టర్ అల్లాడి సాత్విక్, డాక్టర్ రాధా, డాక్టర్ జయవర్ధన్, డాక్టర్ భరత్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ రవి శంకర్, డాక్టర్ సౌమ్య , డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి డాక్టర్ లక్ష్మణ్, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ బి .ఆనందం కుమార్, మార్కెటింగ్ మేనేజర్ ఖాసీం సైదా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## లేబర్ కోడ్స్ అమలను నిలిపివేయాలంటూ నిరసన




**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు అద్దంకి బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ని అమలు చేయా లని ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రాలకు హుకుం జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డేగా జరపాలని కార్మిక వర్గానికి పిలుపు నివ్వడం జరిగింది. ఈ పిలుపు ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో కేంద్ర కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. సిఐటియు నగర కన్వీనర్ టి మహేష్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని నడిపారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు, జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఎఐటి యుసి జిల్లా కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఐ ఎఫ్ టు యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్మోహన్ , ఏఐ ఎఫ్ టు యూ న్యూ జిల్లా కార్యదర్శి ఎం ఎస్ సాయి.కేంద్ర ప్రభుత్వ విధానాన్ని దుయ్యబెట్టారు.

# బిల్లుల మోత.. పొదుపుతో ఆదా

**- వేసవిలో మెలుకువలు అవసరమంటున్న అధికారులు**

**ఒంగోలు, ప్రభాతవార్త**




వేసవిలో ప్రతి ఇంట్లో విద్యుత్ బిల్లుల మోత మోగుతుంది. ఉక్క పోత కారణంగా ఏసీలు, కూలర్లు ఉపయోగిస్తున్నారు. పెరిగే బిల్లుల నియంత్రణకు వినియోగదారులు పొదుపు విధానాలపై అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ ఇంజనీర్లు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఇంధన సామర్థ్య విభాగం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం విద్యుత్ ఉపకరణల వినియోగం అదుపుతో వృధా ఖర్చుకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్తున్నారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానమని స్పష్టం చేస్తున్నారు. నాణ్యమైన ఐదు నక్షత్రాల ప్రమాణాలు కలిగిన మోటారు వినియోగించుకుంటే 4 నుంచి 5 శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుంది. టీవీ, కంప్యూటర్ వినియోగించకపోయినా ఆన్‌లో ఉంచితే ఒక్కోపరికరం పదివాట్ల శక్తిని నష్టపరుస్తుంది. కంప్యూటర్‌తో పని లేనప్పుడు మానిటర్ ఆపాలి. ఛార్జింగ్ పూర్తి కాగానే లాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, డిజిటల్ పరికరాలు, కెమెరా వంటివి ప్లెగ్ నుంచి తొలగించాలి. రిఫ్రిజిరేటర్లు ఒక సారి కూరగాయలు, ఇతర నిల్వ పదార్థాలను సర్దుకోవాలి. తరచు తలుపు తీయకూడదు. గోడకు రిఫ్రిజిరేటర్‌కు మధ్య ఖాళీ ఉంటే కంప్రెసర్‌పై ఒత్తిడి తగ్గి విద్యుత్ వృధా కాదు. మైక్రోఓవెన్ తలుపు పదే పదే తీయకూడదు. గదిలో తలుపులు, కిటికీలు మూసిన తరువాత ఏసీ ఆన్ చేయాలి. 24డిగ్రీలు సెట్ చేసుకుంటే మేలు. సామర్థ్యానికి మించి వాషింగ్‌మిషన్లలో దుస్తులు ఉతికితే పని చేసే సమయం ఎక్కువై విద్యుత్ వినియోగం పెరుగుతుంది. తరచు మూతతీసి వేయకూడదు. ఇలా చేస్తే 25డిగ్రీ ఉష్ణోగ్రత కోల్పోయి తిరిగి వేడెక్కడానికి అదనంగా కరెంటు తీసుకుంటుంది. జిల్లాలో వీధి దీపాలు, వాటర్ వర్క్స్‌లో విద్యుత్‌ను ఆదా చేసేందుకు నూతన సాఫ్ట్‌వేర్ విధానంతో ఆటోమేటిక్ సిస్టంను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఏ.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు పగటి వేళ అవసరం లేని సమయంలో దీపాలు, ఏసీలు వాడరాదు. జాగ్రత్తలు పాటిస్తే బిల్లు ఆదాతో పాటు విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు. ప్రతి రోజు విద్యుత్ అవసరం సుమారు 17మిలియన్‌ల యూనిట్లు. పెరుగుతున్న వినియోగం 20మిలియన్ల యూనిట్ల వరకు అంచనా.

# అమరావతికి వ్యతిరేకం కాదు..

- *వైఎస్సార్‌సీపీ ఇప్పటి వరకు రాష్ట్రంలో 16 లక్షల సభ్యత్వ నమోదు*
- *జిల్లాలో మార్కాపురం సభ్యత్వ నమోదులో ముందంజ*
- *వైఎస్సార్‌సీపీ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు వెల్లడి*



**ఒంగోలు, ప్రభాతవార్త**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతికి వ్యతిరేకం కాదని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్దే మాధ్యేయమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఒంగోలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జీలు, నాయకులతో సభ్యత్వ నమోదు పార్టీ పటిష్టతపై చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అమరావతి పేరుతో చంద్రబాబు చేస్తున్న అప్పులు, అవినీతిపై మాట్లాడారు. మన కళ్లెదుటే 2000 సంవత్సరంలో ఉత్తరఖడ్, జార్ఖండ్, చత్తీష్‌గడ్ ఏర్పాటు అయ్యాయని అన్నారు. వాటి రాజధానులను కేంద్రం నిర్ణయించలేదు కదా. ఎవరికి వారే నిర్ణయించుకున్నారని అన్నారు. మరి ఎవరికి వర్తించనిది మనకు మాత్రమే ఎందుకు వర్తిస్తుందని వారు ప్రశ్నించారు. కేంద్రం కూడా ఒక విషయం చెప్పిందని, రాష్ట్ర రాజధాని ఆ శాఖ సొంత విషయమని తేల్చి చెప్పిందని అప్పట్లో ఆ మేరకు రాష్ట్ర హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. ఏడుళ్లుగా మీరు సీఎంగా ఉన్నారు. నాడు ఐదేళ్ళు, ఇప్పుడు రెండేళ్ళ లక్షల ఎకరాల అమరావతిలో ఇంత వరకు కట్టింది ఎంత అని వారు ప్రశ్నించారు. మొదటి తీసుకున్న 50 వేల ఎకరాలలోనే రోడ్లు, నీరు, కరెంటు, సీవరేజ్ పనుల కోసం చంద్రబాబు లెక్కల ప్రకారం ఎకరాకు రూ. 2కోట్లు అవుతుందని చెప్పారు. అలా లక్షల కోట్లకు లెక్కలు లేకుండా పోయాయి. మరో 50 వేల ఎకరాలకు అయ్యే ఖర్చు మరో లక్ష కోట్లు అవుతుందని ఇలా అమరావతిని ఎందుకు పెంచుకుంటూ పోతున్నారని వారు నిలదీశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ సభ్యత్వ నమోదు 16లక్షలకు చేరుకుందన్నారు. ప్రకాశం జిల్లా కూడా ముందంజలో ఉందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్కాపురం జిల్లా కేంద్రమైన మార్కాపురంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సభ్యత్వ నమోదులో జిల్లాలో ముందంజలో ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీని బలోపేతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కే.ఆదెన్న, ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి, ఒంగోలు, కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జిలు చుండూరి రవి, దద్దాల నారాయణ, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, నియోజకవర్గ పరిశీలకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మీర్జా షంషీర్ అలీబేగ్, బొట్ల రామారావు, వై.వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర వైసీపీ అధ్యక్షుడు కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దామచర్ల**



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల కళ్ళల్లో ఆనందం చూడాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒకటవ తేదీనే ఇంటింటికి తిరిగి అందజేస్తున్నామని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు బుధవారం ఒంగోలు నగరంలోని రెండో డివిజన్ బిలాల్ నగర్ నందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల పాల్గొన్నారు. ఈ డివిజన్లోని పింఛన్ పంపిణీదారులకు స్వయంగా పింఛను అందజేశారు ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు పింఛన్ల కోసం ఏడాదికి రూ 32.5 వేల కోట్లు పేదలకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పెన్షన్ అందాలన్నదే తమ లక్ష్యమని అందులో అర్హులైన వారు ఎవరైనా లబ్ధి పొందకపోతే వెంటనే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పెన్షన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని దామచర్ల స్థానికులకు హామీ ఇచ్చారు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, దీపం 2, అన్నదాత సుఖీభవ, తదితర పథకాల కు ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఆర్థిక సాయం అందజేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు అమలుతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల స్థానికులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు మాజీ మేయర్ గంగాడ సుజాత, నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్, క్లస్టర్ ఇంచార్జ్ కామేపల్లి శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు

## శాస్త్రోక్తంగా శ్రీ హరిహర క్షేత్రం మహా పూర్ణాహుతి,మహా కుంభాభిషేకం

*- కుంభాభిషేకంలో పాల్గొన్న మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సురేష్ దంపతులు, కుటుంబ సభ్యులు, హాజరైన ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్*



**చీమకుర్తి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు,శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులు అధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. బుధవారం ఆలయం వెంచేసి వున్న సర్వ దేవత లకు విశేష అభిషేకాలు విశేష పూజలు ఆగమ విశారాధ కృష్ణ శర్మ బృందంచే అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులను, శిద్దా పాండురంగారావు దంపతులను ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. హోమాలు, మూల మంత్ర హోమం,కళాన్యాస హోమాలతో శ్రీ హరిహర క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది వేద పండితులు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో చతుర్ద్వార సూర్య నమస్కారాలు, మూల విరాట్టులకు ఆలయ ధర్మ కర్తలచే కలశ ప్రదక్షిణ వేద పండితుల శాస్త్రోక్తంగా శ్రీ హరిహర క్షేత్రం మహా పూర్ణాహుతి, మహా కుంభాభి షేకం నిర్వహించారు. ఎస్.ఎన్.పాడు శాసన సభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్, కరణం బలరామ్ క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించారు.శిద్దా సుధీర్ కుమార్ శాసన సభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్,కరణం బలరామ్‌లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శిద్దా కుటుంబ సభ్యులు, ఎమ్ శివరామ్,టీడీపీ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, గ్రానైట్ రంగాలకు చెందిన ప్రముఖులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు. శిద్దా వెంకటేశ్వర్లు,వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు భోజన సదుపాయాలు కల్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు.





## శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో రాజీ ప్రసక్తే లేదు

**- ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరిగిందని. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో పోలీసులు విస్తృత తనిఖీలు – చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చర్యలు చేపట్టారు.జిల్లా వ్యాప్తంగా రాత్రి, పగలు గస్తీ నిర్వహిస్తూ మొత్తం 11,741 మంది అనుమానితులను ఎంఎస్ సిడి ద్వారా తనిఖీ చేయగా, వారిలో 18 మంది పాత కేసుల నిందితులను గుర్తించారు. వీరిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరిపి, అవసరమైన మేరకు బైండ్ ఓవర్ చేయడం, కౌన్సెలింగ్ నిర్వహించటం జరిగింది. గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా 4 కేసులు నమోదు చేసి 10 మంది నిందితులను అరెస్ట్ చేసి సుమారు 24.375 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా టాస్క్ ఫోర్స్ మరియు రైల్వే పోలీసుల సంయుక్త తనిఖీలలో రైళ్లలో సుమారు 13 కిలోల గంజాయిని పట్టుకోవటం జరిగింది. జిల్లాలో కోడిపందాలు, పేకాట మరియు మట్కా వంటి జూద కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి మొత్తం 179 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా 37 కేసులు నమోదు చేయబడగా, వారి వద్ద నుండి రూ. 4,55,550/ నగదు, 12 కోళ్లు, 22 మోటార్ సైకిళ్లు, 14 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు .ప్రకాశం,మార్కాపురం జిల్లాలలో ఉన్న 878 మందిని చెడునడతగల వారికి (రౌడీ షీటర్ల) కౌన్సిలింగ్ నిర్వహించి, నేరాల నుండి దూరంగా ఉండాలని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై 2,078 కేసులు నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్న 615 ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం జరిగింది.రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 1,954 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు విధింపజేశారు.మోటారు వాహన చట్టం కింద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై మొత్తం 10,805 ఈ చలానా ద్వారా కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 361 మంది వాహనదారులను పట్టుకుని కోర్టులో హాజరు పరచగా కోర్ట్ వారు జరిమానాలు/జైలు శిక్ష విధించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తమ పరిధిలో గ్రామాలు, వార్డులను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అనర్థాలు, చట్టపరమైన శిక్షలు గురించి అవగాహన కల్పించారు.అలాగే సైబర్ నేరాలు, లోన్ యాప్స్, క్రికెట్ బెట్టింగ్, రహదారి భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగం, కొత్త క్రిమినల్ చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.చట్టాన్ని అతిక్రమించే వారిపై ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు స్పష్టం చేశారు.

8_8.qxd 4/2/2026 12:00 AM Page 1



## స్వంత నిధులతో విద్యాసేవ.. పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయ దంపతుల ఆదర్శం



**కనిగిరి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

పాఠశాలల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు స్వంత నిధులను వినియోగించడం అరుదుగా కనిపించే సందర్భం. అలాంటి అరుదైన సేవాభావానికి ప్రతీకగా వెంగళాయపల్లి, దివాకరపురం పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయ దంపతులు స్వర్ణ వెంకట రమణయ్య, అరుణ నిలిచారు. బుధవారం మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు తమ పిల్లల ద్వారా రూ.1.50 లక్షల చెక్కును పాఠశాల విద్య అదనపు డైరక్టర్ సుబ్బారెడ్డికి అందజేశారు. ఈ నిధులను పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాల పెంపుదలకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ దంపతుల ఈ సేవా తపనను అధికారులు అభినందిస్తూ, వారిని ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు వీరు పని చేసిన పాఠశాలల్లో సుమారు రూ.10లక్షల వరకు స్వంతంగా ఖర్చు చేసి, దాతల సహకారంతో మరిన్ని నిధులు సమీకరించి పలు వసతులు కల్పించినట్లు వెల్లడించారు. వారి కృషి ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగి కొన్ని చోట్ల నో బోర్డు అడ్మిషన్ స్థాయికి చేరుకోవడం విశేషం. విద్యాభివృద్ధికి ఈ దంపతులు చూపుతున్న కట్టుబాటు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు జే.సంజీవి, శ్రీనివాసరావు, రాజాల కొండారెడ్డి, రామిరెడ్డి, దాసు ప్రసాద్, జే.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ సహాయం అందజేసిన టీడీపీ నాయకులు



**కనిగిరి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కనిగిరి పట్టణం9 వ వార్డుకు చెందిన మద్దిశెట్టి ఆదెమ్మ నివాసానికి వెళ్లిన టీడీపీ నాయకులు, ఆమెకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అవసర సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిరోజ్, అచ్చాల రవి, నాగ, ఖాజా రెహామాన్, బుల్ల బాలబాబు, అంజి నాయుడు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా మరో చారిత్రాత్మక అడుగు

**- ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య**



**వేటపాలెం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేత సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామంలో చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ మంజూరు పత్రాలను స్వయంగా అందజేసిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య. హ్యాండ్ లూమ్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తూ కార్మికులపై కరెంటు బిల్లుల భారాన్ని తగ్గిస్తున్నాం. చేనేత బిడ్డల కష్టాలనుగుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడంలో నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,04,488 కుటుంబాలకు ఏటా సుమారు రూ.150 కోట్ల ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దీని ద్వారా ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.8,640, ఒక్కో పవర్ లూమ్ యూనిట్లకు ఏడాదికి రూ.21,600 ఆదా అవుతుంది. చీరాల నియోజకవర్గంలోని 4,404 మంది చేనేత సోదరులకు దీని ద్వారా ప్రత్యక్ష లబ్ధి చేకూరనుంది. నేతన్నల సంక్షేమమే మా కూటమి ప్రభుత్వ ధ్యేయం.ఇచ్చిన మాట ప్రకారం మీ ఆర్థిక పురోభివృద్ధికి మా ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చీరాల సర్కిల్ విద్యుత్ సర్వీస్ నంబర్ నందు మార్పులు

**వేటపాలెం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

చీరాల డివిజన్ లోని విద్యుత్ శాఖ వారు సర్వీస్ నెంబర్ నందు మొదటి నెంబర్‌ను మార్పు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులకు వారి యొక్క సర్వీసు మొదటి నెంబర్ ఇంతకుముందు 4 నుండి మొదలవుతుందని, ప్రస్తుతం బాపట్ల జిల్లా అయిన కారణంగా ఏప్రిల్ ఒకటి నుండి చీరాల సర్కిల్ విద్యుత్ శాఖ నూతన సీరియల్ నంబర్‌ను తీసుకువస్తుందని తెలిపారు. ఏప్రిల్ నుండి చీరాలలో ఉన్న ప్రతి ఒక్క సర్వీస్ నెంబరు 3 నుండి మొదలవుతుందని విజ్ఞప్తి చేశారు. ఉదాహరణకు ఇంతకు ముందు సర్వీస్ నెంబరు 4411144001567 దీనికి బదులుగా సర్వీస్ నెంబరు 3411144001567 అవుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు ఈ యొక్క మార్పును గమనించి ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లు చెల్లించేటప్పుడు సర్వీస్ నెంబరు మొదటి సంఖ్య 4 కు బదులుగా 3 మొదలయ్యే విధంగా చూసుకోవాల్సిందిగా తెలియజేశారు.

## రామాలయంలో పూజలు చేసిన కదిరి పార్ధసారధి



**సీఎస్‌పురం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

కోవిలంపాడు గ్రామంలో రాములవారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్ధసారధి పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు స్వాగతం పలికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరెడ్డి జయరెడ్డి, బి.తిరుపతిరెడ్డి, మన్నెపల్లి పెద్దన్న, గోను రాజశేఖర్‌రెడ్డి, మూరం మస్తాన్‌రెడ్డి, తవ్వా శేషయ్య, బాలకేశవరెడ్డి, నున్నా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు

**- ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది**

**- సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబుకు దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే సాధ్యమైందన్నారు. 2024 జూన్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అమల్లోకి రానుందన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి అజేయం.ఇకపై ఎవ్వరూ ఒక్క ఇంచుకూడా అమరావతిని కదల్చలేరు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంకట్టుబడి ఉందన్నారు.

## ప్రతి ఇంటికి పెద్ద కొడుకు చంద్రబాబు - మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు



**దర్శి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

ప్రతి ఇంటికి పెద్ద కొడుకు నారా చంద్రబాబునాయుడు అని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. ఈ సందర్భంగా దర్శి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఇంటింటికి తిరిగి పింఛన్ పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటిలో పెద్ద కొడుకులా చంద్రబాబు నాయుడు ఆ కుటుంబానికి కావాల్సిన అన్ని అందిస్తున్నాడని రాష్ట్రంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుంది చంద్రబాబునాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టౌన్ పార్టీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, ఇన్‌చార్జి మున్సిపల్ కమీషనర్ శ్రీరామ్‌మూర్తి, టీడీపీ నాయకులు జెమిని నాగేశ్వరరావు, నారపుశెట్టి మధు పాల్గొన్నారు.

## ఐఐటీ, నీట్ ఉచిత శిక్షణకు ముండ్లమూరు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

**ముండ్లమూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఐఐటీ, నీట్ ఉచిత శిక్షణ కార్యక్రమానికి ముండ్లమూరు ఆదర్శ పాఠశాల నుంచి గుంటు అభి, మెత్తంటి యజ్ఞస్వరూప్ ఐఐటీ శిక్షణ కొరకు కావూరి కోటేశ్వరరావు, గోసాల లక్ష్మీ ప్రసన్న నీటి శిక్షణ కొరకు ఈ నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కే.పూర్ణచంద్రరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 164 ఆదర్శ పాఠశాలల నుండి 800 మంది విద్యార్థులను ఐఐటీ, నీటి ప్రవేశాల కొరకు ఎంపిక చేశారని తెలిపారు. అదే విధంగా 6వ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఆదివారం 12వ తేదీ ఉదయం 8గంటలకు పరీక్షా కేంద్రం ముండ్లమూరు ఆదర్శ పాఠశాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## పెన్షన్లు పంపిణీ చేసిన టీఎన్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్



**కొనకనమిట్ల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

పొదిలి మండలం కుంచేపల్లిలో టీఎన్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్దిదారులకు బుధవారం పంపిణీ చేశారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశం మేరకు పింఛన్ పంపిణీలో పాల్గొన్నట్లు వరికుంట్ల అనిల్ అన్నారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసి ఇటీవల మరణించిన పెరం పెద్ద నాగిరెడ్డి ఆయన సతీమణి అచ్చుమ్మకు త్వరితగతిన వితంతు పెన్షన్ వచ్చేలా చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిద్దలూరు శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయం వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరకొండలో లక్ష తమలపాకుల పూజ





**అద్దంకి , ఎఫ్రియల్ 1,ప్రభాతవార్త**

అద్దంకి మండలం సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ పరాభవ నామ సంవత్సర చైత్ర పౌర్ణమి హనుమత్ విజయోత్సవము సందర్భంగా స్వామివారికి లక్ష తమలపాకుల పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. తెనాలి మండలం కొల్లూరు గ్రామ వాస్తవ్యులు సమ్మెట సుజాత, కుమారుడు వెంకట సాయి శ్రీ హర్ష ధర్మపత్ని విమలాదేవి, కూతురు అల్లుడు కూకట్ల ఫణిదర్ ధర్మపత్ని స్వాతి మోక్తిశ్రీ చేతుల మీదుగా తమలపాకుల పూజా కార్యక్రమం జరిగింది. ఉదయాన్నే 5 గంటలకుస్వామివారికి బిందె తీర్థం తో దేవస్థానం చుట్టూ ప్రదక్షణ చేసి, తదుపరి గోపూజ ,తదుపరి స్వామివారి అభిషేకం కార్యక్రమం కూడా జరిగినది. ఉదయం 9 గంటలకు లక్ష తమలపాకుల పూజ దాతలతో స్వామివారి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్తంభానికి పూజా కార్యక్రమం నిర్వహించిన తర్వాత వినాయక స్వామి వారికి పూజా కార్యక్రమం తదుపరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానము నందు కూడా పూజాకార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి వద్ద లక్ష తమలపాకు పూజా కార్యక్రమం జరిగింది. 1.30 నిమిషాలకు పంచ హారతి కార్యక్రమంలో కూడా దాతలు పాల్గొని స్వామివారి అలంకారం చూసుకుని స్వామివారి తీర్థ ప్రసాదములు తీసుకొని దాతలకు శేష వస్త్రము ,ప్రసాదములు, అర్చకులు వేదపండితులు సమక్షంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు , పాలకమండలి అధ్యక్షుడు చుండూరు మురళీ సుధాకర్ రావు పర్యవేక్షణలో జరిగింది.

## పలు శుభకార్యలలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి



**అద్దంకి , ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని 4వ వార్డులో ధూళిపాళ్ల హరీష్ వివాహం సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా తిమ్మాయిపాలెంలో అడుసుమల్లి ఆశోక్‌కుమార్ వివాహ సందర్భంగా కూడ ఆయనకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## మారుమూల గ్రామాలలో రోడ్లు, డ్రైన్లు వసతుల ఏర్పాట్ల - మంత్రి గొట్టిపాటి





**అద్దంకి , ఎఫ్రియల్ 1,ప్రభాతవార్త**

మండలంలో మోదుపల్లి, కుంకుబాడు గ్రామాలలో రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం కోటి రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు. కుంకుబాడులో 20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, ఎస్‌సి కాలనీలో 30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అదే విధంగా మోదేపల్లి గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన సిసిరోడ్లు, డ్రైన్లు, ఎస్‌సి కాలనీలో 30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాలను మంత్రి ప్రారంభించారు.

## విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి





**అద్దంకి , ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

మండలంలోని శంకవరప్పాడు గ్రామంలో పశుగ్రాసం కోసం వెళ్లిన యువకుడు విద్యుత్‌షాక్ తగిలి బుధవారం మృతిచెందాడు.అద్దంకి మండలం శంకవరపాడు గ్రామం నివాసి,ఎల్ఐసి ఏజెంట్, కొమ్మాలపాటి గోపీనాథ్ (27) ఉదయం గేదెల మేత కోసం అతని బైక్ పొలమునకు వెళ్లి మేత కోసుకొని తిరుగు సమయంలో చేలో ఉన్న కరెంటు వైర్ బండి తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు.

## దోర్నాలలో ప్రశాంతంగా ఒకేషనల్ పరీక్షలు - ఎంఈఓ మస్తాన్ నాయక్



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రవీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఒకేషనల్(వృత్తి విద్య) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పెద్దదోర్నాల మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్ తెలిపారు. మండలంలో పదవ తరగతి విద్యార్థులు 322 మంది గాను 319 మంది పరీక్షలు రాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 191 మందికి గాను 188 మంది, రవీంద్ర ఉన్నత పాఠశాలలో 131 మందికి గాను 131 మంది హాజరయ్యారని ఎంఈఓ మస్తాన్ నాయక్ తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి యాజమాన్యాలు ఏర్పాట్లు భాగా సమకూర్చారు. పరీక్ష కేంద్రాల్లో కూర్చున్న సౌకర్యం, పర్యవేక్షణ, భద్రత వంటి అంశాలను సమగ్రంగా అమలు చేశారు.

## శ్రీ సీతారాముల వారిని దర్శించుకున్న సూరిశెట్టి



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఉమ్మనపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలోబుధవారం నిర్వహించిన శ్రీ సీతారాముల నూతన పంచలోహ ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ, శ్రీ సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణ స్వామి పాల్గొని స్వామివారిని దర్శించుకుని శ్రీ సీతారాముల చల్లని ఆశీస్సులతో, ప్రజలందరి జీవితాలలో ఆయురారోగ్యాలను, సుఖ సంతోషాలను, ఐశ్వర్యాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఆలయ అభివృద్ధి కొరకు రూ.20వేలు విరాళం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే భరోసా..

**- ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీకి శ్రీకారం**

**- లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**- ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**





**మార్కాపురం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త**

మార్కాపురం పురపాలక సంఘ పరిధిలోని 8వ స్వర్ణ వార్డు (ఎలక్షన్ వార్డు 13) పూల సుబ్బయ్య కాలనీ, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా సుమారు 68లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రూ.4వేల పెన్షన్ అందజేయడం ద్వారా పారదర్శకతను పాటిస్తున్నామని తెలిపారు. ఎటువంటి అవకతవకలు లేకుండా, లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన పొందింది.

## కొరిసపాడు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన : ఎస్‌డిసి మహేష్



**కొరిసపాడు,ఎఫ్రిల్ 1,ప్రభాతవార్త**

కోనేరు రంగారావు కమిటీ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ,ఏ.మహేష్ బుధవారం కొరిసపాడు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో తహసిల్దార్ జి.వి.సుబ్బారెడ్డి నుంచి మండలంలో జరుగుతున్న రీ సర్వే గురించి వివరాలను సమగ్రంగా తెలుసుకున్నారు. గ్రామాలలోని రెవిన్యూ సమస్యలు, పీజీ ఆర్ఎస్ అర్జీల గురించి,వాటి పరిష్కారాలపై తీసుకున్న చర్యల గురించి సవివరంగా, వివరాలను రాబట్టారు. జిల్లాలోని అన్ని గ్రామాలలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలోనే రెవెన్యూ సమస్యలు పరిష్కరించిన జిల్లాగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు నేతృత్వంలో తామంతా కృషి చేస్తున్నా మన్నారు .మండలాలలో కూడా ప్రతి తహసిల్దారు రెవెన్యూ సమస్యలను,పి జి ఆర్ ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు.రీ సర్వే జరుగుతున్న గ్రామాలలో కూడా పకడ్బందీగా సిబ్బందితో సర్వే జరిగేలా చూడాలని కూడా ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వెలిబుచ్చారు.తాసిల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన తర్వాత మండలంలోని రాచపూడి గ్రామ సచివాలయాన్ని కూడా ఎస్ డి సి మహేష్ సందర్శించారు.

## చింతం వారి నిశ్చితార్థ వేడుకలలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి



**కొరిసపాడు, ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు చింతం సుబ్బారావు కుమార్తె నిశ్చితార్థ వేడుకలకి ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. బుధవారం నాడు అద్దంకి ఎస్వీ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ నిశ్చితార్థ వేడుకలలో పాల్గొని కాబోయే నూతన వధూవరులైన చిరంజీవి విష్ణువర్ధన్ నాయుడు,చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి సౌజన్యలను మంత్రి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వరుని తల్లిదండ్రులైన టంగా సాంబశివరావు, సుకుమారి వధువు తల్లిదండ్రులైన చింతం సుబ్బారావు, లక్ష్మీ దంపతులతో పాటు గ్రామ సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య టిడిపి నాయకులు సాదినేని మస్తానరావు ,గుమ్మడిల్లి కొండలు, గ్రామానికి చెంది జర్మనీలో ఉంటున్న నేరెళ్ల వెంకటేష్ నాయుడు లతోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల టిడిపి నాయకులు, అభిమానులు, బంధువులు ,మిత్రులు పాల్గొన్నారు.

## అద్దంకి రెవిన్యూ డివిజన్ పరిధిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండ చూడాలి

**- కలెక్టర్ పి.రాజబాబు**





**అద్దంకి, ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

వేసవిని దృష్టిలో పెట్టుకొని అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అదేశించారు.అద్దంకి రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ రెండవ రోజున సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా సురక్షిత త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అదేశించారు. బుధవారం అద్దంకి ఆర్డిఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాల పురోగతిపై, అలాగే కొరిశపాడు రిజర్వాయర్ కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపులపై సమీక్షించి, దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొరిశపాడు రిజర్వాయర్ కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియ త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వేసవిలో అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు సురక్షిత త్రాగునీటి సరఫరా పై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత డిసెంబర్ మాసంలో జల సురక్ష మాసంలో భాగంగా తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడం, వాటర్ ను టెస్ట్ చేయడం, చేతిపంపులకు, కుళాయిలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడం, తాగునీటి వనరుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో నేడు జల సురక్ష కార్యక్రమాన్ని మిషన్ మోడ్ లో చేపట్టడం జరుగుచున్నదన్నారు. ఎక్కడా తాగు నీరు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్‌శాఖ, మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో వర్షపు నీరు వృధాగా పోకుండా జల సంరక్షణ కార్యక్రమాలు పటిష్టంగా చేపట్టేలా ఇరిగేషన్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ వేసవిలో చెరువులు, కాలువల పూడికతీత పనులు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం, లింక్ కెనాల్స్ క్లియర్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ సర్వేలో ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా అధికారుల పనితీరు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, శానిటేషన్ నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐ.వి.ఆర్.ఎస్. సర్వేలో ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా మున్సిపల్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అద్దంకి పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలపై ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు.తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడం, చేతిపంపులకు,కుళాయిలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడం,భూగర్భ నీటిమట్టం పెంచడం వంటి పనులలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్సన్,ఆర్ డబ్ల్యూఎస్ ఎస్.ఈ నాగేశ్వరరావు, ఎస్డిసి విజయ జ్యోతి, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూఎస్.మున్సిపల్ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## పేరాయపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంత్రి శంఖుస్థాపన

**- ఎస్.సి.కాలనీలో పిఎం సూర్యఘర్ రూఫ్ టాప్ ప్రారంభం**

**- అంబేద్కర్ జయంతి నాటికి 2 వేల పిఎం సూర్యఘర్ కనెక్షన్‌లు పూర్తి చేయాలి**

**- మంత్రి గొట్టిపాటి వెల్లడి**





**అద్దంకి , ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

లోఓల్టేజి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పేరాయపాలెం గ్రామంలో 4.60 కోట్లతో 33/11కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ శంఖుస్థాపన నిర్వహించారు. దీని ద్వారా రైతులకు వ్యవసాయం కొరకు,గృహ అవసరాల కొరకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని మంత్రి వెల్లడించారు. అదే విధంగా గ్రామంలోని ఎస్‌సి కాలనీలో పిఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్‌ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి నాటికి అద్దంకి నియోజకవర్గంలో 2వేల పిఎం సూర్యఘర్ కనెక్షన్‌లను పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నల్లూరి మస్తాన్‌రావుతోపాటు పలువురు ట్రాన్స్‌కో అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ బరోసా ఫెన్షన్లు అందజేసిన మంత్రి



**అద్దంకి , ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

మండలంలోని పేరాయపాలెం గ్రామంలో బుధవారం ఉదయం ఇంటింటికి తిరిగి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎన్‌టిఆర్ బరోసా పెన్షన్లును అందజేశారు.ఈ సందర్భంగా వృద్దులకు, వికలాంగులకు, వితంతువులకు మంత్రి స్వయంగా పెన్షన్లు అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పని తీరును, అందుతున్న సంక్షేమ పథకాల విషయాలను కూడ వారిని అడిగి తెలుసుకున్నారు. ఆయన పలువురు అధికారులు, టిడిపి నాయకులు వున్నారు.

## అత్తులూరి హనుమంతరావుకు మంత్రి నివాళి



**అద్దంకి, ఎఫ్రియల్ 1, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం అద్దంకి పట్టణంలోని 12వ వార్డులో ఇటీవల మృతిచెందిన అత్తులూరి హనుమంత రావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. హనుమంతరావు కుమారుడు 12వ వార్డు మాజీ కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌తోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అదే విధంగా 13వ వార్డు మాజీ కౌన్సిలర్ గుంజి రాములమ్మ రెండు రోజుల క్రితం మృతిచెందగా ఆమె చిత్రపటానికి కూడ మంత్రి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

2-4Pg 9_2-4Pg5.qxd 01/Apr/26 10:06 PM Page 1



# 'బరువెక్కిన' వాణిజ్య సిలిండర్




రూ.195.50 పెరిగిన ధర

ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు

114.5శాతం పెరిగిన జెట్ ఇంధనం ధర

ప్రభుత్వరంగ చమురు సంస్థలు నిర్ణయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పశ్చిమ ఆసియాలో కొన సాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల ప్రపంచ ముడి చమురు ధరలు దాదాపు 50 శాతం మేర పెరిగాయి. దీంతోపాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోయిన పరిస్థితుల్లో దేశీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలకు రెక్కలొచ్చాయి. తాజాగా ప్రభుత్వరంగ చమురు సంస్థలు వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరతోపాటు ప్రీమియం పెట్రోల్, ప్రీమియం డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్), వాణిజ్య ఎల్పిజి ధరలలో గణనీయమైన మార్పులు చేశాయి. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చాయి. 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.195.50 మేర పెంచారు. ఈ పెంపుతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధరరూ.2,105.50కి చేరింది. ఢిల్లీలో రూ.2,078.50కి, కోల్‌కతాలో రూ.2,208కి ఎగబాకింది. గత నెల, అంటే మార్చి 1వ తేదీన కూడా కమర్షియల్ సిలిండర్‌పై రూ.114.5 పెంచిన విషయం తెలిసిందే. నెల తిరిగే సరికి మరోసారి ధరలు పెరగడం గమనార్హం.

**జెట్ ఇంధనం ధరల మోత:** ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్) ఇంధనం ధరలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరగడంతో విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.ఇవాళ జెట్ ఇంధనం ధర ఏకంగా 114.5 శాతం పెరిగి కిలోలీటరుకు రూ.2.07 లక్షలకు చేరింది. ఏటీఎఫ్ ధర రూ.2 లక్షల మార్కును దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థల ప్రకటన ప్రకారం ఢిల్లీలో ఏటీఎఫ్ ధరకిలోలీటర్‌పై రూ.1,10,703 మేర పెరిగి రూ.2,07,341కి చేరింది. విమాన యాన సంస్థల మొత్తం నిర్వహణ వ్యయంలో దాదాపు 40శాతం ఇంధనానికే ఖర్చవుతుంది. ఈ నేపథ్యంలో ఇంత భారీగా పెరిగిన ధరల భారాన్ని తట్టుకోవడం కంపెనీలకు అసాధ్యం. దీంతో ఈ భారాన్ని ప్రయాణికులపైకి బదిలీ చేసేందుకు విమానయాన సంస్థలు సిద్ధమవుతున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచడం మినహా వాటికి మరో మార్గం లేదని అధికారులు విశ్లేషిస్తున్నారు.

**ప్రీమియం ఇంధనాల ధరలు పెరిగాయి**

ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) ప్రీమియం ఇంధనాల ధరలను సవరించింది. దీంతో ఉన్నత శ్రేణి పెట్రోల్, డీజిల్ వేరియంట్ల ధరలు పెరిగాయి. ఐఓసి తన హైఆక్టేన్ ఎక్స్‌పి100 పెట్రోల్ ధరను ఢిల్లీలో లీటరుకు రూ.149 నుండి రూ.160కి పెంచింది. ఈ ప్రీమియం ఇంధనాన్ని సాధారణంగా లగ్జరీ వాహనాలు, అధిక పనితీరు గల మోటార్‌సైకిళ్లలో ఇంజిన్ సామర్థ్యం, పనితీరును మెరుగుపర చడానికి ఉపయోగిస్తారు. ఎక్స్‌ట్రా గ్రీన్ పేరుతో విక్రయించబడుతున్న ప్రీమియం డీజిల్ ధర కూడా పెరిగింది. దీని ధర లీటరుకు రూ.91.49 నుంచి రూ.92.99కు పెరిగింది.

## స్వర్ణ దేవాలయంలో ప్రియాంక చోప్రా సేవలు



**అమృత్‌సర్,ఏప్రిల్ 1:** స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆమె పర్యటనకు సంబంధించిన వార్తలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా అమృత్‌సర్‌లోని ప్రఖ్యాత స్వర్ణ దేవాలయాన్ని (గోల్డెన్ టెంపుల్) సందర్శించుకున్న ప్రియాంక, అక్కడ ఆధ్యాత్మిక సేవలో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. గుడి ప్రాంగణంలో ఆమె స్వయంగా గిన్నెలు శుభ్రం చేస్తూ కనిపించారు. ఈ అరుదైన దృశ్యానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. నిన్న మహావీర్ జయంతి సందర్భంగా ప్రియాంక స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. గులాబీ రంగు దుస్తులు ధరించి, తలపై దుపట్టా కప్పుకుని ఆమె ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సిక్కు మతంలో ఎంతో పవిత్రంగా భావించే సేవలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఉపయోగించే పాత్రలను ఆమె శ్రద్ధగా శుభ్రం చేశారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ఒక సామాన్య భక్తురాలిగా ఆమె సేవలో నిమగ్నమవడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రియాంక భారత్ పర్యటన వెనుక అసలు కారణం ఏమిటనే దానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఆమె తన సినిమా షూటింగ్ కోసమే ఇక్కడికి వచ్చారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# మంటల్లో పశ్చిమాసియా

## హర్మూజ్ కోసం భూతల దాడులకు అమెరికా సిద్ధం

**వాషింగ్టన్,ఏప్రిల్ 1:** మధ్యప్రాచ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా ఇరాన్‌పై భూతల దాడులు చేయడానికి సిద్ధంగా ఉంది. ఇరాన్ దిగ్బంధించిన హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఆపరేషన్ ప్రారంభించాలని చూస్తోంది. హార్ముజ్ జలసంధిని తెరవడానికి యూఏఈ, సౌదీ అరేబియాతో పాటు గల్ఫ్ లోని మిత్రదేశాలు అమెరికాకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై చర్యలు తీసుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం కోసం యూఏఈ లాబీయింగ్ చేస్తుందని చెప్పింది. ఈ జలసంధిని తెరవడానికి ఒక కూటమిని ఏర్పాటు చేయాలని అమెరికా, యూరప్, ఆసియాలోని సైనిక శక్తులను తమ దేశ దౌత్యవేత్తలు కోరినట్లు యూఏఈ అధికారులు చెప్పినట్లు ఆంగ్లమీడియా పేర్కొంది. అమెరికా సన్నిహిత మిత్రదేశం బహ్రెయిన్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేస్తున్నట్లు, గురువారం దీనిపై ఓటింగ్ జరగ నున్నట్లు సమాచారం. గల్ఫ్ దేశాల ఆహారం, ఇతర ఎగుమతులు, దిగుమతులు ఈ హార్ముజ్ జలసంధిపై ఆధారపడి ఉన్నాయి. ప్రపంచంలో 20 శాతం చమురు రవాణా ఈ మార్గం గుండానే జరుగుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ దాడి తర్వాత ఇరాన్ ఈ మార్గాన్ని కంట్రోల్ చేస్తోంది. నౌకలపై దాడులు చేస్తోంది. కొన్ని మిత్రదేశాలకు చెందిన నౌకల్ని మాత్రమే ఇరాన్ అనుమతిస్తోంది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ఈ యుద్ధంలో సౌదీ, యూఏఈ కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్‌ను ఎదుర్కోవడానికి గల్ఫ్ ప్రాంతంలోని ఇతర దేశాలతో కూటమి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెప్పారు. యూఏఈ యుద్ధంలో చేరబోతున్నట్లు వార్తలు వచ్చాయి. నేను అరబ్ నాయకులతో రహస్యంగా మాట్లాడాను, ఇరాన్‌కు అవకాశం వస్తే మిమ్మల్ని జయించి, మీ రాజ్యాలను కూల్చివేస్తుందని చెప్పాను అని నెతన్యాహూ చెప్పడం విశేషం.

## ఇరాన్ యుద్ధంలో బ్రిటన్ చేరేదిలేదు: ప్రధాని స్టార్మర్



**వాషింగ్టన్,ఏప్రిల్ 1:** బ్రిటన్, ఫ్రాన్స్ వంటి మిత్రదేశాలు, నాటో కూటమిలో సభ్యులు తనతో కలవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ యుద్ధంలో యూకే సహకరిం చడం లేదని మండిపడ్డారు. ఇకపై మీ చావు మీరు చావండి అంటూనే, నాటో కూటమి నుంచి వైదొల గాలని అమెరికా భావిస్తోంది. ఇలా భయపెడుతున్నా, ట్రంప్‌ను ధిక్కరిస్తూ బ్రిటన్ సంచలన వ్యాఖ్యలు చేయడంతో పాటు కీలక నిర్ణయం తీసుకుంది. తాము ఇరాన్ యుద్ధంలో చేరబోమని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తేల్చి చెప్పాడు. ఇదే కాకుండా ట్రంప్‌కు మరింత కోపం తెప్పించే విధంగా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి గ్లోబల్ హార్ముజ్ సమ్మిట్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఇరాన్ యుద్ధం బ్రిటన్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్టార్మర్ హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కో వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. నాపైనా, ఇతరులపైనా ఎంత ఒత్తిడి వస్తున్నా, ఎంత గందరగోళం సృష్టిస్తున్నా, నా నిర్ణయాలన్నీ బ్రిటన్ పౌరుల శ్రేయస్సు కోసమే ఉంటాయి. అందువల్ల, ఇది మన యుద్ధం కాదని, మనం ఇందులో చిక్కుకోవాలని కోరుకోవడం లేదని స్పష్టం చేస్తునట్లు స్టార్మర్ చెప్పారు. మరోవైపు, త్వరలో యూరప్‌ను కూడా ఇరాన్ యుద్ధం ప్రభావితం చేస్తుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెచ్చరించింది.

## యుద్ధ ఉద్రిక్తతల్లో ప్రజల మధ్యకు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు

**టెహ్రాన్, ఏప్రిల్ 2:** ఇరాన్‌లో అరుదైన దృశ్యం కనిపించింది. దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఓ ర్యాలీలో నేరుగా ప్రజల మధ్యకు వచ్చారు. హత్యాయత్నాల ముప్పు పొంచి ఉన్నప్పటికీ, కనీస భద్రతా ఏర్పాట్లు కూడా లేకుండా వారు జనంతో కలిసిపోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ఇస్లామిక్ రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా టెహ్రాన్ వీధుల్లో జరిగిన ఈ ర్యాలీలో అధ్యక్షుడు పెజెష్కియాన్, మంత్రి అరాఘ్చి ప్రజలతో మాట్లాడుతూ, సెల్ఫీలు దిగుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రజల మధ్యకు రావడం ద్వారా వారి నుంచి స్ఫూర్తి పొందడానికి, ఈ ఐక్యతను ఆస్వాదించడానికి వచ్చానని విదేశాంగ మంత్రి అరాఘ్చి వ్యాఖ్యానించారు. ఇరాన్‌లో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయెల్, అమెరికా కలిసి ఆ దేశ ఉన్నత స్థాయి అధికారులను లక్ష్యంగా చేసుకుని హత్యలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజానీ కూడా ఇలాగే బహిరంగంగా కనిపించిన కొన్ని రోజులకే అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. యూరోపియన్ కౌన్సిల్ అధిపతితో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ మాట్లాడారు. ఈ ఘర్షణకు ముగింపు పలికేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. మళ్లీ ఇలాంటి దాడులు పునరావృతం కావనే గ్యారెంటీ ఇవ్వడం వంటి ప్రాథమిక షరతులను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గతవారం అమెరికా ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికకు కౌంటర్‌గా ఇరాన్ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ శక్తిమంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ నేతలను లక్ష్యంగా చేసుకుని హత్యలు కొనసాగిస్తే, గూగుల్, యాపిల్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలపై ప్రతీకార దాడులకు దిగుతామని ప్రకటించింది. దీంతో ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## మస్క్ స్టార్‌లింక్‌నూ టార్గెట్ చేస్తాం..

**టెహ్రాన్, ఏప్రిల్ 1:** అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. పొరుగు దేశాల్లోని అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడులకు దిగుతామని, ఈ క్రమంలోనే ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థపై విరుచుకుపడతామని స్పష్టం చేసింది. బహ్రెయిన్, కువైట్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాల్లో స్టార్‌లింక్ కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో అక్కడి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇరాన్ దాడుల కారణంగా గల్ఫ్ దేశాల్లో తరచూ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌లు సంభవిస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పలు దేశాలు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఐఆర్‌జీసీఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. ఇప్పటికే ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న సుమారు 18 అమెరికా టెక్ కంపెనీల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ తెలిపింది. ఈరోజు నుంచి యాపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టెస్లా, బోయింగ్ వంటి ఇతర దిగ్గజ కంపెనీల యూనిట్లపై కూడా దాడులు చేసే అవకాశం ఉందని ఇరాన్ సైన్యం సంకేతాలిచ్చింది. ఆయా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రాణాలు కాపాడుకోవాలంటే తక్షణమే ఆ ప్రాంతాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఇరాన్‌లో ఇప్పటికే స్టార్‌లింక్‌పై నిషేధం అమల్లో ఉంది. ఈ నెట్‌వర్క్‌ను ఉపయోగించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నారు.

## నాటో కూటమి నుంచి వైదొలిగేందుకు ట్రంప్ యోచన



**ఫ్లోరిడా,ఏప్రిల్ 1:** నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్ సైనిక కూటమి నుంచి అమెరికా బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా డొనాల్డ్ ట్రంప్ అమెరికన్ మీడియాతో మాట్లా డుతూ నాటో నుంచి బయటకు వచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నాటో ఒక కాగితపులిగా మారిందని అన్నారు. నాటో విశ్వసనీయత గురించి తనకు ముందు నుంచి అనుమానాలు ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ట్రంప్‌కు నాటో మిత్రదేశాలు సహకరించలేదు. బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీతో పాటు పలు దేశాలు నాటో కూటమిలో ఉంటూ అమెరికా జరుపుతున్న ఇరాన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పలు సందర్భాల్లో ట్రంప్ యూరప్ దేశాలు, నాటో దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తన ట్రూత్ సోషల్‌పోస్ట్‌లో ఘాటు వ్యాఖ్యలుచేశారు. ఈ యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సహకరించడం లేదని, ఇజ్రాయిల్ వైపు వెళ్తున్న తమ విమానాలకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇరాన్ దాడుల్లో అమెరికాకు సాయం చేయదని దేశాలను ఉద్దేశిస్తూ వెళ్లి మీరు చమురు తెచ్చుకోండి అంటూ హెచ్చరించారు.ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని నిర్మూలించే చర్యలో పాల్గొనడానికి నిరాకరించిన దేశాలు తమకు కావాల్సిన చమురును అమెరికా నుంచి కొనుగోలు చేయాలని లేదా హార్ముజ్ జలసంధి గుండా వెళ్లి చమురు తెచ్చుకోవాలని రెండు ఆప్షన్లు ఇచ్చారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో రాశారు. మిత్రదేశాలపై ట్రంప్ తన అసనాన్ని వ్యక్తం చేస్తూ ఇకపై ఆ దేశాలు తమ కోసం తాము ఎలా పోరాడాలో నేర్చుకోవాలని, మిత్రదేశాలకు అమెరికాకు అండగా నిలవట్లేదని, అమెరికా కూడా ఇకపై వారికి సహాయం చేయడానికి అందుబాటులో ఉండదని స్పష్టం చేశారు.

## హెచ్1బి వీసా లాటరీ పూర్తి చేశాం

### లాటరీ అభ్యర్థులే ఇకపై పిటిషన్ల దాఖలుకు అర్హులు

### వీరికి 90 రోజుల గడువు ఇస్తున్నట్లు యుఎస్‌సిఐఎస్ వెల్లడి

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణులకు కీలకమైన హెచ్1బీ వీసాకు సంబంధించి యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ముఖ్య నోటిఫికేషన్ ఇచ్చింది. 2027 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వీసాల కోటాకు సరిపడా ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్లు అందాయని, లాటరీ ప్రక్రియను పూర్తి చేశామని ఎంపికైన లబ్ధిదారుల వివరాలను వారి పిటిషనర్లకు తెలియజేశామని పేర్కొంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమ యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ ఖాతాల ద్వారా తమ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. లాటరీలో ఎంపికైన వారు మాత్రమే ఏప్రిల్ 1, 2026 నుంచి హెచ్1బీ పిటిషన్లు దాఖలు చేయడానికి అర్హులు. పిటిషన్ల దాఖలుకు కనీసం 90 రోజుల గడువు ఉంటుందని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. పిటిషన్‌తో పాటు లాటరీలో ఎంపికైనట్లు తెలిపే సెలక్షన్ నోటీసు కాపీని జతచేయాలి. ఈ ఏడాది నుంచి యూఎస్‌సీఐఎస్ కొన్ని కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా, అధిక నైపుణ్యాలు, అధిక వేతనాలు ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇచ్చేలా వెయిటెడ్ సెలక్షన్ సిస్టమ్ ప్రవేశపెట్టింది. పిటిషన్ దాఖలు సమయంలో రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న పాస్‌పోర్ట్, ఉద్యోగ వివరాలు సరిపోవాలని స్పష్టం చేసింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త వెర్షన్ ఫారం ఐ129 (02/27/26 నాటిది) మాత్రమే స్వీకరిస్తామని తెలిపింది. 2025 సెప్టెంబర్ 21 తర్వాత దాఖలు చేసే కొన్ని ప్రత్యేక హెచ్1బీ పిటిషన్లకు అర్హత షరతుగా అదనంగా 1,00,000 డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని ఏజెన్సీ పేర్కొంది. ప్రతి ఏటా కాంగ్రెస్ 65,000 హెచ్1బీ వీసాలను కేటాయిస్తుండగా, అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి అదనంగా 20,000 వీసాలు అందుబాటులో ఉంటాయి. టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాల్లోని సంస్థలు ఈ వీసా ప్రోగ్రామ్‌పై ఎక్కువగా ఆధారపడతాయి. ఏటా హెచ్1బీ వీసాలు పొందుతున్న వారిలో భారతీయుల వాటా గణనీయంగా ఉంటోంది.

# దేశవ్యాప్తంగా జనగణన షెడ్యూలు ప్రారంభం

## తొలిసారిగా డిజిటల్ విధానంలో కుటుంబాల వివరాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దేశంలో జనాభా లెక్కల కోసం కేంద్రం చేపట్టిన జనగణన తొలివిడత కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. ఇది 16వ విడత లెక్కింపు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదో సారి జరుగుతున్నట్లయింది. తొలిసారి జనగణన దేశంలో 1872లో ప్రారంభమైంది. అంతకుముందు చివరిసారిగా 2011లో జనాభాను లెక్కించారు. నిజానికి షెడ్యూల్ ప్రకారం 2021లో తిరిగి జనాభా లెక్కింపు ప్రారంభం కావాలి. ఆ సమయంలో కోవిడ్ కారణంగా ఇది వాయిదాపడింది. అందువల్ల ఇప్పుడు జనగణన కేంద్రం మొదలుపెట్టింది. ఈసారి భారీ మొత్తంలో, సాంకేతికతను ఉపయోగించి డిజిటల్ విధానంలో కూడా జనగణన చేపట్టనుంది. మొదటి దశలో ఇళ్లను లెక్కిస్తారు. ఆ తర్వాత రెండో దశలో జనాభాను లెక్కిస్తారు. ఈ సారి కులగణన కూడా చేపడతారు. వచ్చే ఆరు నెలలపాటు అంటే సెప్టెంబర్ వరకు ఇండ్లు, వాటి స్థితి, గృహోపకరణాలు వంటివి లెక్కిస్తారు. మొదటివిడత జనగణనకు రిఫరెన్స్ డేట్ మార్చి 1, 2027. జమ్మూ కాశ్మీర్, లడాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచు కురిసే, వాతావరణం అనుకూలించని ప్రాంతాలకు మాత్రం రిఫరెన్స్ డేట్ అక్టోబర్ 1, 2026. అలాగే, వేర్వేరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తొలి విడత జనగణన వేర్వేరుషెడ్యూల్స్‌లో ఉంది. రెండోదశలో జనాభా లెక్కింపు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతుంది. ఎప్పటిలాగే శీతల ప్రాంతాలైన జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో మాత్రం ఈ ఏడాది సెప్టెంబర్ నుంచే జనగణన ప్రారంభమవుతుంది. మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరిస్తారు. 16 భారతీయ భాషల్లో వివరాలు నమోదు చేయవచ్చు. ఈ జనగణన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.11,718 కోట్లు కేటాయించింది. తెలంగాణలో తొలివిడత జనగణన మే 11 నుంచి ప్రారంభమవుతుంది. జూన్ 9 వరకు కొనసాగుతుంది. తొలి విడతలో ఎన్యుమరేటర్లు ప్రజలను 33 ప్రశ్నలు అడుగుతారు. అంటే 33 అంశాలకు సంబంధించి వివరాలు సేకరిస్తారు. జనగణనలో సేకరించే వివరాల్ని రహస్యంగా ఉంచుతారు. జనాభా లెక్కల ఆధారంగా ప్రభుత్వ పథకాల వర్తింపు ఉండదు. ప్రజల నుంచి ఎలాంటి డాక్యుమెంట్లను సేకరించరు. ఈ కార్యక్రమం పూర్తైన తర్వాత పూర్తి వివరాల్ని ప్రభుత్వం వచ్చే ఏడాదే వెల్లడిస్తుంది.

# నల్లసముద్రంలో కుప్పకూలిన రష్యా సైనిక విమానం

## 29 మంది దుర్మరణం



**మాస్కో,ఏప్రిల్ 1:** రష్యాలో ఘోర విషాదం చోటు చేసుకుంది. క్రిమియాలో రష్యా సైనిక విమానం కూలిపోయింది. బుధవారం తెల్లవారుజామున కొండను ఢీకొట్టడంతో ఏఎన్26 సైనిక విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. 23 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దుర్మరణం చెందారు. ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపినట్లు రష్యా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. రష్యాకు చెందిన ఏఎన్26 సైనిక విమానం మియా ద్వీపకల్పం మీదుగా ప్రయాణిస్తోంది. అయితే ఈ విమానం 2014లో ఉక్రె యిన్ నుంచి స్వాధీనం చేసుకున్న నల్ల సముద్ర ద్వీపకల్పంలో కూలిపోయింది. కొండను ఢీకొట్టి కూలిపోయినట్లుగా తెలుస్తోంది. విమానంలో ఉన్న 23 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది అక్కడికక్కడే చనిపోయారు. ఈ ప్రమా దానికి సాంకేతికలోపమే కారణంగా తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలను మాత్రం రష్యా ఇంకా వెల్లడించలేదు. మాస్కో కాలమానం ప్రకారం గతనెల 31న సుమారుగా సాయంత్రం నాలుగు గంటలకు విమానం క్రిమియా ద్వీప కల్పం మీదుగా వెళ్తున్నట్లు సమాచారం. కొద్దిసే పటికే విమానంతో సంబంధాలు తెగిపోయినట్లుగా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. వెంటనే సహా యక బృందం ఏఎన్26 విమానం కూలిపోయిన ప్రదేశాన్ని గుర్తించింది. ఘటనా స్థలంలోనే ఆరు గురు సిబ్బంది, 23మంది ప్రయాణికులు చనిపో యినట్లుగా మంత్రిత్వశాఖతెలిపింది. విమానంపై ఏదైనా దాడి జరిగినట్లుగా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో సాంకేతికలోపమే ఈ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

# హోంల్యాండ్ సెక్యూరిటీ మాజీ చీఫ్ వింత వేషధారణలు

**వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 1:** అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఒక సంచలన కుంభకోణం వెలుగు చూసింది. హోంల్యాండ్ సెక్యూరిటీ మాజీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ భర్త బ్రయాన్ నోయెమ్ మహిళా వేషధారణలో (క్రాస్ డ్రెస్సింగ్) ఉన్న ఫోటోలు బయటకు రావడం కలకలం రేపింది. ఆన్‌లైన్‌లో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్సూరెన్స్ రంగంలో ప్రముఖుడైన 56 ఏళ్ల బ్రయాన్ నోయెమ్ తన భార్య పదవిలో ఉండగా ఆన్‌లైన్‌లో పలువురు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు వచ్చాయి. హాట్ పింక్ రంగు అండర్ వేర్, నకిలీ వక్షోజాలతో ఉన్న ఆయన ఫొటోలను ఈ నివేదిక బయటపెట్టింది. ముగ్గురు పిల్లల తండ్రి అయిన బ్రయాన్, అపరిచితులతో అభ్యంతరకరమైన ఫొటోలను పంచుకున్నారని కథనం పేర్కొంది. గత మార్చిలో డొనాల్డ్ ట్రంప్ క్రిస్టీ నోయెమ్‌ను పదవి నుంచి తొలగించారు. తన భర్త చర్యల వల్ల తాను బ్లాక్‌మెయిల్‌కు గురయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆమె ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో కుటుంబం షాక్‌కు గురైంది. ఈ సమయంలో మాకు ప్రైవసీ కావాలి. మా కోసం ప్రార్థించాలని కోరుకుంటున్నామని నోయెమ్ కుటుంబ ప్రతినిధి తెలిపారు. ఈ వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. బ్రయాన్ ప్రవర్తనను కుటుంబం ధ్రువీకరించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## గుజరాత్‌పోర్టుకు వస్తున్న ఇరాన్ తొలి చమురునౌక



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. మార్చి 4న ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్‌లోకి చమురు లోడింగ్ చేశారని ఏప్రిల్ 4న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు ఇది చేరుకోనుందని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ క్లెప్లర్ వెల్లడించింది. 2019 తర్వాత ఇరాన్ ముడి చమురు భారత్‌కు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో దాదాపు 6లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఏ భారతీయ రిఫైనరీ ఉపయోగించనుందనే విషయంపై ఎలాంటి సమాచారం లేదు. గతంలో భారత్.. ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్‌వాటా సుమారు 11.5 శాతం ఉంది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా మే 2019 నాటికి అది రోజుకు 2,68 లక్షల బ్యారెళ్లకు తగ్గింది. ఆ తర్వాత ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఆదేశం నుంచి ముడి చమురు దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.

## 8 గంటల్లోపు రద్దుచేస్తే నో రిఫండ్: ఐఆర్‌సిటిసి కొత్త రూల్స్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారతీయ రైల్వే ప్రయాణికులకు రైలు టికెట్ల రద్దు, రిఫండ్ విధానంలో మార్పులు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం, రైలు బయలుదేరడానికి 8 గంటలలోపు కన్ఫర్మ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే ప్రయాణికులకు ఎలాంటి రిఫండ్ లభించదు. గతంలో ఈ గడువు 4 గంటలుగా ఉండేది. ప్రయాణానికి 8 గంటల నుంచి 24 గంటల మధ్యలో టికెట్‌ను రద్దు చేస్తే టికెట్ ధరలో 50 శాతం మాత్రమే తిరిగి వస్తుంది. అదేవిధంగా, 24 గంటల నుంచి 72 గంటల ముందు రద్దు చేసుకుంటే 25 శాతం కోత విధించి, 75 శాతం మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. ఒకవేళ ప్రయాణానికి 72 గంటల కంటే ముందే టికెట్‌ను రద్దు చేస్తే కేవలం సాధారణ రద్దు ఛార్జీలు మాత్రమే వర్తిస్తాయి. టికెట్ ఏజెంట్లు, దళారులు పెద్ద సంఖ్యలో టికెట్లను బ్లాక్ చేసి, చివరి నిమిషంలో రద్దుచేయడాన్ని అరికట్టేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు రైల్వే శాఖ తెలిపింది. దీనివల్ల నిజమైన ప్రయాణికులకు చివరి నిమిషంలో కూడా బెర్తులు అందు బాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు కానున్నాయి.

## వాహనాలకు నిప్పంటించిన మహిళ



**భువనేశ్వర్, ఏప్రిల్ 1:** హైకోర్టు ముందు పార్క్ చేసిన వాహనాలకు ఒక మహిళ నిప్పంటించింది. మండుతున్న వస్తువును కోర్టు ప్రాంగణంలోకి విసిరింది. ఈ సంఘటనలో పలు వాహనాలు దగ్ధం అయ్యాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఒడిశాలోని కటక్‌లో ఈ సంఘటన జరిగింది. కటక్‌లోని ఒడిశా హైకోర్టు వద్దకు ఒక మహిళ చేరుకున్నది. కోర్టు బయట పార్క్ చేసిన స్కూటర్ వెనుక పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. మండుతున్న వస్తువును కోర్టు ప్రాంగణంలోకి విసిరింది. వాహనాలకు మంటలు వేగంగా వ్యాపించాయి. బొలెరో వాహనం, ఎలక్ట్రిక్ స్కూటర్, రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయి. మంటలు పెద్ద ఎత్తున మండుతుండడంతో అక్కడున్న జనం భయాందోళనకు గురైనారు. ఫైర్ సిబ్బంది వచ్చి వెంటనే మంటలు ఆర్పివేశారు. నిప్పు పెట్టిన మహిళ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోడీ దృష్టిని ఆకర్షించేందుకు ఉద్దేశపూర్వకంగా వాహనాలకు నిప్పు పెట్టినట్లు తెలిపింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా బిరిడి ప్రాంతానికి చెందిన మినాటి సాహుగా నిందితురాలిని గుర్తించారు. ప్రధాని మోడీని కలవాలనుకున్నాను, అది కుదరకపోవడంతో ఈ చర్యకు పాల్పడినట్లు నిందితురాలు చెప్పిందని పోలీస్ అధికారి తెలిపారు. ఆ మహిళ మానసికంగా కలత చెందినట్లుగా తెలుస్తుదని అన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఒకే సీటు కోసం ఇద్దరు నేతల పోటీ!

**చెన్నై, ఏప్రిల్ 1:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎఐ ఎడిఎంకె, బిజెపి కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. 27 స్థానాల్లో బిజెపి పోటీ చేయనుంది. అయితే ఓ సీటు కోసం మాత్రం బిజెపిలో కుమ్ములాట సాగుతున్నట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ జోక్యం చేసుకున్నా ఇద్దరు నేతలు మాత్రం ఆ సీటు కోసమే పట్టుబడినట్లు సమాచారం. రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై, మహిళా మోర్చా చీఫ్ వనతి శ్రీనివాసన్ ఒకే సీటుకోసం పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కోయంబత్తూర్ నార్త్ నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలలో ఉన్నారు. 27 సీట్లను పంచుకునే క్రమంలో జరిగిన మీటింగ్‌లో ఇద్దరు నేతలు కోయంబత్తూర్ సీటు కోసం పట్టుపట్టినట్లు తెలుస్తోంది. సీటు షేరింగ్ వల్ల సింగనల్లూర్, కవుందంపాల్యం సీట్లను ఎఐఎడిఎంకెకు కేటాయించారు. అయితే కోయంబత్తూర్ నార్త్ సీటును వనతి శ్రీనివాసన్‌కు కేటాయించారు. కానీ అన్నామలై కూడా కోయబంత్తూర్ బర్త్‌ను కోరుకుంటున్నారు. దీంతో ఆ ఇద్దరి మధ్య ఇంటర్నల్ వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వనతి శ్రీనివాసన్ చాన్నాళ్ల నుంచి ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్నారని, ఆ స్థానాన్ని మరొకరికి కేటాయించలేమని పార్టీ స్పష్టం చేసింది. కానీ ఇదే ప్రాంతం నుంచి పోటీ చేయాలని అన్నామలై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరునేతల్లో ఒకరిని రామనాథపురం నుంచి పోటీచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.





# తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా చండీ హోమం

తిరుపతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా పౌర్ణమి చండీ హోమం జరిగింది. పూజా కార్యక్రమములో పాల్గొన్న భక్తులందరికీ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. హోమం పూర్ణాహుతితో ముగిసింది. ఈ కార్యక్రమంలో పులిగోరు మురళీకృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ శారదాదేవి, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. చండీహోమం ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఆలయ ఇఒ. ఎ. జయకుమార్ పర్యవేక్షణలో జరిగింది.

# కాషాయంతో శుకబ్రహ్మాశ్రమం కళకళ

## దేశ నలుమూలల నుంచి పీఠాధిపతులు రాక



శుకబ్రహ్మాశ్రమంలో పీఠాధిపతులతో ఆధ్యాత్మిక సభలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: అనంతమైన పరమాత్ముని ఆరాధించి మోక్షం పొందాలని ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి పిలుపు నిచ్చారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న జీవనది స్వర్ణముఖి వద్దున వెలసిన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో బుధవారం ఆశ్రమ 76వ వార్షికోత్సవం ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యా ప్రకాశానందస్వామి 113వ జన్మదిన వేడుకలు, 28వ ఆరాధనోత్సవాలకు దేశ నలుమూలల నుంచి మఠాధిపతులు, పీఠాధిపతులు కదలి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఆశ్రమం వరకు కాషాయంతో శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం కళకళ లాడింది. ఆశ్రమ ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి పర్యవేక్షణలో ఆరాధనోత్సవాల కార్యక్రమాలు సాగుతున్నాయి.

**యతి పూజలో పీఠాధిపతులు:** శుకబ్రహ్మాశ్రమంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలకు దేశ నలుమూలల నుంచి పాతికమంది పీఠాధిపతులు హాజరయ్యారు. వారికి యతి పూజలు నిర్వహించారు. కాళ్ళు కడిగి సంప్రదాయం మేరకు పాదసేవ చేసారు. తరువాత వారి నుంచి ఆశీర్వాదాలు అందుకున్నారు. పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి వ్యాఖ్యాతగా పాదపూజలు జరిగాయి. పాల్గొన్న పీఠాధిపతుల్లో వశిష్ట ఆశ్రమ పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి, సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థ స్వామి, చిన్మయమిషన్ నుంచి శివప్రకాశానందగిరి స్వామి, శంకరానందగిరి ఆశ్రమ పీఠాధిపతి గురుచరణ నందగిరి స్వామి, పుత్తూరు ఆశ్రమ పీఠాధిపతి శివానందగిరి స్వామి విచ్చేసారు. వారు భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేసారు.




# ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం

తిరుపతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: అమరగాయకుడు, తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఆయన విగ్రహానికి బుధవారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేసి, విశేష పుష్పాంజలి ఘటించారు. ఘంటసాల తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని కొనియాడుతూ నగరంలోని భవానీనగర్ కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెవన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, ఘంటసాల అభిమానులు మిట్టపల్లి బ్రహ్మానందం, పోలే జనార్దన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, టీచర్ తిరుమలయ్య, ఆర్ఎంఎస్ భాస్కర్, గాయకులు పద్మనాభం, పురోహితుడు సురేష్ స్వామి, ఆది గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తుల చిట్టా ఇక అరచేతిలో

- నేరాలను నియంత్రించేందుకు పోలీసుల విస్తృత చర్యలు
- అందుబాటులోకి 'పాపిల్లాన్ ఫింగర్ ప్రింట్ స్కానర్' సాంకేతికత

విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలో నేరాలను నియంత్రించి, పాత నేరస్థులకు చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఇందులో భాగంగా తాజాగా 'పాపిల్లాన్ ఫింగర్ ప్రింట్ స్కానర్' అనే అత్యాధునిక పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పరికరం సాయంతో అనుమానితుల నేర చరిత్రను కేవలం సెకన్ల వ్యవధిలోనే తెలుసుకోవచ్చు. నేర నియంత్రణలో ఇది ఒక కీలక అస్త్రంగా మారనుందని పోలీస్ శాఖ భావిస్తోంది.

ఈ స్కానర్ చాలా చిన్నదిగా, తేలికగా ఉండటంతో పోలీసులు విధుల్లో ఉన్నప్పుడు సులభంగా తమతో పాటు తీసుకెళ్లవచ్చు. దీనిని మొబైల్‌లోని ప్రత్యేక యాప్‌తో అనుసంధానిస్తారు. అనుమానిత వ్యక్తి బొటన వేలు లేదా చూపుడు వేలి ముద్రను స్కానర్‌పై ఉంచిన వెంటనే, ఆ వివరాలు పోలీస్ శాఖ వద్ద ఉన్న డేటాబేస్‌తో సరిపోల్చుకుంటాయి. ఒకవేళ ఆ వ్యక్తిపై రాష్ట్రంలోని ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా కేసులు నమోదై ఉన్నా, రౌడీ షీట్ తెరిచి ఉన్నా.. ఆ వివరాలన్నీ క్షణాల్లో స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఏ కేసు, ఎక్కడ నమోదైంది వంటి పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఒకవేళ ఎలాంటి నేర చరిత్ర లేకపోతే నాట్ ఫౌండ్ అని చూపిస్తుంది.



ముఖ్యంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రదేశాల్లో పాత నేరస్థులు, దొంగలు ప్రయాణికులతో కలిసిపోయి నేరాలకు పాల్పడుతుంటారు. వారిని గుర్తించడం పోలీసులకు సవాలుగా ఉండేది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని, ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరస్థులను పట్టుకోవడం కష్టమయ్యేది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీ కాస్తున్న సిబ్బందికి అనుమానితులను విచారించినా, వారిపై కేసులు ఉన్నాయో? లేదో? తెలుసుకోవడానికి సమయం పట్టేది. ఈ సమస్యలకు పరిష్కారంగా ఈ కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టారు.

ఈ పాపిల్లాన్ స్కానర్ రాకతో పోలీసుల పనితీరు మరింత సులభతరం కానుంది. నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచడం, అనుమానితుల వివరాలను వెంటనే ధృవీకరించుకోవడం ద్వారా నేరాలు జరగకముందే నివారించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా నేరాల నియంత్రణలో ఈ పరికరం ఒక కీలక సాధనంగా ఉపయోగపడనుంది.

# డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం 'దండి మార్చ్ 2.0'



## - తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: డ్రగ్స్ నిర్మూలనకు సైకిల్ యాత్రతో యువతలో చైతన్యానికి నూతన దిశనిర్దేశం చేయనున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్న "దండి మార్చ్ 2.0" సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఈగల్ పోలీస్ ఆధ్వర్యంలో ఎస్పీ బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ యాత్ర వేంకటేశ్వరవర్సిటీ నుండి ప్రారంభమై 17 రోజుల పాటు 13 జిల్లాల్లోసాగనుంది. ప్రజా చైతన్యం కోసం ఈ యాత్ర చేపట్టిన వైబ్రంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపకుడు విజయ్ కలాంని ఎస్పీ అభినందించారు. ఏప్రిల్ 6న జరిగే ప్రారంభ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ మహాత్మగాంధీ స్పూర్తితో దేశ యువతలో మాదక ద్రవ్యాల పట్ల చైతన్యం కలిగించాలనే లక్ష్యంతో "వైబ్రంట్స్ ఆఫ్ కలాం" సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు సుమారు 1000 కిలోమీటర్ల సైకిల్ యాత్ర నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్ అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, ప్రతి పౌరుడు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని, సమాజం మొత్తం కలిసి ముందుకు వస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సైకిల్ యాత్ర ద్వారా యువతకు డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి యువతను సరైన దారిలో నడిపించాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించడం ద్వారా సమాజ రక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా తమ శక్తిని సానుకూల దిశలో వినియోగించుకోవాలని, చెడుస్నేహితుల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తపడాలని అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసులు మాత్రమే కాకుండా సమాజం మొత్తం కలసి పని చేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైబ్రంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపకుడు విజయ్ కలాం, అదనపు ఎస్పీ రవి మనోహరచారి, రాష్ట్ర కోఆర్డినేటర్ రవి రాజు, ఈగల్ టీమ్ సిఐ ప్రసాద్, కమల్, నియోజకవర్గ కోఆర్డినేటర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు సిటీలో పెన్షన్ల పండుగ

## - ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసిన మంత్రి నారాయణ

నెల్లూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: ఆర్థిక ఇబ్బందుల్లో సైతం అవ్వా, తాతలకు ఇచ్చిన మాట తప్పని ప్రభుత్వం తమదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఇంటి ముంగిటికే పెన్షన్ డబ్బులు చేరుతుండడంతో లబ్దిదారుల ఆనందానికి అవధులు లేవన్నారు. వారి ఆశీస్సులే తమ ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని తెలిపారు. నెల్లూరు సిటీలోని 5వ డివిజన్ అహ్మద్ నగర్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జన జాతరను తలపించింది. రాష్ట్ర మంత్రి నారాయణ స్వయంగా లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి, అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్ నగదును అందజేయడంతో అహ్మద్ నగర్ వీధులన్నీ పండుగ వాతావరణంతో నిండిపోయాయి. మంత్రికి స్థానిక వమిళలు మంగళహారతులతో నీరాజనాలు పట్టి ఆత్మీయ స్వాగతం పలికారు. పూరిగుడిసెల్లో నివసించే నిరుపేదల యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం వేల కోట్ల అప్పులు పెట్టి వెళ్లినా,



ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేలు పెన్షన్ అందిస్తున్న ధీశాలి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే రోజు 99 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసి ఏపీ రికార్డు సృష్టించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ముందుకు సాగుతామన్నారు. రూ.50 కోట్లతో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం, 50 వేల మొక్కలతో నెల్లూరును గ్రీన్ సిటీగా మార్చడమే తన లక్ష్యమని చెప్పారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మంత్రి నారాయణ దాతృత్వం, క్రమశిక్షణ నెల్లూరు అభివృద్ధికి వెన్నముకని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ సుజాతా అశోక్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, డివిజన్ క్లస్టర్ శశికుమార్, ప్రెసిడెంట్ గంగాధర్, యూనిట్ ఇన్‌చిర్జాలు హబీబ్, శాద, టిడిపి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు, టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ఎసిబికి పట్టుబడ్డ ఏటూరు విఆర్ఒ


చేజర్ల (నెల్లూరు), ఏప్రిల్ 1 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా చేజర్ల మండలం ఏటూరు గ్రామ విఆర్ఒ బుధవారం సాయింత్రం ఏసిబి అధికారుల వలలో చిక్కాడు. దొరువుపాడు గ్రామానికి చెందిన గంటా అంజిబాబు తన వ్యవసాయ భూమికి సంబంధించి పాస్ బుక్‌కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఎన్నిసార్లు తహసిల్దారు కార్యాలయం చుట్టు తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరాశ చెందిన రైతు గ్రామ విఆర్ఒని సంప్రదించగా రూ.40 వేలు డిమాండ్ చేశారు. దీంతో అంజిబాబు ఎసిబి అధికారులను సంప్రదించాడు. ఫిర్యాదును స్వీకరించిన ఎసిబి అధికారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం బాధితుడితో కలిసి ట్రాప్ నిర్వహించారు. ఈక్రమంలో ఆదూరుపల్లి బస్టాండ్‌లోని ఒక టీ స్టాల్ వద్ద విఆర్ఒ వెండేపల్లి వంశీ ప్రదీప్‌కుమార్ బాధితుడు నుండి రూ.32 వేలు స్వీకరిస్తుండగా ఎసిబి అధికారులు అతనని రెడ్ హ్యాండెడుగా పట్టుకున్నారు. అరెస్టు అనంతరం విఆర్ఒను వెంటనే చేజర్ల తహసిల్దారు కార్యాలయానికి తరలించారు. అక్కడ ఎసిబి అధికారులు సుధీర్ఘంగా విచారణ కొనసాగిస్తున్నారు.

# అన్నదాతలకు రూ.2676 కోట్ల పెట్టుబడి సాయం

విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వం పింఛన్ల రూపంలో 21 నెలల్లో రూ.60 వేల కోట్లు పేదలకు పంపిణీ చేసిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. "పెట్టుబడి సాయం కింద మూడో విడతగా 47 లక్షల మంది రైతులకు రూ.2676 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం. ఉగాది కానుకగా నిరుద్యోగులకు 10వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. దివ్యాంగ శక్తి పేరుతో 12.76 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాం. రంజాన్ తోఫాగా ఇమామ్, మౌజమ్‌లకు రూ.45 కోట్లను గౌరవ వేతనాల కింద అందించాం. టిడ్కో ఇళ్లతో కలిపి మొత్తం 250893 ఇళ్లను పేదలకు ఇచ్చాంచి' అని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్, వైకాపా నేతలు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# పర్యాటకశాఖ ప్రాజెక్టులకు నిధుల కోసం మంత్రి దుర్గేష్ హస్తిన పయనం

## - నేడు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ



విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ప్రాజెక్టులకు కేంద్రం నుండి నిధులు తీసుకువచ్చేందుకు మంత్రి కందుల దుర్గేష్ బుధవారం హస్తినకు బయలుదేరి వెళ్ళారు. గురువారం ఉదయం 9గంటలకు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో ఆయన భేటీ కానున్నారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కోరటంతో పాటు, రాష్ట్రంలో ఐకానిక్ పర్యాటక కేం ద్రాలు, ఆధ్యాత్మిక సర్క్యూట్ల బలోపేతం కోసం రూ.915 కోట్ల విలువైన 9 కొత్త ప్రతిపాదనలను కేంద్రమంత్రికి అందచేయనున్నారు. రాష్ట్రానికి 8 పర్యాటక ప్రాజెక్టులకు గానూ రూ.430 కోట్లు కేటాయించగా, నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర మంత్రిని కోరనున్నారు. కొత్తప్రాజెక్టుల్లో మచిలీపట్నం వైబ్రెంట్ బీచ్ ఫ్రంట్ డవలప్‌మెంట్‌కు స్వదేశ్ దర్శన్2.0 కింద రూ.120.04 కోట్లు, ప్రసాద్ స్కీము కింద రూ.95.18 కోట్లు, మంగళగిరి నరసి ంహస్వామి ఆలయం రూ.213.72 కోట్లు, అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయం రూ.48.95 కోట్లు, కోరుకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.120కోట్లు, లేపాక్షిలో పర్యాటక సౌకర్యాల కల్పనకు రూ.103.05కోట్లు, మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. అదేవిధంగా ఇప్పటికే మంజూరయిన బొర్రా గుహలు, సూర్యలంక బీచ్, నాగార్జునసాగర్, అహోబిలం, ప్రసాద్ పథకం కింద అన్నవరం, సింహాచలం పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరతారు. ఇంకా రాజమ ండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, కూచిపూడిలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్, విశాఖపట్నంలో లలితకళా అకాడమి ఏర్పాటు , విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో కళాక్షేత్ర ఆడిటోరియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించనున్నారు.

# పోలవరానికి మరో రూ.1,301 కోట్లు

విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు మరో రూ.1301 కోట్లు అడ్వాన్స్ నిధులు విడుదల చేసింది. ఇటీవల కేంద్ర జల్‌శక్తి కార్యదర్శి కాంతారావు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చినప్పుడు రాష్ట్ర అధికారులు జరుగుతున్న పనులు, నిధుల అవసరతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చేసిన పనులను ప్రత్యక్షంగా చూపించారు. దీంతో ఆయన దిల్లీ వెళ్లి ఈ పెండింగ్ సమస్యను పరిష్కరించారు. పోలవరానికి సంబంధించి సింగిల్ నోడల్ ఖాతాకు కేంద్రం నిధులు విడుదల చేయడం ఇదే చివరిసారి. ఇకపై స్పర్శ్ విధానంలో మాత్రమే నిధులు ఇవ్వనుంది. అంటే కేంద్రం ఇచ్చే అడ్వాన్స్ నిధులు ఇప్పటిదాకా రాష్ట్ర ఖజానాకు వచ్చేవి. అక్కడి నుంచి పోలవరం సింగిల్ నోడల్ ఏజెన్సీకి ఇచ్చేవారు. ఆ ఖాతా నుంచి బిల్లులు చెల్లించేవారు. ఇకపై స్పర్శ్ ద్వారా కేంద్రమే నేరుగా నిధులు ఇవ్వనుంది. పనిచేసిన మేరకు బిల్లు సమర్పించిన వెంటనే నిధులు విడుదల చేస్తుంది. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1508 కోట్లు ఇచ్చింది. తాజా పద్దుతో కలిపి మొత్తం రూ.2809 కోట్లు అందాయి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం బడ్జెట్‌లో సవరించిన అంచనాల మేరకు నిధులను రాష్ట్ర ప్రభుత్వం దాదాపుగా తెచ్చుకున్నట్లైంది. గతంలో అందించిన రూ.1508 కోట్ల పద్దులో రూ.600 కోట్లు ప్రాజెక్టు పనులకు రూ.300 కోట్లు పునరావాసం, భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించింది. కేంద్రం ఇచ్చిన అడ్వాన్స్‌లో 75% ఖర్చు చేస్తేనే తదుపరి అడ్వాన్స్ నిధులు దక్కుతాయి. గతంలో ఖర్చుచేసిన రూ.300 కోట్లు కేంద్రం రీయింబర్స్ చేయలేదు. లక్ష్యం మేరకు పనులు చేసినప్పటికీ వివిధ కారణాలు చూపుతూ ఆ మొత్తం ఇవ్వలేదు.

# చంద్రబాబుకు క్లీన్‌చిట్

## ఐఆర్ఆర్ కేసు కొట్టేసిన ఎసిబి కోర్టు

## సిఐడి క్లోజర్ రిపోర్టుకు ఆమోదం




విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాత వార్త ప్రతినిధి: సిఎం చంద్ర బాబు నాయుడుకు అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్ కేసులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనతో పాటుగా మంత్రులు నారాయణ, నారా లోకేశ్‌లపై ఉన్న ఆరోపణలను కొట్టివేస్తూ విజయవాడ ఎసిబి కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. కేసులో ఎలాంటి ఆధారాలు లేవని నిర్ధారిస్తూ సిఐడి దాఖలు చేసిన క్లోజర్ రిపోర్ట్‌ను న్యాయస్థానం ఆమోదించింది. దీంతో గత ప్రభుత్వం హయాంలో సంచలనం సృష్టించిన ఈ కేసు అధికారికంగా మూసివేసినట్లు అయింది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. 2014-19 మధ్య టిడిపి హయాంలో అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపకల్పనలో అక్రమాలు జరిగాయని, తమ వారికి లబ్ధి చేకూర్చేలా డిజైన్ మార్చారని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టిన సిఐడి అప్పట్లో చంద్రబాబు, నారాయణ, లోకేశ్‌లను నిందితులుగా చేర్చుతూ కేసు నమోదు చేసింది. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ కేసు దర్యాప్తును సమీక్షి ంచిన సిఐడి, ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని నిర్ధారణకు వచ్చింది. ఆరోపణలకు తగిన ఆధారాలు లభించలేదని పేర్కొంటూ, 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' (వాస్తవ దోషం) కింద కేసును మూసివేయాలని కోరుతూ ఎసిబి కోర్టులో క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేసింది. సిఐడి నివేదికను వ్యతిరేకిస్తూ, తన వాదనలు వినాలని కోరుతూ ఫిర్యాదుదారుడైన ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ఆళ్ల పిటిషన్‌లో సరైన కారణాలు లేవని పేర్కొంటూ దానిని కొట్టివేసింది. అనంతరం సిఐడి క్లోజర్ రిపోర్ట్‌ను ఆమోదిస్తూ కేసును మూసివేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది.

ఇదిలా ఉంటే ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగించాలని, చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఆళ్ల రామకృష్ణారెడ్డి గతంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. అయితే, ఆ పిటిషన్లకు విచార ణార్హత లేదని స్పష్టం చేస్తూ హైకోర్టు వాటిని కొట్టివేసింది. తాజాగా ఎసిబి కోర్టు తీర్పుతో చంద్రబాబుతో పాటు ఇతరులకు ఈ కేసులో క్లీన్‌చిట్ లభించినట్లయింది.

# భార్య పుట్టింటి ఆస్తిపై భర్తకు హక్కు లేదు

## - హైకోర్టు స్పష్టీకరణ




విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: వారసత్వ ఆస్తి విషయంలో తలెత్తిన ఒక వివాదంలో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సంతానం లేకుండా మరణించిన హిందూ వివాహిత మహిళకు ఆమె తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై భర్తకు ఎలాంటి హక్కు ఉండదని స్పష్టం చేసింది. ఆ ఆస్తి తిరిగి ఆమె తండ్రి తరఫు చట్టబద్ధ వారసులకే (లీగల్ హెయిర్స్) చెందుతుందని తేల్చిచెప్పింది. హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(2)(ఏ) ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతోందని న్యాయస్థానం పేర్కొంది. అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ ఆస్తి వివాదంలో ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ ఇచ్చిన పరస్పర విరుద్ధమైన ఆదేశాలను పరిష్కరిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన చిక్కాల వెంకాయమ్మకు 1.50 ఎకరాల భూమి ఉంది. ఆమె తన మొదటి మనవరాలు శ్రీవిరితకు ఆ భూమిని 2002లో గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చారు. శ్రీవిరిత పేరు రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదైంది. అయితే, శ్రీవిరిత 2005లో సంతానం లేకుండా అకాల మరణం చెందారు. దీంతో నాయనమ్మ వెంకాయమ్మ 2007లో ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి, 2011లో అదే భూమిని తన రెండో మనవరాలైన దేవిక మానసకు గిఫ్ట్‌గా రాశారు.

ఈ క్రమంలో, రికార్డుల్లో దేవిక పేరు చేర్చాలని నర్సీపట్నం ఆర్డీఓ 2017లో ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ శ్రీవిరిత భర్త శ్రీరామదొర, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ వద్ద రివ్యూ పిటిషన్ వేశారు. విచారించిన జెసి, ఒకసారి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయలేరని, శ్రీరామదొరకు అనుకూలంగా 2023లో ఉత్తర్వులిచ్చారు. జెసి ఉత్తర్వులను సవాలు చేస్తూ దేవిక మానస హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం, హిందూ వారసత్వ చట్టం ప్రకారం శ్రీవిరితకు తల్లిదండ్రుల వైపు నుంచి సంక్రమించిన ఆస్తిపై ఆమె భర్త శ్రీరామదొరకు హక్కు ఉండదని స్పష్టం చేసింది. అంతేకాకుండా, గిఫ్ట్ డీడ్ రద్దును సవాలు చేసే హక్కు శ్రీవిరితకు మాత్రమే ఉంటుందని, ఆమె భర్తకు ఆ హక్కు లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో జెసి ఉత్తర్వులను రద్దు చేస్తూ, దేవిక మానస పేరును రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలని పాయకరావుపేట తహసీల్దార్‌ను హైకోర్టు ఆదేశించింది.

# సామాన్య కుటుంబాలకు పెనుభారం

## ఆస్తి పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: పట్టణాలలో ఆస్తి పన్ను పెంపు ఇప్పటికైనా ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బుధవారం బాబూరావు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి 2020వ సంవత్సరంలో, నాటి వైసిపి ప్రభుత్వం పట్టణాలలో అద్దె విలువ ఆధారిత ఇంటి పన్ను (ఆస్తి పన్ను) స్థానంలో ఆస్తి విలువ ఆధారిత పన్ను (క్యాపిటల్ వాల్యూ) విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. చట్ట సవరణ (44/2020) చేసిందని, 2020లో జీవో నెంబర్ 198 విడుదల చేసిందని తెలిపారు. 2021-22 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఆనాడు ఉన్న పన్నుపై 15 శాతం పెంచుతున్నారు అని తెలిపారు. టిడిపి ఆనాడు ప్రతిపక్షంలో ఉండి క్యాపిటల్ వాల్యూ విధానాన్ని వ్యతిరేకించిందని, ఈ విధానాన్ని సమీక్షి స్తామని హామీ ఇచ్చిందని, ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నది అని గుర్తు చేశారు. పన్నులు తగ్గిస్తామని ప్రజాప్రతినిధులు మాట ఇచ్చారని తెలిపారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా క్యాపిటల్ వాల్యూ విధానం రద్దు కాలేదని చెప్పారు. పన్నుల పెంపు ఆగలేదరని అన్నారు. వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇంటి పన్ను పెంచుతున్నదని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలలో ఇంటి పన్ను రెట్టింపు అయ్యిందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నుల డిమాండ్ నోటీసులు కొద్ది రోజుల్లో విడుదలవుతాయని తెలిపారు. గత శాసనసభ సమావేశాల్లో ఆస్తి పన్ను పెంపుపై చర్చ జరిగినా ప్రభుత్వం నోరు మెదపటం లేదు అని అన్నారు. మళ్లీ ఈ సంవత్సరం కూడా ఇంటి పన్ను పెంపుకు రంగం సిద్ధమయ్యిందన్నారు. 2021వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం పెరిగిన పన్నుపై 15 శాతం పెంచడం వలన దాదాపు ఇప్పటికే పన్ను పెంపు 30శాతానికి చేరిందని, ఇదేవిధంగా పెంపుదల కొనసాగితే 2029 నాటికి పన్ను పెంపు 45శాతానికి చేరుతుందన్నారు. రాష్ట్రంలోని 123 నగరాలు, పట్టణాల్లో ఉన్న ఆస్తి పన్ను డిమాండ్ 2021లో రూ.2450 కోట్లు కాగా నేడు రూ.3900 కోట్లకు చేరుకున్నదన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదాయం కోసం ఆస్తి విలువలను పెంచి, అధిక రిజిస్ట్రేషన్ చార్జీలను వసూలు చేస్తున్నదన్నారు. ఆస్తి విలువలను ప్రభుత్వం పెంచడం వలన, దాని ఆధారంగా ఇంటి పన్ను నిరంతరం, ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటుందని, దీనికి అంతం లేదు అని చెప్పారు. ఇళ్ల పట్టాలు లేని పేదల ఇళ్లను అక్రమ నిర్మాణాలుగా ముద్ర వేసి, పెంచిన పన్నుపై 100శాతం ప్రతి సంవత్సరం అధికంగా పెనాల్టీ వసూలు చేయటం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆస్తి పన్ను పెంపు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

2-4Pg7exHMNWJQE 11_2-4Pg7exHMNWJQE.qxd 01/Apr/26 11:30 PM Page 1



**అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

# రాష్ట్రాభివృద్ధికి చరిత్రాత్మక ముందడుగు

### - 20సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్



సచివాలయం, ఏప్రిల్ 1 ప్రభాత వార్త: అమరావతి రాజధాని చట్ట బద్ధతకు సంబంధించిన బిల్లుకు లోకసభ ఆమోదం లభించడం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక మైలు రాయిగా నిలిచిందని 20సూత్రాల కార్యక్రమాల అమలు (వికసిత్ భారత్ - స్వర్ణాంధ్ర) చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా అమరావతిని ఏకైక రాజధానిగా బలోపేతం చేయ డానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోడీకి, కేంద్ర మంత్రి అమిత్‌షాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడు తూ 2014 పునర్వ్యవస్థికరణ చట్టంలోని సెక్షన్ 5(2) సవరణకు కేంద్రానికి ప్రతిపాదించేందుకు మార్చి 28న రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానించడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచి పోతుందన్నారు. అమరావతి నిర్మాణంలో భాగ స్వామ్యమైన రైతులు త్యాగాలను ప్రభుత్వం ఎల్ల ప్పుడూ గౌరవిస్తుందని, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమా ణాలతో అమరావతిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్మార్ట్ సిటి కాన్సెప్ట్‌కు అనుగుణంగా మౌలిక వసతుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేసిన వ్యాఖలపై ఆయన స్పందిస్తూ భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర, కేంద్ర, ఉమ్మడి జాబితాల్లో లేని అంశాలు 4వ జాబితా కిందకు వస్తాయని, ఆ జాబితాలోని అంశాలకు చట్టబద్ధత కల్పించే అవకాశం పార్లమెంట్‌కి మాత్రమే ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. గత పాలకులు లేని అధికారాన్ని ఊహించుకొని మరల అసెంబ్లీలో తీర్మానం చేస్తామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం రాజధాని అభివృద్ధికే కాకుండా రాష్ట్ర సమగ్ర పురోగతికి దోహదపడే కీలక అడుగ్గా నిలుస్తుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని లంక దినకర్ పేర్కొన్నారు. ప్రజలు జీవితాంతం టిడిపి, బిజెపి, జనసేన పార్టీల డబుల్ ఇంజన్ సర్కార్‌ని గుర్తు పెట్టుకుంటారన్నారు.

# వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతి

- పార్లమెంట్ చట్టబద్ధత కల్పించినందుకు ప్రధాని మోడీకి ధన్యవాదాలు
- అమరావతి రాజధాని విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి అమోఘం
- రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు అభినందనలు
- జగన్ వ్యాఖ్యలు పట్ల వైసిపి నేతలే ముక్కున వేలేసుకుంటున్నారు
- విలేకర్ల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును లోక్‌సభ ఆమోదించడం ప్రతి తెలుగోడు గర్వించే విషయం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబం ధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొ న్నారు. బుధవారం విజయనగరంలో విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎపి ప్రజలందరికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. దేశ పటంలో ఎపి రాజధాని ఎక్కడ అన్న సందిగ్ధతకు తెరదించుతూ ఈ నిర్ణయం తీసుకున్నందుకు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు ప్రధానమంత్రి మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ఎపికి ఆంధ్రులు గర్వించే ప్రపంచ స్థాయి రాజధాని కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో తాపత్రయపడ్డారని ఆయన కృషి అమోఘం అని కొనియాడారు. శాతవాహనులు పాలించి ఎంతో చరిత్ర ఉన్న అమరావతిని నాడు రాజధానిగా బాబు ఎంపిక చేశారని గుర్తు చేశారు. నాడు చంద్రబాబు 29 వేల మంది రైతులను ఒప్పించి 33 వేల ఎకరాలు సేకరించి అమరావతిని ప్రజా రాజధానిగా ఎంపిక చేశారని రాజధానికి భూములు ఇచ్చిన రైతులందరికి మంత్రి అభినందనలు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో జగన్ తీసుకువచ్చిన మూడు రాజధానులు పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ మచిలీపట్నం- విజయవాడ- గుంటూరు నగరా లను కలుపుతూ మావిగన్ పేరుతో కొత్త పల్లవి అందుకోవడం చూస్తుంటే... ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ఉందన్నారు. రాజధాని విషయంలో జగన్ మతిభ్రమించి మాట్లాడుతూ పూటకో మాట రోజుకో నిర్ణయంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ఎంత వరకు అధికారమే పరమావధిగా ఆలోచన చేస్తున్నారే తప్పా రాష్ట్ర ప్రజలకు ఏం కావాలి ? రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందాలన్న? ఆలోచన ఆయనకు లేదని మంత్రి తేల్చిచెప్పారు. జగన్ వ్యాఖ్యల పట్ల వైసిపి నేతలే ముక్కున వేలేసుకుంటున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తర్వాత తరానికి మనం ఎంత గొప్ప రాష్ట్రాన్ని, రాజధానిని అందించాం అన్నదే ముఖ్యమని, ప్రజలు ఆమోదించిన అమరావతి భవిష్యత్తులో ప్రపంచ స్థాయి నగరంగా ఎదుగుతుందన్న ఆకాంక్ష మంత్రి వ్యక్తం చేశారు. ఈ విషయంలో వైసీపీ వాళ్లు అమరావతిని అడ్డుకోకుండా వారి పిల్లలకు కూడా మంచి రాజధాని ఇవ్వాల్సిన బాధ్యత ఉన్న నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా అమరావతికి సపోర్ట్ చేయాలని మంత్రి శ్రీనివాస్ సూచించారు.

## వ్యవసాయ సీజన్‌కు ముందే విద్యుత్ కనెక్షన్లు

### - మంత్రి గొట్టిపాటి రవికుమార్

విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన ్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధి కారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టి నట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, సీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారు లతో సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవ డానికి పనరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజకవర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలి అని ఆదేశించారు. సమావేశంలో సీఎండీలు పుల్లారెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.



# అగ్రికల్చర్ హబ్‌గా రాయలసీమ

- సిఎం సహకారంతో కరువు జిల్లాను అగ్ర ప్రధాన నిలుపుదాం
- సమన్వయంతో అభివృద్ధి సాధిద్దాం
- మంత్రి అనగాని సత్యప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: త్వరలోనే రాయలసీమ రాష్ట్రంలో ఒక అగ్రి కల్చర్ హబ్‌గా మారనుందని శ్రీ సత్యసాయి జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎం.ఎస్.రాజు, కందికుంట వెంకటప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ధర్మవరం నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్, డిసిఎం ఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, ఇతర డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సమావేశాన్ని ప్రారంభించి వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, విద్య, వైద్యం, జిల్లాలో చేపట్టిన పలు రహదారుల నిర్మాణం జిల్లాలోని హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు వివరాలు తదితర అంశాలను సమావేశానికి హాజరైన మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సిఎం సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.

తొలుత జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.రాజు ఆధ్వర్యంలో జరిగిన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పుట్టపర్తి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కి వెళ్లే దారిలో, వై జంక్షన్ సమీపంలోని నూతన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ కార్యాలయం నిత్యం అందుబాటులో ఉంటుందని, కార్యకర్తల సంక్షేమం కోసం కార్యాలయం తలుపులు 24గంటలు తెరిచే ఉంటాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాను తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా చేయడమే లక్ష్యంగా పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.రాజు కష్టపడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

అలాగే పుట్టపర్తిలోని రెవెన్యూ భవన్‌లో నూతనంగా నిర్మించిన ఎస్.ఆర్. శంకరన్ హాల్‌ను మంత్రి అనగాని సత్యప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ హాల్‌ను రెవెన్యూ శాఖ ఉద్యోగుల వినియోగం కోసం అంకితం చేశారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకం అమలులో భాగంగా, ఎనుములపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అలాగే పుట్టపర్తి పురపాలక పరిధిలోని యనుమలపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులు నాగలక్ష్మమ్మకు రూ.4,000, ప్రసాద్ (చేనేత పింఛన్)కు రూ.4,000, నాగరాజుకు మెడికల్ పింఛన్ కింద రూ.15,000 నగదును మంత్రి చేతుల మీదుగా అందజేశారు. నల్లమాడ మండలం గోపీపల్లి గ్రామం సుమారు 80 ఎకరాల చుక్కల భూములకు జిల్లా కలెక్టర్, జెసిలు, ప్రత్యేక చొరవ చూపించి 125 మంది రైతులకు సంబందించిన 169 యల్ పియంలు 305.68 ఎకరముల భూమిని చుక్కల భూముల నుండి పట్టా భూములుగా మారుస్తూ చారిత్రాత్మక ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చేతుల మీదుగా గోపీపల్లి గ్రామ రైతులకు ఎన్‌ఓసి కాపీలను జారీ చేశారు.

# అమరావతికి చట్టబద్ధత చరిత్రాత్మక ఘట్టం

- మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాడారని మంత్రి ఆనం విమర్శలు
- జెండాదిబ్బ గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రామనారాయణరెడ్డి హామీ



సంగం (నెల్లూరు), ఏప్రిల్ 1 ప్రభాతవార్త: జెండాదిబ్బ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. నేడు లోక్ సభ సాక్షిగా ఆంధ్రుల రాజధాని అమరావతి చట్ట బద్ధత బిల్లుకు ఆమోదం తెలపడం చారిత్రాత్మక ఘట్టమని మంత్రి ఆనం హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి రాజధాని లేకుండా చేసిన ఘనడు జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడేడని విమర్శించారు. విశాఖ పట్టణం తీరాన 700 కోట్లతో విలాస వంతమైన ప్యాలెస్ నిర్మించుకున్న ఘనడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వం హైయాంలో జగన్‌మోహన్‌రెడ్డి పది లక్షల అప్పులు మిగిల్చిపోయాడని ఆయన విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి చేసిన అప్పుకు గాను ప్రతి సంవత్సరం లక్షా యాభై వేల కోట్ల రూపాయాలు వడ్డి కడుతున్నామని అన్నారు. జెండాదిబ్బలో ఎన్‌టిఆర్ భరోసా పించన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తనకు భారీ మెజార్టీ ఇచ్చిన జెండా దిబ్బ ప్రజల రుణం తీర్చుకోవడం తన బాధ్యత అని అన్నారు. రూ.కోటి 51 లక్షలతో పూర్తి అయిన జెండాదిబ్బ సిమెంట్‌రోడ్‌ను మంత్రి ప్రారంభించారు. మరో రూ.30 లక్షలు సిమెంట్‌రోడ్లుకు ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలం పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు.

**మంత్రికి గజమాలలతో ఘన స్వాగతం:** దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కంచర్ల నారాయణనాయుడు, కంచర్ల నరేష్‌నాయుడు, కంచర్ల సురేష్, నాయకులు కార్యకర్తలు క్రేన్‌తో ఘన స్వాగతం పలికారు. పెద్దఎత్తున బాణా సంచాను కాల్చారు. ఈ కార్యక్రమంలో వేదిక పైన నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సోమశిల ప్రాజక్టు చైర్మన్ కేశవచౌదరి, స్టేట్ డైరక్టర్ అబ్బురు రమేష్ నాయుడు, తహసిల్దారు సోమ్లానాయక్, ఎంపిడిఒ షాలెట్, పంచాయతీరాజ్ డిఇ సుధాకర్‌రెడ్డి, పంచాయితీరాజ్ ఏఇ మల్లికార్జునరావు, ట్రాన్స్‌కో ఏఇ మన్మదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, గువ్వాడి వేణుబాలు, పర్వతాల వెంకటరత్నం, పఠాన్ ఫయాజ్, షేక్ సర్దార్, ఎస్‌కె ఆసీఫ్, సూరాయపాళెం పవన్, గువ్వాడి చంద్రశేఖర్, పతకమూరి నరసింహరావు, షేక్ ముజీబ్, మండల నాయకులు పగడాల రఘురామయ్య, మర్రిపాడు నాయకులు జనార్దన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం

### ధరల తేడాపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతాం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిది: మొక్కజొన్నరైతులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు రైతులకు భరోసా ఇచ్చారు. మొక్కజొన్న ధరల విషయంలో రైతులు ఏవిధమైన ఆందోళనకు గురికావద్దని హితవు పలికారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొక్కజొన్న రైతుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారని, కేంద్రానికి లేఖరాసి పరిస్థితిని వివరించారని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర నుండి అదనపు సహాయం, నిధులు తీసుకురావటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల ఇబ్బదుల్ని గమనించిన కేంద్రం సాయం చేస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. అధిక పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, గల్ఫ్‌యుద్ధం నేపథ్యంలో మార్కెట్ ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కొన్ని రాజకీయపార్టీలు మార్కెట్‌లో ధరలు పడిపోయాయంటూ రైతుల్లో భయాందోళనలు కలిగించటం దారుణమన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలవల్ల రైతులకు మరింత ఇబ్బందులు సృష్టించటం తగదని హితవు పలికారు. గతంలో పంటల మార్కెట్ ధరలు తగ్గినప్పుడు రాష్ట్రప్రభుత్వం ఆదుకుందని గుర్తుచేసారు. మామిడి, వరి, మిర్చి, పొగాకు, కోకో, ఉల్లి, టమాట తదితర పంటలకు మార్కెట్ ధరలు తగ్గినపుడు ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుందన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందిస్తూ, సాగునీటి ఇబ్బందులు తొలగించి, పెట్టుబడి సాయం అందిస్తూ రైతులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. మొక్కజొన్న కొనుగోలు దారులు రైతుల పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ధరలు పెంచాలని సూచించారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాద్యతాయుతంగా వ్యవహరిస్తూ వారిని అన్నివిధాల ఆదుకునేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న రైతులు ఏమాంత్రం నిరాశచెందవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

# బాణాసంచా ఘటనపై సిట్ విచారణ




కాకినాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో గత ఫిబ్రవరి 28న జరిగిన బాణాసంచా ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ (ప్రత్యేక విచారణ బృందం) బుధవారం విచారణ నిర్వహించింది. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్, ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ వేట్లపాలెంలో ప్రమాదాని కి గురైన బాణాసంచా పరిశ్రమ ప్రాంతాన్ని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లాఎస్పీ బింధు మాధవ్ ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విచారణ విచారణ కమిటీ సభ్యులు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ సామర్లకోట బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన సంఘటనలో 28 మంది చనిపోగా ముగ్గురుకు గాయాలు అయ్యాయన్నారు. ఈ సంఘటన కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకుందని దీనిపై మరింత క్షుణ్ణంగా ఎంక్వైరీ చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని, ఈ ఎంక్వైరీ కమిటీ బాణాసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరగడానికి గల కారణాలు, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను, గత కొద్ది నెలల క్రితం జరిగిన సంఘటనపై కమిటీ సూచించిన సూచనలు ఎంతవరకు ఇక్కడ అమలయ్యాయి వంటి అంశాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం నుంచి ఇప్పటికే కొంత సమాచారం సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎంక్వయిరీలో భాగంగా నేడు బాణసంచ పేలుడు సంఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదం నుంచి బయటపడ్డ ఇద్దరు వ్యక్తులను విచారించడం జరిగిందన్నారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులు రెవిన్యూ, పోలీస్, ఫైర్, కార్మిక, ఫ్యాక్టరీస్ ఇతర అధికారులను కూడా విచారించడం జరిగిందన్నారు. డిపిఓ నుంచి ఇంకొంత సమాచారం సేకరించాల్సి ఉందని వీటన్నిటినీ క్రోడీకరించుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పరిశీలన ప్రకారం ఈ సంఘటన లో ప్రభుత్వం నుంచి జారి చేసిన లైసెన్స్ కు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. నిబంధనల ప్రకారం15 కిలోల ముడుసరుకు, పదిమంది కంటే తక్కువ కార్మికులు ఉండాల్సిన చోట వందల కిలోలు ముడి సరుకుతో పాటు, 38 మందికి పైగా పనివారు ఉన్నట్లు గుర్తించామన్నారు. బాణసంచా తయారీ కేంద్రం వద్ద షెడ్ల నిర్మాణంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. వీటన్నిటిని బట్టి ప్రమాద నివారణ జాగ్రత్తలు సక్రమంగా పాటించలేదని గమనించామన్నారు. ఇదే ప్రాంతంలో ఇలాంటి మరికొన్ని యూనిట్లు ఉన్నాయని విటిన్నిటిలో భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టంలోని అన్ని నిబంధనలు కఠినంగా అమలు అయ్యేలా తగు చర్యలు తీసుకోవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో ఎంక్వయిరీ కమిటీ వెంట పెద్దాపురం ఆర్డీవో ఎన్.శ్రీధర్, నోడల్ అధికారి బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి ఇక చట్టబద్ధ రక్షణ

### ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త బ్యూరో: "అమరావతి ఆంధ్రుల గౌరవాన్ని పెంచే అద్భుత రాజధానిగా మారబోతోందని" ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందడం ద్వారా ఏపీకి అమరావతి ఒకటే ఏకైక రాజధాని అని స్పష్టమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం2014 ప్రకారం ఆంధ్రులకు దక్కాల్సిన హక్కులను పార్లమెంట్ వేదికగా పునరుద్ఘాటించడం శుభపరిణామన్నారు. గత ఐదేళ్ల అంధకారం తొలగిపోయి, నవ్యాంధ్ర నిర్మాణానికి మళ్లీ పునాది పడిందన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదల, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ సహకారం, యువ నేత లోకేష్ బాబు వేగం, మేధస్సుతో అమరావతి నగరం అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతుందన్నారు. తమ హయాంలో అత్యంత అద్భుతమైన, సుంద రమైన నగరం రూపుదిద్దుకోబోతుండటం జీవి తాంతం గుర్తుండిపోయే ఓ మధురానుభూతి అని, ఒక మైలురాయిగా శాశ్వతంగా నిలిచిపోతుం దన్నారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి లోక్‌సభ ఆమోద ముద్ర వేయడం చాలా సంతో షించదగ్గ విషయమన్నారు. పారిశ్రామిక, విద్యా, వైద్య, ఇతరత్రా అనేక రంగాల్లో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. అమరా వతి నగర నిర్మాణం తమ నాయకుడు చంద్రబాబు చేతుల మీదుగా జరుగుతుండటం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. విశ్వ వ్యాప్తంగా ఉన్న ప్రతి ఆంధ్రుడు గర్వపడే మధుర క్షణమన్నారు. ఇలాంటి ఆనంద సమయంలో కూడా ఒక విషపక్షం వైసీపీ లోక్‌సభలో తన సభ్యులచే వాకౌట్ చేయించడం అత్యంత దుర్మార్గం, దురదృష్టకరమని ఆవేదన చెందారు. జగన్మోహన్ రెడ్డి చేసిన ఒక చారిత్రాత్మక తప్పుగా దీనిని చెప్పవచ్చున్నారు.



# సింహవాహనంపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్లు

### - కమనీయంగా చైత్రమాస బ్రహ్మోత్సవాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో నాలుగోరోజు బుధవారం చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలు విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీమల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అర్చక స్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో మూలమంత్ర హవనములను పూర్తి చేశారు. సాయంత్రం 5గంటలకు ఉపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. బ్రహ్మోత్సవ వాహన సేవలో భాగంగా సాయంత్రం 5 గంటలకు శ్రీ మల్లేశ్వరస్వామివారు అమ్మవార్లతో కలిసి సింహ వాహనంపై బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీస్వామి అమ్మవార్ల వాహనసేవలో పలు రకాల విన్యాసాలతో భక్తులు ముందు సాగారు. కోలాటాలు, తప్పెట్లు, సాము గిరికీలు, భజన బృందాలు, శంఖ, భేరి, ఢక్క, ఢమరుక నాదాలతో స్వామి అమ్మవార్లకు పలు భక్తబృందాలు నీరాజనాలు పలుకుతూ వాహనసేవకు ముందుగా కదులుతుండగా తమ ప్రాంతాలకు వచ్చిన శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా ప్రాంత భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి పండ్లు, పూలు సమర్పించి మొక్కుకున్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలకమండలి, అర్చకస్వాములు, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వైభవంగా శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం:** దుర్గమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామి అమ్మవార్ల తరపున పలువురు ప్రముఖ పండితోత్తములు పాల్గొని కళ్యాణ రాయభారం జరిపారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణం నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్ర పఠనాలతో శ్రీస్వామి అమ్మవార్లకు పుష్పమాలాకృతులను చేసిన అర్చకస్వాములు మంగళసూత్రధారణ గావించారు. కార్యక్రమంలో చైర్మన్, ఇఓ, పాలకమండలి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**భక్తుల సౌకర్యాలు ప్రధానం:** దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు పి.రాఘవరాజు, ఎ. శ్రీనివాసరావు వార్లు దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలసి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు గురించి క్షేత్రస్థాయి పర్యటన జరిపారు. కనకదుర్గ నగర్‌లో ప్రసాదాల కౌంటర్స్ ప్రక్కన భక్తులకు ఎండ వేడిమి నుండి రక్షించే షెడ్ ఏర్పాట్లు, సురక్షిత మంచి నీటి ప్లాంట్ ఏర్పాటు పరిశీలించి, బ్యాటరీ వాహనంలో ఘాట్ రోడ్ వైపు వెళ్లారు. ఘాట్ రోడ్‌లో ఆన్‌లైన్ సేవా కేంద్రం, దర్శనం క్యూలైన్లు మార్పులు, లగేజ్, చెప్పులు స్టాండ్స్ ప్రదేశాలను పరిశీలన చేశారు. వాహనాల పార్కింగ్ విషయంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దిశగా ఆలోచించి, భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యవంతమైన సేవలు అందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్యూ లైన్ ద్వారా ప్రధాన ఆలయం వరకు ఈ బృందం ప్రయాణించి, భక్తులకు త్రాగునీరు, ఫ్యాన్ సౌకర్యాలు పరిశీలన చేశారు. లిఫ్ట్‌మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన బెంచీలను ఇఓ పరిశీలించారు.

## పెరుగుతున్న మండుటెండలు

విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో వేసవి ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. 34 నుంచి 38 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేసవికాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయని, ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదు కానున్నాయి. ఈ మేరకు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు మించే అవకాశం ఉంది. ఇది కేవలం ఉష్ణోగ్రతల పెరుగుదల మాత్రమే కాదు, వ్యవసాయం, ఆరోగ్యం, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎన్ఐడీఎం వాతావరణ శాస్త్రవేత్త సత్యనారాయణ తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని సూచించారు.

02-04pg 12 ONG_02-04pg10.qxd 01/Apr/26 10:04 PM Page 1



## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# విశ్వనాథ్, సచిన్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్-2026 లో భారత బాక్సర్లు విశ్వనాథ్ సురేష్, సచిన్‌లు ఘన విజయాలు సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. ఉలాన్‌బాతర్‌లో బుధవారం జరిగిన పురుషుల 50 కేజీల విభాగంలో పోటీపడిన విశ్వనాథ్ సురేష్, కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన బెక్జాత్ ఎర్గేషోవ్‌ను 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించి ఆధిపత్య ప్రదర్శన కనబరిచాడు.



ఈ భారత బాక్సర్ కచ్చితత్వంతో, సమర్థవంతమైన రింగ్ నిర్వహణతో బౌట్‌ను తన అదుపులో ఉంచుకుని, సునాయాసన విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. తదుపరి రౌండ్‌లో కజకిస్తాన్‌కు చెందిన, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, ఇటీవలి ప్రపంచ కప్ విజేత అయిన సంజార్ తాష్కెన్‌బేతో మరింత కఠినమైన సవాలును ఎదుర్కోనున్నాడు. అలాగే పురుషుల 60 కేజీల విభాగంలో, సచిన్ మంగోలియాకు చెందిన బుయాండలై బాయర్ఖూపై 4-1 తేడాతో స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని సాధించాడు. ఈ బౌట్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. కానీ సచిన్ సంయమనం పాటించి స్కోర్ కార్డులలో స్వల్ప ఆధిక్యంతో ముందంజలో నిలిచాడు. టోర్నమెంట్‌లో తన విజయ పరంపరను కొనసాగించే ప్రయత్నంలో, అతను తన రాబోయే పోరులో చైనీస్ తైపీకి చెందిన చెంగ్‌వీ లీతో తలపడనున్నాడు.

# ఫిడే కాండిడేట్స్‌లో ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే కాండిడేట్స్-2026 టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద తొలి ఓటమి చవిచూశాడు. మహిళల విభాగంలో భారత్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ తన ఆటను డ్రా గా ముగించింది. సైప్రస్‌లో జరిగిన ఈ పోటీలో ఆధిక్యాన్ని కోల్పోయిన ప్రజ్ఞానంద ఈ టోర్నమెంట్‌లో ప్రత్యర్థి ఎత్తులకు చిత్తయ్యాడు. ఈ ఓటమితో ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానానికి పడిపోయి, ప్రస్తుతం సంయుక్త అగ్రగాములుగా



ఉన్న ఫాబియానో కరువానా (యూఎస్ఏ), జవోఖిర్ సిందరోవ్ (యూజెడ్బీ)ల కంటే ఒక పాయింట్ వెనుకబడ్డాడు. అలాగే దివ్య దేశ్‌ముఖ్ రౌండ్3లో అలెగ్జాండ్రా గోర్యాచ్కినాతో జరిగిన మ్యాచ్‌లో వరుసగా తన మూడవ డ్రాను నమోదు చేసింది. నల్ల పావులతో ఆడుతున్న దివ్య, గోర్యాచ్కినాకు వ్యతిరేకంగా ఆడిన సిసిలియన్ డిఫెన్స్ యొక్క రూక్‌పాన్ ఎండ్‌గేమ్‌లో కొన్ని తప్పులు చేయడంతో, ఇరుజట్ల స్థానాలు పూర్తిగా తారుమారుఅయి, మ్యాచ్‌డ్రాగా ముగిసింది. ఇకవైశాలి కూడా వరుసగా తన 3వ డ్రాను నమోదు చేసింది. ఉక్రెయిన్‌కు చెందిన అన్నా ముజిచుక్‌తో అత్యంత నాణ్యమైన ఆటలో ఇద్దరు క్రీడాకారులు 98శాతానికిపైగా ఖచ్చితత్వాన్ని కొనసాగించి ఆమెను నిలువరించింది.



## టి20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో..
# అగ్రస్థానాల్లో అభిషేక్, కిషన్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారత్ ఆటగాళ్లు దుమ్ముదులిపారు. టీమిండియా ప్లేయర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ రెండు అగ్ర స్థానాల్లో కొనసాగుతున్నారు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్ ప్రకారం, భారత ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటర్లలో నంబర్ 1, ఇషాన్ కిషన్ టాప్ 2 స్థానాలను నిలబెట్టుకున్నారు. అభిషేక్ 875 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, కిషన్ 849 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. మూడో స్థానంలో పాకిస్తాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ 848 పాయింట్లతో ఉన్నాడు. న్యూజిలాండ్‌లో ఇటీవల జరిగిన దక్షిణాఫ్రికా టీ20ఐ సిరీస్‌లో ఎస్టర్‌హుయిజెన్ 200 పరుగులు చేసి టాప్ 100 టీ20ఐ బ్యాటర్ల జాబితా వెలుపల నుండి మొత్తం మీద 39వ స్థానానికి ఎగబాకాడు. ప్రోటీస్‌పై 81 పరుగులు చేసిన న్యూజిలాండ్ వికెట్ కీపర్ టిమ్ రాబిన్సన్, రెండు స్థానాలు పైకి ఎగబాకి 32వ స్థానాన్ని సమం చేయడంతో పాటు, టీ20ఐ బ్యాటింగ్ జాబితాలో కూడా ముందంజ వేశాడు. ఇంగ్లండ్ వెటరన్ జోస్ బట్లర్ ఒక స్థానం పైకి ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకోగా, న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫెర్ట్ ఒక స్థానం దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోయాడు. బౌలర్ల ర్యాంకింగ్‌లలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లలో తమ ప్రదర్శనల తర్వాత పలువురు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు పెద్ద విజేతలుగా నిలిచారు. పేస్ త్రయం జెరాల్డ్ కోట్జీ (36 స్థానాలు ఎగబాకి 52వ స్థానంలో నిలిచాడు), ఒట్నీల్ బార్ట్‌మన్ (10 స్థానాలు ఎగబాకి 56వ స్థానానికి), మరియు జార్జ్ లిండే (ఆరు స్థానాలు ఎగబాకి 62వ స్థానంలో నిలిచాడు) గణనీయమైన పురోగతిని సాధించారు. ఇక జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా టీ20ఐ ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## ఆసియా కప్ క్వాలిఫైయింగ్‌లో..
# ప్రతీకారం తీర్చుకున్న భారత్
### 2-1 తేడాతో హాంకాంగ్ ఓటమి

**న్యూఢిల్లీ:** హాంకాంగ్‌పై 2-1 తేడాతో విజయం సాధించి, భారత్ తన ఏఎఫ్‌సి ఆసియా కప్ 2027 క్వాలిఫైయింగ్ ప్రచారాన్ని ముగించింది. ఈ మ్యాచ్‌లో ర్యాన్ విలియమ్స్ అరంగేట్రంలోనే గోల్ చేయగా, ఆకాష్ మిశ్రా తన తొలి అంతర్జాతీయ గోల్‌తో బ్లూ టైగర్స్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఈ ఫలితం సాధించినాభారత్ ఐదు పాయింట్లతో గ్రూప్ సి లో అట్టడుగున నిలిచింది. బంగ్లాదేశ్ కూడా ఐదు పాయింట్లతో, మెరుగైన హెడ్ టు హెడ్ రికార్డు కారణంగా భారత్ కంటే ముందు నిలిచింది. అయినప్పటికీ, ఖలీద్ జమీల్ జట్టు, అంతకుముందు రెండు డ్రాల తర్వాత మూడవ రౌండ్‌లో తమ మొదటి విజయాన్ని నమోదు చేశాడు. ఆస్ట్రేలియాలో జన్మించిన ర్యాన్ విలియమ్స్, తన కొత్త దేశం తరఫున తొలి మ్యాచ్ ఆడుతూ నాలుగో నిమిషంలో గోల్ చేసి ఆతిథ్య జట్టుకు ఆరంభ ఆధిక్యాన్ని అందించాడు. మన్వీర్ సింగ్ అందించిన లో క్రాస్‌ను అతను తొలి ప్రయత్నం లోనే గోల్‌గా మలిచాడు. విలియమ్స్ గతంలో ఎఎఫ్‌సి అండర్ 19 ఛాంపియన్‌షిప్ (2012), అండర్ 20 ప్రపంచ కప్ (2013) సహా యువ స్థాయిలో ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఆకాశ్ మిశ్రా ద్వారా 50వ నిమిషంలో భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఇది ఆ లెఫ్ట్‌బ్యాక్‌కు తొలి అంతర్జాతీయ గోల్. 65వ నిమిషంలో ఎవర్టన్ కామార్గో ద్వారా హాంకాంగ్ స్పందించి, మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా ముగించింది.

67వ నిమిషంలో విలియమ్స్ మైదానం వీడటం, అలాగే అన్వర్ అలీ స్థానంలో మరొకరిని తీసుకోవడంతో భారత జట్టుకు ఆఖరి



నిమిషాల్లో గాయాలు మొదలయ్యాయి. ఈ ఎదురుదెబ్బలు తగిలినా ఆతిథ్య జట్టు తమ ఆధిక్యాన్ని కాపాడుకోవడానికి గట్టిగా నిలబడింది. గత ఏడాది జూన్ 10న కౌలూన్‌లో జరిగిన రివర్స్ మ్యాచ్‌లో హాంకాంగ్ చేతిలో 1-0 తేడాతో ఓటమి పాలైన భారత్, ఈ ఫలితంతో ప్రతీకారం తీర్చుకుంది.

# టెస్ట్ క్రికెట్‌ను వన్డేల్లా ఆడిన హీరోలు
### లిస్టులో నంబర్‌వన్ టీమిండియా కింగ్

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్ అనగానే బ్యాట్స్‌మెన్ ఓపికగా, నిలకడగా ఆడే ఫార్మాట్ అని అందరూ భావిస్తారు. కానీ, కొందరు ఆటగాళ్లు మాత్రం తమ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సంప్రదాయాన్ని తిరగ రాశారు. కనీసం 50 టెస్టులు ఆడి, 5000కు పైగా పరుగులు చేసి, 40కి పైగా సగటు కలిగిన ఆటగాళ్లను పరిగణనలోకి తీసుకుంటే అందులో టీమిండియా హీరో కూడా ఉన్నాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో నంబర్ వన్ విధ్వంసకర బ్యాట్స్‌మెన్ ఎవరంటే అందరికీ గుర్తొచ్చే పేరు వీరేంద్ర సెహ్వాగ్. నజఫ్‌గఢ్ నవాబ్‌గా పేరుగాంచిన సెహ్వాగ్, టెస్ట్ క్రికెట్‌ను టీ20 తరహాలో ఆడి రికార్డులు సృష్టించాడు. 82.21 స్ట్రైక్ రేట్‌తో 104 టెస్టుల్లో 8586 పరుగులు చేసిన అతడు, బౌలర్లకు పీడ కలగా మారాడు. ఫార్మాట్ ఏదైనా బంతిని బాదడమే లక్ష్యంగా ఆడే సెహ్వాగ్ శైలి క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. టెస్ట్ క్రికెట్ బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చేసిన మొనగాడిగా చరిత్ర లో నిలిచాడు. రెండో స్థానంలో ఆస్ట్రేలియాకే చెందిన లెజెండరీ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఉన్నాడు. ఏ స్థానం లోనైనా, ఏ బౌలర్‌నైనా ఊచకోత కోయగల సామర్థం ఉన్న గిల్‌క్రిస్ట్ ఏకంగా 81.96 స్ట్రైక్ రేట్‌తో టెస్ట్ ఫార్మాట్‌ను శాసిం చాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెక్కల్లమ్, క్రిస్ గేల్ లాంటివారు ఉన్న విషయం తెలిసిందే. ఇక మూడో స్థానంలో ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ నిలిచాడు. వన్డే తరహాలోనే టెస్టుల్లోనూ విరుచుకుపడే వార్నర్, 74.02 స్ట్రైక్ రేట్‌తో బౌలర్లను హడలెత్తించాడు. అతడి తర్వాత నాలుగో స్థానంలో మరో లంక వీరుడు తిలకరత్నే దిల్షాన్ ఉన్నాడు. తనదైన దిల్‌స్కూప్ షాట్లతో 65.52 స్ట్రైక్ రేట్‌తో అతడు టెస్టుల్లో అలరించాడు. ఈ



జాబితాలోని ఐదో స్థానంలో శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య నిలిచాడు. 110 టెస్టుల్లో 65.27 స్ట్రైక్ రేట్‌తో దాదాపు 7000 పరుగులు చేసిన అతడు ఓపెనర్‌గా బౌలర్లపై ఎదురుదాడి చేయడంలో దిట్ట.

# జీఎస్టీ వసూళ్ల రికార్డు
### మార్చి నెలలో రూ.2 లక్షల కోట్లు రాబడులు




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు సరికొత్త రికార్డు సాధించాయి. 2026 మార్చి నెలలో జీఎస్టీ ఆదాయం తొలిసారిగా రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటింది. ఇవాళ విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం మార్చిలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 2,00,064 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో వసూలైన రూ. 1,83,845 కోట్లతో పోలిస్తే ఇది 8.8 శాతం అధికం. దేశీయంగా స్థిరమైన ఆదాయంతో పాటు దిగుమతులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ. 1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గతేడాదితో పోలిస్తే 8.2 శాతం ఎక్కువ.

మొత్తం 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ. 22.27 లక్షల కోట్లకు చేరాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ. 20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 7 శాతం జీడీపీ వృద్ధితో ముందుకు సాగుతున్న తరుణంలో జీఎస్టీ వసూళ్లు కూడా అదే స్థాయిలో పెరగడం శుభపరిణామమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న వినియోగం, దిగుమతులు, మెరుగైన పన్నుల చెల్లింపుల వ్యవస్థ దీనికి కారణమని వారు అభిప్రాయపడ్డారు. గత 12 నెలలుగా జీఎస్టీ వసూళ్లు వరుసగా రూ. 1.7 లక్షల కోట్ల కంటే పైనే నమోదు కావడం గమనార్హం. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ.1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే ఇది 8.2 శాతం ఎక్కువ. ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.22.27 లక్షల కోట్లకు చేరాయి. ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ.20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి.




# డిజిటల్ చెల్లింపులకు అంతరాయం!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులకు బుధవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువ కనిపించింది. ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా, యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె వంటి ప్రధాన నగరాలతో పాటు కోల్‌కతా, గువాహటి, చెన్నై నుంచి కూడా వినియోగదారులు లావాదేవీలు విఫలమయ్యాయని తెలిపారు. ఈ సమస్యపై చాలామంది ఎక్స్ వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. కొందరి లావాదేవీలు మధ్యలోనే ఆగిపోగా, మరికొందరి యూపీఐ యాప్‌లు పూర్తిగా లోడ్ అవ్వలేదు. ఈ అంతరాయంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన నిర్వహణ పనుల సమయాన్ని ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల వరకు పొడిగించినట్లు తెలిపింది. ఈ సమయంలో యూపీఐ, ఐఎంపీఎస్, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవల్లో అంతరాయం కలగవచ్చని పేర్కొంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు యూపీఐ లైట్, ఈరూపీ (సీబీడీసీ) యాప్, ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది.

## బులియన్ మార్కెట్‌లో
# మళ్లీ పసిడి పరుగులు

**ముంబయి, ఏప్రిల్ 1:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 1,51,500కి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. మరోవైపు కిలో వెండి ధర కూడా రూ. 5,000 పెరిగి రూ. 2.37 లక్షలకు ఎగబాకింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో కొనుగోళ్ల ఆసక్తి పెరగడం ధరల పెరుగుదలకు దోహదపడింది. ఇరాన్‌తో యుద్ధం రెండు, మూడు వారాల్లోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అంతర్జాతీయంగా పసిడి ధరలు బలపడ్డాయి. ఆసియా ట్రేడింగ్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 1.25 శాతం పెరిగి 4,737 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయనే



అంచనాలు కూడా ధరలకు మద్దతునిచ్చాయి. దేశవ్యాప్తంగా సగటున 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,250 మేర పెరిగింది. ఒక గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ. 14,827 పలుకుతుండగా, ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ. 13,591గా ఉంది. ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం ముందురోజు నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. 1,46,733గా ఉంది. మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం మార్కెట్లకు సెలవు కావడంతో అవే ధరలు కొనసాగాయి. ఈ తాజా పెరుగుదలకు ముందు మార్చి నెలలో బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి. ఇంధన ధరల పెరుగుదల, వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి వంటి కారణాలతో గత 17 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా మార్చిలో పసిడి విలువ దాదాపు 15 శాతం క్షీణించింది.

## వాణిజ్యం




# బ్యాంకింగ్ రంగంలో ఖాతా పోర్టబిలిటీకి ఆర్‌బిఐ కసరత్తు

**ముంబయి, ఏప్రిల్ 1:** భారతీయ బ్యాంకింగ్ రంగంలో ఆర్బీఐ విప్లవాత్మక మార్పులు తెస్తోంది. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలోనే, వినియోగదారులు తమ బ్యాంకు ఖాతా నంబర్‌ను మార్చుకోకుండానే ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు మారే సౌలభ్యాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. ఆర్‌బీఐ ఇటీవల ఆవిష్కరించిన ఎమెంట్స్ విజన్ 2028 డాక్యుమెంట్‌లో ఈ కీలక ప్రతిపాదనను చేర్చింది. ఇది అమల్లోకి వస్తే, బ్యాంకింగ్ సేవల్లో కస్టమర్లకు మరింత స్వేచ్ఛ లభించనుంది.ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఆర్‌బీఐ పేమెంట్స్ స్విచ్చింగ్ సర్వీస్ అనే కేంద్రీకృత టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌ను రూపొందిస్తోంది. దీని ద్వారా కస్టమర్ ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు మారినప్పుడు, వారి ఈఎంఐలు, సిప్‌లు, ఇతర ఆటోడెబిట్ చెల్లింపుల ఆదేశాలు అన్నీ ఆటోమేటిక్‌గా కొత్త బ్యాంకుకు బదిలీ అవుతాయి. దీంతో వినియోగదారులు ప్రతిచోటా తమ ఖాతా వివరాలను మాన్యువల్‌గా మార్చుకోవాల్సిన శ్రమ తప్పుతుంది. ప్రస్తుతం బ్యాంకును మార్చడం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. జీతం ఖాతా, పెట్టుబడులు, ప్రభుత్వ పథకాలతో ముడిపడి ఉండటంతో చాలామంది ఇష్టం లేకపోయినా పాత బ్యాంకులోనే కొనసాగుతున్నారు. ఈ కొత్త విధానం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే బ్యాంకును సులభంగా ఎంచుకునే అవకాశం లభిస్తుంది. ఇది బ్యాంకుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచి, సేవల నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడుతుంది. ఖాతా నంబర్ మారకపోయినా కొత్త బ్యాంకుకు సంబంధించిన ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ మారుతుంది. పాత బ్యాంకులో ఉన్న లోన్లు, ఇతర ఆర్థిక బాధ్యతలు, క్రెడిట్ హిస్టరీ వంటివి యథాతథంగా కొనసాగుతాయి. ఈ పోర్టబిలిటీ కేవలం ఖాతా మార్పును సులభతరం చేస్తుంది.

# రికవరీ దిశగా మార్కెట్లు!
### లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 1:** నెలరోజుల్లోనే రూ.51 లక్షలకోట్లు నష్టాలు చవిచూసిన మార్కెట్లు బుధవారం రికవరీ అయ్యాయి. సెన్సెక్స్,నిఫ్టీ రెండూ కూడా లాభాల్లోనే ముగిసాయి. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించేస్తామన్న అమెరికా అధ్యక్షుడి సంకేతాలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. దీనితో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు సద్దుమణుగుతాయని అందరూ భావించారు. బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు నమోదయింది. అమెరికా బాండ్ల రాబడులు కూడా కొంత సానుకూలంగా మారాయి. నిఫ్టీ 22,650 మార్కువద్ద ముగిసింది. పిఎస్‌యు బ్యాంకులు, మెటల్‌స్టాక్స్ ర్యాలీ తీసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1186.77 పాయింట్లు పెరిగి 73,134.32 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ 348 పాయింట్లు లాభపడి 22,679.40 వద్ద ముగిసింది. గడచిన రెండు సెషన్లలో సెన్సెక్స్ 4.41శాతం, నిఫ్టీ 4.18శాతం క్షీణించింది.



బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 2.25 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 3.44 శాతం పెరిగాయి. మొత్తంగ బిఎస్‌ఇ లో 3828 షేర్లుపెరిగితే 508 షేర్లు క్షీణించాయి.105షేర్లు ఎలాంటి మార్పులకు నోచుకోలేదు. ఇక విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో రూపాయి కొంతమేర బలపడింది. 94.70 వద్ద ట్రేడింగ్‌ముగించింది. అంతకు ముందు 94.85వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్‌ఐదు సెటిల్‌మెంట్లు రూ.1,52,038వద్ద ముగిసాయి. అమెరికా పదేళ్ల రాబడులు కూడా 4.281శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్‌లు 30 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 103.67 డాలర్లవద్ద నిలిచింది. ఇక విదేశీ మార్కెట్లపరంగా యుఎస్ డౌజోన్స్ ఫ్యూచర్స్ 302 పాయింట్లుపెరిగింది. యూరోపియన్‌స్టాక్స్ ట్రంప్ సిగ్నల్స్‌తో పెరుగుదల నమోదుచేసింది. స్పెయిన్ ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ 48.7గా నమోదయింది. జర్మనీ పీఎంఐ 52.2పాయింట్లకుపెరిగింది. ఆసియా మార్కెట్లు కూడా ట్రంప్ వ్యాఖ్యలతో గణనీయంగా రికవరీ అయ్యాయి. చైనా ఉత్పత్తిరంగ పీఎంఐ సూచీ 50.8పాయింట్లుగా ఉంది. అమెరికా మార్కెట్లు రాత్రికిరాత్రే ర్యాలీతీసాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 1125.37 పాయింట్లుపెరిగింది. ఎస్అండ్‌పి 500 2.91శాతం పెరిగి 6528.52 పాయింట్లవద్ద ముగిసింది. నాస్‌డాక్ కాంపోజిట్ 21,590.63 పాయింట్లవద్దకు చేరింది. ఇండిగోషేర్లు 6.01శాతంపెరిగితే సీన్సిస్‌టెక్ 11.03శాతం, ఎంటార్ టెక్నాలజీస్ 3.85శాతం, ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఐరెడా 4.21శాతంపెరిగాయి. అలాగే ఆదాని పోర్టులుప్రత్యేక ఆర్థిక మండళ్ల జోన్ 5.47శాతంగా ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps